PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 109 | విజయవాడ, గురువారం 20 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 20 November 2025 | Rs

వన్డే సిరీస్ మనదే

- చివరి వన్డేలో ఓడినా.. సిరీస్ 2-1తో ఇండియా-ఎ కైవసం
- మూడో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా-ఎ 73పరుగుల తేడాతో గెలుపు

8

మన్యంలో పెరిగిన చలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్

మన్యంలో గత కొన్ని రోజులు నుంచి ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌లో కొనసాగుతున్నాయి. వాతావరణంలోని మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతుండడంతో చలి తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏజెన్సీని చలి వణికిస్తోంది. ఉదయం వేళల్లో దట్టంగా పొగ మంచు కమ్మేస్తుండడంతో వాహనాలు లైట్లు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నాయి. ఏజెన్సీలో బుధవారం జి మాడుగులలో 4.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, ముంచింగిపుట్టులో 5.8, చింతపల్లిలో 6.8, డుంబ్రిగుడలో 7.8, పాడేరులో 8.1, పెదబయలులో 8.1, అరకులోయలో 8.3, హుకుంపేటలో 8.8, డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నెత్తుటి తడారని మారేడుమిల్లి

టెక్ శంకర్

అనిత

జ్యోతి

మరో ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి

ప్రజాశక్తి- రంపచోడవరం
(అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం జుజ్జుమామిడివలస గ్రామ అటవీ ప్రాంతం మరోసారి రక్తమోడింది. మావోయిస్టుల నెత్తుటి ధార తడి ఆరడం లేదు. బుధవారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసుల కాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ ముఖ్య సభ్యుడు సహా ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ప్రాంతంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్లో మావోయిస్టు అగ్రనేత హిడ్మా, ఆయన భార్య రాజే సహా ఆరుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో, వరస ఎన్‌కౌంటర్లలో మొత్తం 13 మంది మావోయిస్టులు మృతి చెందడంతో అల్లూరి జిల్లా ఏజెన్సీలో తీవ్ర అలజడి మొదలైంది. ఎన్నడూలేని విధంగా సంవత్సర కాలంలోనే రంపచోడవరం నియోజకవర్గ అటవీ ప్రాంతంలో సుమారు 18 మంది మావోయిస్టులు మృతి చెందడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు భయం గుప్పిట్లో బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొంది. బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్ విషయం తెలుసుకున్న అల్లూరు జిల్లా ఎస్‌పి అమిత్ బర్గర్ సంఘటనా స్థలానికి చేరుకుని మావోయిస్టుల మృతదేహాలను పరిశీలించారు. అనంతరం రంపచోడవరం పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం ఉదయం సుమారు మిగతా 7లో

షమ్మీ

లోకేష్

సురేష్

వాసు

న్యాయ విచారణ జరపండి

- అమాయకులపై వేధింపులు ఆపండి
- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ఏజెన్సీలో రెండు రోజులుగా జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో అమాయకులపై వేధింపులు ఆపాలని పేర్కొన్నారు. మావోయిస్టులను ముందుగానే అరెస్టుచేసి కోర్టు ముందు ఉంచే అవకాశం ఉన్నప్పటికీ అన్యాయంగా బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని వార్తలు వచ్చాయని తెలిపారు. చట్ట విరుద్ధమైన బూటకపు ఎన్‌కౌంటర్లను సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండిస్తోందన్నారు. విజయవాడ, ఏలూరు, కాకినాడ వంటి నగరాల్లో పోలీసులు దాడులు చేసి 50 మందికిపైగా మావోయిస్టులు, వారి అనుయాయులను నిర్బంధించారని పేర్కొన్నారు. వివిధచోట్ల నిర్బంధంలో ఉన్న వీరిని వెంటనే సంబంధిత న్యాయస్థానాల ముందుంచాలని కోరారు. అమయాక గిరిజనులను మావోయిస్టులకు సహకరిస్తున్నారని, మిలీషియాగా పనిచేస్తున్నారని పోలీసులు వివిధ రూపాల్లో వేధిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, వేధింపులను, నిర్బంధాన్ని వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు.

పిఎం-కిసాన్ నిధులు విడుదల

కోయంబత్తూరు సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

కోయంబత్తూరు : పిఎం-కిసాన్ పథకం యొక్క 21వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం విడుదల చేశారు. తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన కార్యక్రమంలో మోడీ ఈ నిధులను విడుదల చేశారు. ఇక్కడి కోడిసియా ట్రేడ్ ఫెయిర్ కాంప్లెక్స్‌లో దక్షిణ భారత సహజ వ్యవసాయ సదస్సును మోడీ ప్రారంభించారు. దేశవ్యాప్తంగా తొమ్మిది కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ 18 వేల కోట్లకు పైగా నిధులను మోడీ విడుదల చేశారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ దేశంలో గత 11 ఏళ్లలో వ్యవసాయ రంగం అనేక సంస్కరణలను చూసిందని అన్నారు. వ్యవసాయ పద్ధతులను ఆధునీకరించడానికి కేంద్రం అనేక చర్యలు తీసుకుందని తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులకు దాదాపు 10 లక్షల కోట్ల రూపాయలకు పైగా సహాయం అందించామని చెప్పారు. బయో-ఎరువులపై జిఎస్‌టి తగ్గింపు కూడా రైతులకు గణనీయంగా సహాయపడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంతమంది రైతులతో ప్రధాని సంభాషించారు. ఐదుగురు ప్రముఖ సహజ వ్యవసాయ రంగ నిపుణులను మోడీ సత్కరించారు. ఈ సదస్సు సందర్భంగా సేంద్రీయ ఉత్పత్తులు, వ్యవసాయ ఆవిష్కరణలు ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల రైతులు ఏర్పాటు చేసిన అనేక స్టాళ్లను ప్రధాని సందర్శించారు.

గేమ్‌ఛేంజర్‌గా వ్యవసాయం

కడప జిల్లా పెండ్లిమర్రిలో రచ్చబండ వద్ద ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

- డిమాండ్ ఆధారిత పంటలు లాభదాయకం
- రాయలసీమకు ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలు
- 'అన్నదాతా-సుఖీభవ', 'పిఎం కిసాన్' నిధుల విడుదల సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం (అగ్రిటెక్)తో వ్యవసాయాన్ని గేమ్‌ఛేంజర్ మారుస్తానని, మార్కెట్ ఆధారిత పంటలు సాగు, డ్రోన్ ఆధారిత సస్యరక్షణ విధానాల అమలు చేయడంతోపాటు రాయలసీమలోని 18 రకాల పండ్లను ప్రపంచంలోని ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలకు సరఫరా చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రి మండలం చిన్నదాసరిపల్లిలో బుధవారం జరిగిన 'అన్నదాతా-సుఖీభవ' 2.0, పిఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమం, పెండ్లిమర్రిలో ఆగ్రోస్ సేవా కేంద్ర పరిశీలన, అనంతరం పెండ్లిమర్రి మండలంలో పంటల పరిశీలన, కార్యకర్తల సమావేశాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వ్యవసాయం లాభసాటిగా మారడానికి పాత పద్ధతుల ద్వారా ముందుకు సాగితే ప్రయోజనం ఉండదన్నారు. పంచసూత్రాల ఆధారంగా కలిసికట్టుగా పనిచేస్తేనే రైతుల మీసాలు మెలేసేలా చేయొచ్చని పేర్కొన్నారు. దీనికి అందరూ సిద్ధంగా ఉండాలని కోరారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, వ్యవసాయాధారిత పరిశ్రమలు, ఆధునిక టెక్నాలజీ వంటి సూత్రాలను ప్రవచించారు. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ముందుకు సాగాలని, డ్రోన్ ఆధారిత మందుల పిచికారీని కెమెరాల సహాయంతో చేయడం ద్వారా తెగులును ఆశించిన మొక్కలకు మాత్రమే మందు పిచికారీ చేయవచ్చని వివరించారు. పట్టిసీమను పూర్తి చేసి ఆ నీటిని రాయలసీమకు మళ్లించానన్నారు. నదుల అనుసంధానం చేసి మిగతా 7లో

ట్రిబ్యునల్ సంస్కరణల చట్టాన్ని కొట్టేసిన సుప్రీం

జ్యుడీషియల్ స్వేచ్ఛను ఉల్లంఘిస్తోందని వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : ట్రిబ్యునల్ సంస్కరణల చట్టం, 2021ని సుప్రీం కోర్టు బుధవారం కొట్టివేసింది. రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు ప్రకటించిన ఆర్డినెన్స్‌ను 'కొద్దిగా సవరించి పునరుత్పత్తి' చేశారని వ్యాఖ్యానించింది. గతంలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన టిబ్యునల్ సంస్కరణల (హేతుబద్ధీకరణ, సేవా నిబంధనలు) ఆర్డినెన్స్, 2021 కీలకమైన ట్రిబ్యునళ్ళకు జరిగే నియామకాలు, వాటి పాలనా, పనితీరులో ప్రభుత్వం జోక్యం చేసుకునేలా వుందని సుప్రీం కోర్టు పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ తీర్పు వచ్చిన రోజుల వ్యవధిలోనే ట్రిబ్యునల్ సంస్కరణల చట్టం రూపొందించింది. ఆ చట్టాన్ని సవాల్ చేస్తూ మద్రాసు బార్ అసోసియేషన్, కాంగ్రెస్ నేత జైరాం రమేష్‌లు దాఖలు చేసిన పిటిషన్లపై విచారించిన సుప్రీం బెంచ్ బుధవారం తాజా తీర్పు నిచ్చింది. వివిధ ట్రిబ్యునళ్ళకు చెందిన సభ్యుల నియామకాలు, కాల పరిమితి, సర్వీస్ పరిస్థితులకు సంబంధించి నిబంధనలను కొట్టివేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన బెంచ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ట్రిబ్యునల్ నియామకాలకు సంబంధించి తాము గతంలో ఇచ్చిన తీర్పులను అమలు చేయలేదంటూ కేంద్రప్రభుత్వ వైఖరి పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గత తీర్పుల సందర్భంగా కొట్టివేసిన కొన్ని నిబంధనలనే కొద్దిగా సవరించి మళ్ళీ ఇప్పుడు తీసుకువచ్చారంటూ బెంచ్ ఆ చట్టంతో విభేదించింది. అధికారాల విభజన, జ్యుడీషియల్ స్వేచ్ఛకు సంబంధించిన సూత్రాలను ఈ చట్టం ఉల్లంఘిస్తోందని కోర్టు పేర్కొంది. లోపాలను సరిచేయకుండా, కట్టుబడి వుండాల్సిన తీర్పులను కూడా చట్టబద్ధంగా ఉల్లంఘించేలా ఈ చట్టం వుందని వ్యాఖ్యానించింది. 2021 జులైలో లేవనెత్తిన అంశాలను పరిష్కరించడానికి బదులుగా వాటినే కొద్దిగా మార్చి ఇలా తీసుకురావడం రాజ్యాంగ ఆధిక్యతను అవమానించడమే కాగలదని బెంచ్ వ్యాఖ్యానించింది. ఈ తీర్పు వచ్చిన నాలుగు మాసాల వ్యవధిలో జాతీయ ట్రిబ్యునల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. ట్రిబ్యునళ్ళ స్వేచ్ఛకు, పారదర్శకతకు, పని విధానంలో ఏకరూపతకు, ఇలా అన్నింటికీ సంబంధించి కీలకమైన వ్యవస్థాగత రక్షణలు కల్పించాల్సిన అవసరం వుందని బెంచ్ పేర్కొంది.

స్థానిక మార్కెట్లను బలోపేతం చేయండి

సత్యసాయి శతజయంతి సభలో ప్రధాని

సత్యసాయి శత జయంతి సందర్భంగా రూ.100 స్మారక నాణేన్ని ఆవిష్కరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, చిత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రఖ్యాత క్రికెటర్ సచిన్ టెండూల్కర్, సత్యసాయి ట్రస్ట్ ఛైర్మన్ రత్నాకర్ ఉన్నారు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎక్కడికక్కడ స్థానిక మార్కెట్లను బలోపేతం చేయడం ద్వారా వికసిత్ భారత్ లక్ష్యానికి ప్రతి ఒక్కరు తోడ్పడాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ కోరారు. సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా పుట్టపర్తిలో బుధవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని, ప్రచారం చేయాలని (వోకల్ ఫర్ లోకల్) అన్నారు. సత్యసాయి బాబా మన మధ్య లేకపోయినప్పటికీ ఆయన చాటిన బోధనలు అందర్నీ నడిపిస్తున్నాయని అన్నారు. 'లవ్ ఆల్ -సర్వ్ ఆల్' అన్న సత్యసాయి మాటలను ఆయన ప్రస్తావించారు. సత్యసాయి ట్రస్టు ద్వారా 20 వేల మందికి సుకన్య సంవృద్ధి యోజన కింద లబ్ధిచేకూర్చే పథకం తేవడం అభినందనీయమని చెప్పారు. తమ ప్రభుత్వంసామాజిక భద్రత కోసం దేశ వ్యాప్తంగా అనేక పథకాలు తీసుకువస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ విద్య, వైద్యం, తాగునీటి వసతిని లక్షల మందికి సత్యసాయి ఉచితంగా అందించారని గుర్తు చేశారు. ప్రేమ ఒక్కటే మతం... హృదయం ఒక్కటే భాష, మానవత్వమే కులం అని ప్రపంచానికి చాటిచెప్పారని అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ సాయి ప్రవచనాలతో ఎందరో ప్రభావితులైనారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సినీనటి ఐశ్వర్యారాయ్ . ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన నాయుడు, భూపతిరాజు , శ్రీనివాస వర్మ తోపాటు రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవితమ్మ, ఆనగాని సత్యకుమార్‌తోపాటు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టి రత్నాకర్, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఛైర్మన్ చక్రవర్తి, సత్యసాయి ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ నిమిష్ పాండే తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో విచ్చేసిన ఆయనకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. ప్రధాని ముందుగా ప్రశాంతి నిలయం సాయి కుల్వంత్ హాలులోని సత్యసాయి బాబా మహా సమాధిని దర్శించుకున్నారు. అనంతరం మిగతా 7లో

మద్యం కేసులో చెవిరెడ్డి ఆస్తులు జప్తు

- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మద్యం కేసులో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆస్తులను ప్రభుత్వం జప్తునకు ఆదేశాలిచ్చింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలని డిజిపి హరీష్‌కుమార్‌కు ఆదేశాలిచ్చింది. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి పేరుతో ఉన్న ఆస్తులతో పాటు కెవిఎస్ ఇన్‌ఫ్రా ఎమ్‌డి చెవిరెడ్డి లక్ష్మీ పేరిట ఉన్న ఆస్తులను కూడా జప్తు చేయాలని ఆదేశించింది. అవినీతి నిరోధక, నేర చట్టాల సెక్షన్ల ప్రకారం జప్తునకు అనుమతించాలని ప్రభుత్వానికి సిట్ విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. చెవిరెడ్డి కుటుంబం గత ప్రభుత్వ హయాంలో రూ.54.87 కోట్లను నల్లధనంగా మార్చినట్లు సిట్ తేల్చింది. ముఖ్యంగా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో భూములు కొనుగోలు చేసినట్లు గుర్తించినట్లు పేర్కొంది. వైసిపి హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని మోసపూరిత భూ లావాదేవీలు జరిపినట్లు సిట్ నిర్ధారించింది.

దివిసీమ ఉప్పెనలో సేవలు ఎంతో మందికి ప్రేరణ

48 ఏళ్ల సంస్మరణ సభలో దత్తాత్రేయ, కొల్లు, మధు, తులసిరెడ్డి

సభలో మాట్లాడుతున్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

ప్రజాశక్తి- అవనిగడ్డ

దివిసీమ ఉప్పెనలో సేవలు ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తాయని పలువురు వక్తలు అన్నారు. కృష్ణా జిల్లా అవనిగడ్డలో బుధవారం 'మానవతామూర్తులకు దివ్య వందనం - 1977 దివిసీమ ఉప్పెన 48 ఏళ్ల సంస్మరణ సభ', మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి.మధు, కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి తదితరులు మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉప్పెన మిగిల్చిన చేదు జ్ఞాపకాలతో ఎంఎల్‌ఎ మండలి బుద్ధప్రసాద్ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం గాంధీక్షేత్రంలో బుద్ధ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో దత్తాత్రేయ మాట్లాడుతూ ఉప్పెన సమయంలో సహాయక చర్యలకు ఆరు నెలలపాటు ఇక్కడ గడిపిన కాలం తన జీవితంలో గొప్ప మార్పు తీసుకువచ్చిందన్నారు. అప్పట్లో నాగాయలంక మండలం పర్రచివర, దిండి, సొర్లగొంది, మూలపాలెం, కోడూరు గ్రామాల్లో నెలకొన్న విషాదం, తాము చేసిన సేవలు ఇంకా తన మదిలో మెదులుతూనే ఉన్నాయని, వేలాది మంది మృతితో నెలకొన్న పెను విషాదంలో సామూహిక దహన కార్యక్రమం నిర్వహించినట్లు గుర్తుచేసుకున్నారు. ఉప్పెన సమయంలో సహాయక చర్యలు, మిగతా 2లో

రష్యా చమురుపై రేపటి నుంచి ఆంక్షలు

- నడి సముద్రంలో నౌకలు..!
- సందిగ్ధంలో 77 లక్షల బ్యారెల్స్ చమురు
- ఆయిల్ కంపెనీల్లోనూ ఆందోళన

అమలుకు నోచని ఫ్లోటింగ్ జెట్టీ

- ఉపాధి కోసం వలస
- పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో బందీలుగా మత్స్యకారులు

3

'నవోదయ' విద్యార్థిని అనుమానాస్పద మృతి

పాఠశాల వద్ద మృతిరాలి కుటుంబసభ్యులు, విద్యార్థులు ఆందోళన

ప్రజాశక్తి- మర్రిపాడు

నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో పదో తరగతి విద్యార్థిని ప్రణీత (15) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పాఠశాల మెట్ల వద్ద ఉన్న గ్రిల్స్‌కు మెడకు ఉరితో వేలాడుతూ మంగళవారం అర్ధరాత్రి కనిపించారు. దీనిపై విద్యాలయం సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఆ విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు చేరుకున్నారు. తమ కుమార్తె మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. ప్రణీత తండ్రి రవికుమార్ కొండాపురం ఎంఇఒగా విధులు నిర్వర్తిస్తున్నారు. మంగళవారం రాత్రి తన కుమార్తెతో మాట్లాడానని, పరీక్షలు బాగా రాయమని చెప్పానని తెలిపారు. తన కుమార్తె ఆత్మహత్యపై అనుమానాలున్నాయని, చదువుల్లో, క్రీడల్లో రాణిస్తున్న తమ కుమార్తె ఇలాంటి చర్యకు పాల్పడేంత బలహీనురాలు కాదని అన్నారు. పాఠశాల యాజమాన్యంపై పలు ఆరోపణలు చేశారు. తోటి విద్యార్థులు పలుమార్లు తనను ఇబ్బందులు పెట్టారని, గదిలో పెట్టి బయట నుంచి తాళం వేసేవారని, పుస్తకాలు దాచేవారని, పలు రకాల వేధింపులకు గురవుతున్నానని తన కుమార్తె తనకు పలుమారు చెప్పిందని తెలిపారు. ఇటువంటి ఘటనలు మరో విద్యార్థినికి జరగకుండా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు పాఠశాల ముందు ఆందోళనకు దిగాయి. ఇటీవల ప్రిన్సిపల్ ఓ విద్యార్థిని కొట్టడంతో విద్యార్థి సంఘాల ఆందోళనకు దిగడంతో ఆయనను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారని, ప్రస్తుత ఇన్‌ఛార్జి మహిళా ప్రిన్సిపల్ విద్యార్థినుల జడలు పట్టుకొని పలు రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి వేధింపుల వల్లే ప్రణీత ఆత్మహత్య చేసుకొని ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ పాఠశాల విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. పోలీసులు జోక్యం చేసుకొని వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రాష్ట్రపతి తిరుపతికి రాక

- పోలీసు కనుసన్నల్లో నగరం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పర్యటనలో భాగంగా తిరుపతి, తిరుమలకు రానున్నారు. ఢిల్లీ నుంచి నౌకాదళ విమానంలో తిరుపతి విమానాశ్రయానికి గురువారం సాయంత్రం 3.20 గంటలకు చేరుకుంటారు. అక్కడనుంచి నేరుగా కారులో 4.20 గంటలకు పద్మావతి అమ్మవారిని దర్శించుకుని 5.20 గంటలకు తిరుమలకు బయల్దేరి వెళతారు. ఆరు గంటలకు పద్మావతి అతిథిగృహం చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు వరాహస్వామిని, పది గంటలకు శ్రీవారిని దర్శించుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో తిరుపతి, తిరుమల పోలీసు కనుసన్నల్లో ఉంది. షాపులు, ఇతర వ్యాపార సంస్థలను పదిరోజులుగా మూసేయించారు. రాష్ట్రపతి పర్యటించే ప్రాంతం మొత్తాన్ని ఎస్‌పి సుబ్బరాయుడు పర్యవేక్షణలో బుధవారం ట్రయల్ కాన్వాయ్ నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి తిరుమల పర్యటించి భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు.

అన్నానికి డబ్బు ఇవ్వలేదని..

వ్యక్తి గొంతుకోసి హత్యచేసిన వైనం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

పట్టపగలే తిరుపతి జిల్లా పుత్తూరులో దారుణహత్య చోటు చేసుకుంది. అన్నం తినేందుకు డబ్బులివ్వలేదని రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని కత్తితో గొంతు కోసి హత్య చేసిన హృదయవిదారకమైన ఘటన అక్కడున్నవారందరినీ షాక్‌కు గురిచేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పుత్తూరు మండలం మిట్టపల్లూరు గ్రామానికి చెందిన రామ్మూర్తిరెడ్డి (48) బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ద్విచక్రవాహనంపై పుత్తూరు వెళుతుండగా రవి అనే వ్యక్తి అన్నం తినేందుకు డబ్బులు అడిగాడు. రామ్మూర్తి రెడ్డి డబ్బు లేదని చెప్పడంతో వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అకస్మాత్తుగా రవి చేతిలో ఉన్న కత్తితో దాడి చేసి ఆయన గొంతు కోసేశాడు. వెంటనే అక్కడనుంచి పరారైందుకు ప్రయత్నించగా స్థానికులు వెంటాడి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న రామ్మూర్తిరెడ్డిని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పుత్తూరు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. హంతకుడు రవి రోజువారీ కూలి పనులు చేస్తూ కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించే రవి అని పోలీసులు తేల్చారు. రామ్మూర్తిరెడ్డి విద్యుత్ శాఖలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నారని సమాచారం.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

పర్మిట్ రూమ్‌లకు

3 సమాన వాయిదాల్లో ట్యాక్స్

- ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పర్మిట్ రూమ్‌లకు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఆర్ఇటి)ను 3 సమాన వాయిదాల్లో చెల్లించేందుకు నిర్వాహకులకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎక్సైజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి ముకేష్ కుమార్ మీనా 2024 ఎక్సైజ్ నియమాలను సవరిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సవరణలో భాగంగా పర్మిట్ రూమ్‌ల నిర్వాహకులు మొదటి విడత ఈ ఏడాది నవంబరు 20న లేక అంతకుముందు, 2వ విడత వచ్చే ఏడాది (2026) మార్చి 20న లేక అంతకుముందు, 3వ విడత వచ్చే ఏడాది 2026 జులై లేక అంతకుముందు చెల్లించాలని పేర్కొన్నారు. లైసెన్స్ వ్యవధి ప్రారంభమైన అనంతరం పర్మిట్ రూమ్ లైసెన్స్ మంజూరు చేయబడిన సందర్భాల్లో, లైసెన్సింగ్ సంవత్సరంలో మిగిలిన కాలానికి వార్షిక రిటైల్ ఎక్సైజ్ పన్నును దామాషా ప్రకారం విధించాలన్నారు.

ఐ బొమ్మ కేసు...రవి కస్టడీకి కోర్టు అనుమతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పైరసీ మూవీ కేసులో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసిన ఐ బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవిని కస్టడీకి అనుమతిస్తూ హైదరాబాద్ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ మూవీ రాకెట్ కేసులో ఆయనను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. రవిని ఏడు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు.. ఐదు రోజుల కస్టడీకి అనుమతిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కస్టడీ విచారణలో మరికొన్ని కీలక అంశాలు వెలుగు చూసే అవకాశముంది.

మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా

ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులకు అదనపు భద్రత

ఇంటెలిజెన్స్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ మహేష్‌చంద్ర లడ్డా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ఏజెన్సీ ప్రాంతంలో కూంబింగ్ యధావిధిగా జరుగుతోందని ఇంటెలిజెన్స్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ మహేష్‌చంద్రలడ్డా పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో వరుసగా రెండు రోజులు జరిగిన ఎన్‌కౌంటర్లు, అరెస్టులపై ఆయన బుధవారం విజయవాడలో ఎస్ఐబి చీఫ్ పిహెచ్‌డి రామకృష్ణ, ఏలూరు డిఐజి అశోక్‌కుమార్, ఎన్‌టిఆర్ సిపి రాజశేఖర్‌బాబు, కృష్ణ, ఏలూరు, కాకినాడ, కోనసీమ ఎస్‌పిలతో కలిసి మీడియాతో మాట్లాడారు. విజయవాడ, ఏలూరు, కాకినాడ, కానూరు ప్రాంతాల్లో 50మంది మావోయిస్టులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు. ఇందులో కొందరు ఎస్‌జడ్‌సిఎం సభ్యుల నుంచి సాధారణ పార్టీ క్యాడర్ వరకు ఉన్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో మావోయిస్టులు లేరని, ఆపరేషన్ కగార్‌లో భాగంగా చత్తీస్‌ఘడ్‌లోని సుక్మా, బీజాపూర్, నారాయణపూర్, బస్తర్ జిల్లాల్లో ఒత్తిడి అధికంగా ఉండటంతో షెల్టర్ జోన్ కింద మావోయిస్టులు పెద్ద ఎత్తున రాష్ట్రానికి వస్తున్నారన్నారు. కొంత కాలం ఇక్కడ ఉండి రాబోవు రోజుల్లో ఎఓబిలో యాక్టివ్ కావాలనేది వారి ఆలోచన అని ఆయన పేర్కొన్నారు.

ఏజెన్సీలో ఈ ఆపరేషన్ మొత్తం రహస్యంగా కొనసాగించామని, ఇందులో స్టేట్ ఇంటెలిజెన్సీ విభాగం, విజయవాడ కమిషనరేట్, కృష్ణ, ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల పోలీసులు సంయుక్తంగా ఒకే సమయంలో ఆపరేషన్ నిర్వహించారన్నారు. మావోయిస్టుల నుంచి పెద్దఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఏజెన్సీలో వరుస ఎన్‌కౌంటర్లు, అరెస్టులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, గతంలో టార్గెట్‌గా ఉన్న వ్యక్తులకు అదనపు భద్రత కల్పించనున్నట్లు లడ్డా తెలిపారు. మావోయిస్టులు దాడులకు తెగబడే అవకాశాలు ఉండొచ్చనే సమాచారంతో ప్రజాప్రతినిధులు, టార్గెట్‌లోని వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలని , ఏచిన్న అనుమానం వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మావోయిస్టులకు సహకరించే వారు ఎవరు? వీరికి వసతితోపాటు సమాచారాన్ని చేరవేసే పనిలో యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహిరిస్తోందన్నారు.

మీడియా సమావేశంలో ఇంటెలిజెన్సీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ మహేష్‌చంద్రలడ్డా తదితర పోలీసు ఉన్నతాధికారులు

అరెస్టయిన వారిలో (ఎస్‌జడ్‌సిఎం క్యాడర్)కీలకనేతలు

మూడు సీనియర్ స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్లు (ఎస్‌జడ్‌సిఎం) ఒకే ఆపరేషన్‌లో అరెస్ట్ అయ్యారు.

సోడి లాచు అలియస్ గోపాల్ -సౌత్ బస్తర్ డివిసి, బిఎన్‌పిసి బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌కంపెనీకి చెందిన వాడు.

పోడియం రెంగు - సుక్మాజిల్లా, పాలమడుగు, పోలంపల్లి పోలీస్‌స్టేషన్ ప్రాంతవాసి.

ఉద్దే రఘు - బీజాపూర్ జిల్లా, పార్సెగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముక్కరం గ్రామానికి చెందిన సీనియర్ ఎస్‌జడ్‌సిఎం, బిఎన్‌పిసి బెటాలియన్ హెడ్ క్వార్టర్స్ కంపెనీ ప్రధాన నిర్వాహకుడు.

అరెస్టయిన వారిలో డివిసిఎం క్యాడర్ నేతలు :

సోటి లక్ష్మ అలియాస్ బీమా -జగర్‌గొండా ఏరియా కమిటీ డివిసిఎం, సుక్మా-జగర్‌గొండా ఆయుధ స్క్వాడ్‌ల సమన్వయ కీలక కమాండర్.

గంగిలక్ష్మీ అలియాస్ మాడే - దర్బా డివిజన్ కేర్కల్పాల్ ఎసికి చెందిన డివిసిఎం, రవాణా మార్గాలు, సపోర్టు నోడ్స్‌లో ప్రసిద్ధి.

మడకం మదన్ అలియాస్ మధన్న అలియాస్ జగ్గు అలియాస్ లక్ష్మా -జగర్‌గొండా ఎసి, ఎస్‌బిటి, డివిసి, డికెఎస్‌జడ్‌సి సీనియర్ డివిసిఎం(జగర్‌గొండా నుంచి కిస్తారం వరకు ఆపరేషనల్ హార్ట్‌లైన్ నిర్వహణ.

మదివి హండా -ఎస్‌బిటి డివిసి కమ్యూనికేషన్ అండ్ సివైపిసి టీమ్ డివిసిఎం, బెటాలియన్ ఫ్రేమ్‌వర్క్‌లో సురక్షిత సందేశాలు, సాంకేతిక సమన్వయ బాధ్యతలు.

హిడ్మా అనుచరుడు

సరోజ్ అరెస్టు

ప్రజాశక్తి- రావులపాలెం (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

పోలీసులు అరెస్టు చేసిన సరోజ్

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో మావోయిస్టు మడివి సరోజ్ అలియాస్ ఓండాను పోలీసులు బుధవారం తెల్లవారు జామున అరెస్టు చేశారు. సిఐ ఎం.శేఖర్‌బాబు తెలిపిన వివరాల మేరకు... మంగళవారం మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా మృతి చెందారు. ఆ సమయంలో కొంతమంది మావోయిస్టులు చెదిరిపోయారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సోదాలు జరుగుతున్నాయి.

ఇందులో భాగంగా రావులపాలెంలోని గౌతమి నది ఏటిగట్టుపై అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో మావోయిస్టు సరోజ్‌గా గుర్తించారు. ఆయన నుంచి ఒక తుపాకీ, పది తూటాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కొత్తపేట కోర్టులో హాజరు పరిచారు. సరోజ్‌ను 14 రోజుల రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు దళానికి కమ్యూనికేషన్ కమాండర్‌గా సరోజ్ వ్యవహరించేవాడని, హిడ్మా ముఖ్య అనుచరుల్లో ఆయన ఒకరని సిఐ చెప్పారు. కాగా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా బూర్గులంక గ్రామానికి చెందిన సరోజ్ 5వ తరగతి వరకూ కుంట గ్రామంలో చదువుకున్నారు. 15 ఏళ్ల వయస్సులోనే మావోయిస్టు పార్టీ పట్ల ఆకర్షితుడయ్యారు. దళసభ్యుడి నుంచి కమ్యూనికేషన్ కమాండర్ స్థాయికి ఎదిగారు. అప్పటి నుంచి హిడ్మాకు అనుచరునిగా ఉన్నారు. 2021లో సిఆర్‌పిఎఫ్ జవాన్లపై జరిగిన దాడిలో ప్రధాన పాత్ర పోషించారని, ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాకలో ఉంటున్నారని పోలీసులు తెలిపారు.

పోస్టుమార్టం గది వద్ద హిడ్మా, రాజేలను కడసారి చూసేందుకు వేచి ఉన్న కుటుంబీకులు

పోలీసు వలయంలో..

హిడ్మా, రాజే మృతదేహాలకు పోస్టుమార్టం

- కడసారి చూసేందుకు వచ్చిన కుటుంబీకులు

ప్రజాశక్తి - రంపచోదరం(అల్లూరి సీతారామరాజు)

అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు అగ్రనేత మడివి హిడ్మా, ఆయన భార్య రాజే మృతదేహాలకు పటిష్ట భద్రత నడుమ బుధవారం రంపచోడవరం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లోకి ఎవ్వరినీ రానీయకుండా సాయుధులైన పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. హిడ్మా, రాజేలను కడసారి చూసుకునేందుకు వారి కుటుంబీకులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా నుంచి బుధవారం మధ్యాహ్నానికి రంపచోడవరం చేరుకున్నారు. హిడ్మా సోదరుడు మడవి హంగా, కుటుంబీకులు దోడి జోగా, బడిసే ఇడిమ, రాజే సోదరి జోడి లలిత, కుటుంబీకుడు మార్కం లలిత్ కుమార్ వచ్చారు. వారిని మాత్రమే పోలీసులు ఆస్పత్రిలోని మార్చురీ గది వద్దకు పంపించారు. విగతజీవులైన హిడ్మాను, రాజేలను చూసి వారు కన్నీరుమున్నీరయ్యారు. ఇదే ఘటనలో చనిపోయిన లక్మల్ అలియాస్ చైతు, కమ్లు అలియాస్ కమలేష్, మల్ల అలియాస్ మల్లు, దేవేల మృతదేహాలకు గురువారం పోస్టుమార్టం నిర్వహించే అవకాశముంది. పోస్టుమార్టం ప్రక్రియను కాకినాడకు చెందిన ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు. ఒక్కో మృతదేహం పోస్టుమార్టానికి మూడు, నాలుగు గంటలసేపు పడుతోంది. ఈసారి మీడియాను కూడా ఆస్పత్రి ప్రాంగణంలోకి పోలీసులు అడుగుపెట్టనీయలేదు. అన్ని విషయాలపై అత్యంత గోప్యత పాటిస్తున్నారు.

'కార్గో'తో ఉద్దానాన్ని విధ్వంసం చేస్తారా?

- రేపట్నుంచి ప్రభావిత గ్రామాల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన
- రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు, పోరాటకమిటీ నాయకులు

కార్గో భూతంతో ఉద్దానం విధ్వంసానికి పూనుకుంటారా అని కేంద్ర పౌరవిమాయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి టి.సన్యాసిరావు, పౌర హక్కుల సంఘం నాయకులు పి.దానేష్, కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు ప్రశ్నించారు. ఎయిర్‌పోర్టు వ్యతిరేక ఉద్యమంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ బుధవారం శ్రీకాకుళం జిల్లా పలాసలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నాకు అనుమతించకుండా నిర్బంధం ప్రయోగించడాన్ని, అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించినా కార్గో ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో ప్రదర్శనలు, నిరసన కార్యక్రమాలను జయప్రదం చేసిన ప్రజలకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో ప్రజల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడమే అభివృద్ధా అని ప్రశ్నించారు. మూలపేట పోర్టుకు కేటాయించిన 2,300 ఎకరాల్లో 300 ఎకరాలు కార్గో ఎయిర్‌పోర్టుకి కేటాయిస్తే సరిపోతుందని సూచించారు. కార్గో ఎయిర్‌పోర్టు ఉద్యమంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలపాలని సమావేశంలో తీర్మానించారు. కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు ఎస్.దిలీప్ కుమార్, జి.తుంబనాథం, గుల్ల ఈశ్వరరావు, బడి సాంబమూర్తి, నల్ల పరుశురామ్, పొట్టి యోగేష్, జనశక్తి నాయకులు కె.రమేష్, జీడి రైతు సంఘం నాయకులు టి.అజయ్ కుమార్, పలు ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అరటి, మొక్కజొన్నలను కొనుగోలు చేయాలి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అరటి, మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అరటికి మార్కెట్ సౌకర్యం కల్పించాలని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అరటి రైతులకు మద్దతు ధర టన్నుకు రూ.15 వేలు చెల్లించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమను ఫ్రూట్స్ బాస్కెట్‌గా అభివృద్ధి చేస్తామన్నారని, కానీ పరిస్థితులు చూస్తుంటే ఫ్రూట్ బాస్కెట్ కాదు... ఫ్రూట్ డస్ట్ బిన్‌గా దిగజార్చినట్లు కనిపిస్తుందన్నారు. కనీస మద్దతు ధర లభించక అనంతపురం జిల్లాలో అరటి రైతులు పంటలను ట్రాక్టర్లతో దున్నేస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు మొక్కజొన్న రైతులు తాము పండించిన పంటకు ప్రభుత్వ మద్దతు ధర అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా నంద్యాల, శ్రీ సత్యసాయి, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, మార్క్‌ఫెడ్ ద్వారా రైతులు పండించిన పంటను ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.2,400 చెల్లించి కనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

దివిసీమ ఉప్పెనలో సేవలు ఎంతో మందికి ప్రేరణ

(తరువాయి)

పునరావాస, పునర్నిర్మాణ కార్యక్రమాల్లో మండలి వెంకట కృష్ణారావు సేవలు చిరస్మరణీయమన్నారు.

రాజకీయాలకు అతీతంగా సేవలు : పి.మధు

విపత్తులు సంభవించినప్పుడు ప్రజలకు సేవ చేయాలనే తపనే ఉండాలి రాజకీయాలకు అతీతంగా వుండాలని పి.మధు అన్నారు. అప్పట్లో గుంటూరు బాపనయ్య ద్వారా ఉప్పెన వివరాలు తెలుసుకుని అప్పటి పార్టీ రాష్ట్ర కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య నేతృత్వంలో 14 మంది ప్రజారక్షక దళంగా సేవలందించినట్లు వివరించారు. కనీసం బహిర్భూమికి వెళ్లడానికి కూడా అవకాశం లేని పరిస్థితుల్లో 62 రోజులపాటు రక్షక దళాలు సేవలందించాయని తెలిపారు. కర్నూలు మెడికల్ కళాశాల, కాకినాడ, గుంటూరు, నెల్లూరు ప్రజావైద్యశాలల నుంచి వైద్యుల బృందాలను రప్పించి సేవలందించినట్లు వివరించారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ 1977 నవంబర్ 19న సంభవించిన ఉప్పెనకు 84 గ్రామాలు తుడిచిపెట్టుకుపోగా రూ.172 కోట్ల ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు. దివిసీమ పున:నిర్మాణానికి మండలి వెంకటకృష్ణారావు, బుద్ధప్రసాద్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, ఎపిఎస్ఆర్‌టిసి చైర్మన్, టిడిపి కృష్ణా జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, మాజీ ఎంఎల్ఎ పాటూరు రామయ్య, రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి శితి కంటానంద మహారాజ్, జాతీయ ప్రకృతి వైపరీత్యాల నిఘా సంస్థ మాజీ సభ్యులు మర్రి శశిధర్ రెడ్డి, దివిసీమ సోషల్ సర్వీస్ సొసైటీ నిర్వాహకులు ఫాదర్ అమల్ రాజు, విజయవాడ నాస్తిక కేంద్రం చైర్మన్ డాక్టర్ జి.సమరం, విలేజెస్ ఇన్ పార్టనర్‌షిప్ సంస్థ నిర్వాహకులు డాక్టర్ టి.నాగేంద్రస్వామి, ఆర్థిక సమతా మండలి నిర్వాహకులు సిహెచ్.సత్యనారాయణ, రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వై.వి.రామారావు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.వి.పి.ఎస్.ఆంజనేయులు పాల్గొన్నారు.

28 మంది మావోయిస్టులకు 2 వరకు రిమాండ్

ప్రజాశక్తి- విజయవాడ

కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరు ఆటోనగర్లో అరెస్టు చేసిన 28 మంది మావోయిస్టులను బుధవారం విజయవాడ తాలూకా కోర్టులో పోలీసులు హాజరుపర్చారు. వీరికి న్యాయమూర్తి లెనిన్‌బాబు డిసెంబరు రెండు వరకూ రిమాండ్ విధించారు. దీంతో, వారిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

నలుగురికి 3 వరకూ రిమాండ్

విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో పటమట పోలీసులు అరెస్టు చేసిన నలుగురు మావోయిస్టులను కూడా విజయవాడ నాలుగో అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ (ఎసిఎఎం) కోర్టులో హాజరుపర్చారు. వారికి డిసెంబరు 3వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి రామ్మోహన్ ఆదేశాలు జారీ చేశారు. వీరిని నెల్లూరు జైలుకు తరలించారు.

ముఖ్యమంత్రి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించకుండా

కార్మికులపై నిందలు మోపడం దుర్మార్గం

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో కృషి చేయకుండా కార్మికులపై నిందలు మోపడం దుర్మార్గమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం అన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు, జిల్లా కమిటీ సభ్యులు పి పైడిరాజుతో కలిసి విశాఖ సిఐటియు కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులపై చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేసి కార్మికుల మనోభావాలను దెబ్బతీయడం దుర్మార్గమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కావాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంవత్సరాలు తరబడి కార్మికులు పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. సొంతగనుల కోసం 2010లో ఢిల్లీలో ధర్నా చేసిన ఉక్కు కార్మికులను అభినందించిన చంద్రబాబు... అధికారంలోకి వచ్చాక మాట మార్చడం దుర్మార్గమన్నారు. అర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనుల కోసం మాట్లాడిన చంద్రబాబు విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం ఎందుకు మాట్లడడం లేదని, వదేళ్లకు సరిపడా గనులున్న సెయిల్‌లో విలీనం కోసం ఎందుకు కృషి చేయడంలేదని ప్రశ్నించారు. అర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు భూమి, నీరు, విద్యుత్, జిఎస్‌టి తదితర రూపాల్లో రూ.కోట్లలో ఎందుకు రాయితీలు ఇస్తున్నారని నిలదీసారు. నేడు ఉత్పత్తికి జీతాలకు ఎలా లింకు చేస్తారన్నారని ప్రశ్నించారు.

ఎం జగ్గునాయుడు మాట్లడుతూ ముఖ్యంమత్రి వ్యాఖ్యలను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు భుజానికి ఎత్తుకున్నారన్నారు. కేంద్రంతో మాట్లాడి రూ.11,440 కోట్లు ప్యాకేజీ తెచ్చామని చెబుతున్నారని, నిధుల్లో రూ.9,640 కోట్లు జిఎస్‌టి, బ్యాంకు రుణాలు, పాత బకాయిల పేరుతో కేంద్రం తిరిగి లాగేసుకున్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. ఈ ప్యాకేజీ పేరు చెప్పి, చేయని నేరానికి ఉద్యోగులు, కార్మికులను ప్రజల ముందు దోషులుగా చూపించి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుకు కట్టబెట్టే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.

ఎన్‌కౌంటర్ల పేరుతో మానవ హత్యలు ఆపాలి...

కేంద్ర ప్రభుత్వం ఎన్‌కౌంటర్లు పేరుతో మావోయిస్టులను హతమార్చడం అమానుషమని కె లోకనాథం అన్నారు. రాజ్యాంగబద్ధంగా చట్ట పరిధిలో పాలన సాగించాల్సిన ప్రభుత్వమే ప్రభుత్వ యంత్రాంగంతో హత్యలు చేయిస్తే పాలనకు అర్థమేముంటుందని ప్రశ్నించారు. మావోయిస్టు నేతలు హిడ్మా తదితరులను ఎన్‌కౌంటర్లు చేయడం దుర్మార్గమని, దీన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో చర్చలు జరిపి సమస్యకు ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రాస్తారోకో చేస్తున్న కౌలురైతులు, నాయకులు

అన్నదాతా సుఖీభవ కోసం

కౌలు రైతుల రాస్తారోకో

- రెండో విడతలోనూ సాయం ఇవ్వకపోవడం దారుణం
- సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి - యడ్లపాడు (పల్నాడు జిల్లా)

కౌలురైతులకు అన్నదాతా సుఖీభవ పథకం కింద రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని ఒకేసారి జమ చేయాలని డిమాండ్ చేస్తూ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో కౌల్దార్లు పల్నాడు జిల్లా యడ్లపాడు మండల కేంద్రంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ అన్నదాతా సుఖీభవ రెండో విడత జమ సందర్భంగానైనా కౌలురైతులకు పెట్టుబడి సాయం జమ చేయకపోవడం దారుణమన్నారు. మొదటి విడతలోనూ విస్మరించారని, అక్టోబరులో జమచేస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. వాస్తవానికి పెట్టుబడులు సమకూర్చుకుని వ్యవసాయం చేస్తున్న కౌల్దార్లకే పథకాన్ని వరింపజేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం దుర్మార్గమైన చట్టాన్ని తెచ్చి కౌలు రైతులకు అన్యాయం చేసిందని, ఒసి కౌలు రైతులకు రైతు భరోసాను ఇవ్వలేదని టిడిపి, జనసేన నాయకులు విమర్శించారని గుర్తు చేశారు. ఒసి రైతులతోపాటు అన్ని సామాజిక తరగతుల్లోని కౌలురైతులకు పెట్టుబడి సహాయం కింద ఇచ్చే అన్నదాతా సుఖీభవ రూ.20 వేలను ఇస్తామని సూపర్ సిక్స్‌లో చెప్పి ఇప్పుడు మోసం చేయడం తగదన్నారు. కొత్త చట్టం తెస్తున్నానని అసెంబ్లీలో ప్రకటించినా చట్టం తేలేదని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం భూస్వాములకు లొంగిపోయిందని, దీనిపై కౌల్దార్లు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేయాలని పిలుపునిచ్చారు.

కిడ్నీ వ్యాధుల మూలాలపై పరిశోధన

- మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ వ్యాధుల మూలాలపై పరిశోధన చేపట్టేందుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసిఎంఆర్) ఆమోదం తెలిపిందని వైద్య, ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ తెలిపారు. మూడేళ్ల కాల వ్యవధిలో ఈ పరిశోధన పూర్తిచేసేందుకు మూడు దశల్లో ఐసిఎంఆర్ రూ.6.2కోట్లను గ్రాంటు రూపంలో ఇస్తుందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'శ్రీకాకుళం కిడ్నీ రీసెర్చ్ ప్రాజెక్టు'పేరుతో జరిగే ఈ పరిశోధనలో భాగంగా పరీక్షించే వారిలో ఒకటి, రెండేళ్లల్లో కిడ్నీ వ్యాధుల బారినపడే వారిని గుర్తించి ముందుగానే చికిత్స అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కిడ్నీ వ్యాధుల మూలాలు కనుగొనడం ద్వారా ఉద్దానం ప్రాంతంలో అవసరమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని వివరించారు. అతి త్వరలోనే పరిశోధన ప్రారంభమవుతుందని తెలిపారు. ర్యాండం విధానంలో 18 ఏళ్లకు పైబడిన 5,500 మంది నుంచి రక్త, మూత్ర నమూనాలు తొలివిడతలో సేకరిస్తామని పేర్కొన్నారు. ఆర్ఎన్ఎ సీక్వెన్సింగ్ విధానంలో జన్యుపరమైన పరీక్షలు కూడా ఈ పరిశోధనలో భాగంగా చేస్తామని తెలిపారు. రక్త, మూత్ర నమూనాలు పరీక్షించేందుకు ఐసిఎంఆర్ ఆంధ్ర వైద్య కళాశాలలో ప్రత్యేక ల్యాబ్‌ను ఏర్పాటు చేయబోతుందని వెల్లడించారు. గత టిడిపి హయాంలో ఆస్ట్రేలియాకు చెందిన దేశంలోన జార్జ్ ఇనిస్టిట్యూట్‌కు పరిశోధన బాధ్యతలు అప్పగించారని, కానీ వైసిపి ప్రభుత్వం నిర్వాకం వల్ల పరిశోధన పూర్తిస్థాయిలో జరగలేదని విమర్శించారు.

మెడికల్ సీట్ల కేటాయింపు ప్రకటనలో ప్రొవిజనల్

వివిధ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల తుది జాబితాలను ప్రకటించే ముందు ప్రొవిజనల్ లిస్టులు ప్రకటించాలని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులను మరో ప్రకటనలో ఆదేశించారు. తద్వారా అర్హులైన విద్యార్థులు సీట్లు పొందకుంటే వారు యూనివర్సిటీకి తమ అభ్యంతరాలను తెలియజేసే అవకాశం కలుగుతుందని వివరించారు. ఇటీవల ముగిసిన ప్రభుత్వ కోటా ఎంబిబిఎస్ ప్రవేశాల జాబితాల ప్రకటన తుదిదశలో కొందరు విద్యార్థులు తమకంటే నీట్‌లో తక్కువ వచ్చిన వారికి సీట్లు కేటాయించారని అభ్యంతరాలు తెలిపారని పేర్కొన్నారు. దీనికి కారణమైన సాంకేతిక లోపాలను గుర్తించి విశ్వవిద్యాలయ అధికారులు తగు సవరణలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో తొలుత ప్రొవిజనల్ జాబితాలు ప్రకటించి వాటిపై అభ్యంతరాలు స్వీకరించాలని, ఈ తర్వాతే తుది జాబితాలను విడుదల చేయాలని ఆదేశించారు.

22న అల్పపీడనం

- భారత వాతావరణ కేంద్రం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నైరుతి బంగాళాఖాతం, పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకూ విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నెల 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, అనంతరం అది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ తదుపరి 48 గంటల్లో మరింత బలపడే అవకాశముందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అదే విధంగా కొమోరిన్ పరిసర ప్రాంతాలపై మంగళవారం ఏర్పడిన అల్పపీడనం బుధవారం ఉదయానికి లక్షద్వీప్ దీవులకు సరిహద్దు, మాల్దీవుల ప్రాంతాలకు విస్తరించిందని తెలిపింది. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించిందని పేర్కొంది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతుందని వెల్లడించింది. వీటి ప్రభావంతో గురువారం ఉత్తర కోస్తా, యానాంలో పొడి వాతావరణం, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు.

రూ.20.29 కోట్లతో బిసి వసతి గృహాల్లో ఆర్ఓ ప్లాంట్లు

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసి సంక్షేమ వసతి గృహాలు, ఎంజెపి గురుకులాల్లో రూ.20.29 కోట్ల వ్యయంతో ఆర్ఓ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు పనులను 45 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించినట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిసి సంక్షేమ వసతి గృహాలు, ఎంజెపి గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఇప్పటికే నాణ్యమైన భోజనం అందించేందుకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని తెలిపారు. పరిశుద్ధమైన తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో ఈ ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 922 బిసి సంక్షేమ వసతి గృహాల్లో ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటుకు రూ.16.85 కోట్లు, 109 ఎంజెపి గురుకులాలకు 54 గురుకులాల్లో ఇప్పటికే ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన 55 గురుకులాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు రూ.3.44 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే ఆయా గురుకులాల్లో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు ప్రక్రియ చేపట్టామన్నారు.

అమలుకు నోచని ఫ్లోటింగ్ జెట్టీ

- ఉపాధి కోసం వలస
- పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో బందీలుగా మత్స్యకారులు

ఫ్లోటింగ్ జెట్టీ నిర్మించాల్సిన ప్రదేశం ఇదే...

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లా చింతపల్లి సముద్రతీరంలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం అమలుకు నోచుకోవడం లేదు. దీంతో, తీర ప్రాంత మత్స్యకారులు ఉపాధి కోసం వలసపోతున్నారు. సముద్రంలో వేట సమయంలో అనుకోకుండా సరిహద్దులు దాటుతుండడంతో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల్లో బందీలుగా గడపాల్సి వస్తోంది. మత్స్యకారుల జీవితాల్లో మార్పులు తీసుకొస్తామంటూ పదేపదే చెప్పుకొచ్చిన నాటి టిడిపి ప్రభుత్వం ఆచరణలో మాట నిలబెట్టుకోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం సుమారు రూ.23.73 కోట్ల అంచనాతో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి పూసపాటిరేగ మండలం చింతపల్లి తీరంలో ఆరు ఎకరాలు కేటాయించింది. 2023 మే మూడున అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడ జట్టీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే, ఆ తర్వాత నిర్మాణం గురించి పట్టించుకోలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం కూడా దీనిపై దృష్టి పెట్టలేదు.

విజయనగరం జిల్లాలో సుమారు 21.44 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. సుమారు నాలుగు వేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. చేపల వేటే జీవనాధారంగా ఈ కుటుంబాలు జీవిస్తున్నాయి. జిల్లాలో 711 మోటరైజ్డ్ ఫిషింగ్ బోట్లు, 417 సంప్రదాయ పడవలు ఉన్నాయి. చింతపల్లితోపాటు దానిచుట్టు పక్కల తిప్పలవలస, మద్దూరు, కొత్తూరు, బర్రిపేట, నీలగెడ్డపేట, తమ్మయ్యపాలెం, పులిగెడ్డపాలెం, పతివాడ బర్రిపేట తదితర చోట్ల 16 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఉన్నాయి. సముద్ర తీరం నుంచి కెరటాలను దాటుకొని సముద్రంలో వేటకు వెళ్లే సమయంలో మత్స్యకారులు ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. అటుపోట్లు వచ్చినప్పుడు, ముఖ్యంగా తుపాను సమయాల్లో ఒడ్డున ఉంచిన తెప్పలకు, బోట్లకు లంగరు వేయడానికి ఈ ప్రాంతంలో అవకాశం లేకపోవడంతో అవి సముద్రంలోకి కొట్టుకుపోవడం, మరమ్మతులకు గురికావడంతో మత్స్యకారులకు ఆస్తి నష్టం సంభవించడం పరిపాటిగా మారింది. ఇక్కడ జెట్టీ నిర్మిస్తే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని భావించిన మత్స్యకారులకు నిరాశే మిగిలింది. ఈ నేపథ్యంలో చాలామంది మత్స్యకారులు విశాఖపట్నం, ఒడిశాలోని పారాదీప్, గుజరాత్ తదితర తీరప్రాంతాలకు వలసపోతున్నారు. విశాఖకు వలసవెళ్లిన భోగాపురం మండలం కొండరాజుపాలేనికి చెందిన మరుపల్లి చిన్నప్పన్న (56), మరుపల్లి రమేష్ (31), సూరాడ అప్పలకొండ (39), మరుపల్లి ప్రవీణ్ (20), సురపతి రాము (49), మరుపల్లి చిన్నప్పన్న (61), మైలపల్లి అప్పన్న (56), పూసపాటిరేగ మండలం తిప్పలవలసకు చెందిన నక్కా రమణ (61), వాసుపల్లి సీతయ్య (36) బంగ్లాదేశ్ సముద్ర జలాలు దాటారన్న ఆరోపణతో గత నెల 22న అక్కడి అక్కడి కోస్ట్‌గార్డులు అరెస్టు చేశారు. ఇప్పటికీ వీరంతా ఆ దేశంలో బందీలుగానే ఉన్నారు. వీరిని వెంటనే మనదేశానికి రప్పిస్తామంటూ మన రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, స్థానిక ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు ఇచ్చిన హామీ నీటిమీద రాతగానే మిగిలిపోయింది. 2019లో జిల్లాకు చెందిన మైలపల్లి గురువులు, నక్కా అప్పన్న, నక్కా ధనరాజు, బర్రి భవిరీడు, నక్కా నర్సింగ్ అనే ఐదుగురు మత్స్యకారులు పాకిస్తాన్ సముద్ర జలాల్లో పట్టుబడ్డారు. వీరు నెలల తరబడి పాకిస్తాన్ జైలులో మగ్గాల్సి వచ్చింది.

జెట్టీ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం

. గత ప్రభుత్వంలో జెట్టీ నిర్మాణం చేస్తామన్నారు. ఈ ప్రభుత్వంలో కనీసం ఆ ఊసే ఎత్తడం లేదు. అల్పపీడనం వస్తే పడవలు అలల తాకిడికి మరమ్మతులకు గురవుతున్నాయి. వెంటనే అధికారులు స్పందించి జెట్టీ నిర్మాణం చేపట్టాలి.

-బర్రి రాము, చింతపల్లి గ్రామం, మత్స్యకారుడు

అభివాదం చేస్తున్న వామపక్ష మహిళా సంఘాల నాయకులు

బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలి

- మహిళా సంఘాల నాయకులు

ప్రజాశక్తి- నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)

పర్యావరణాన్ని, మత్స్యకారుల జీవితాలను దెబ్బతీసే బల్క్‌డ్రగ్ పార్క్ రద్దు చేయాలని ఐద్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యు, సిఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేస్తోన్న శాంతియుత రిలే దీక్షలు బుధవారం నాటికి 67వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షకు ఐద్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యు, ప్రజా సంఘాల నేతలు సంఘీభావం తెలిపి, ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు కె శ్రీదేవి, జాయింట్ సెక్రటరీలు సిహెచ్ రమణి, వై సత్యవతి, ఎన్ఎఫ్ఐడబ్ల్యు ప్రతినిధి ఎ వనజ, విమల, దుర్గాభవాని తదితర నాయకులు మాట్లాడారు. బల్క్ డ్రగ్‌ను రద్దు చేయాలంటూ మత్స్యకారులు 67 రోజుల నుండి దీక్ష చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ వస్తే మత్స్యకారుల జీవితాలు సర్వనాశనం అవుతాయని తెలిపారు. సముద్రం కలుషితమై పూర్తిగా వేట పోతుందని, మత్స్యకారులు అనేక రకాల ప్రాణాంతకర వ్యాధులు బారినపడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే హెటిరో కంపెనీ కాలుష్యం కారణంగా మత్స్యకారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని, పలు వ్యాధుల బారినపడి సతమతమవుతున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే వారి ఉనికికే ప్రమాదమన్నారు. మత్స్యకారుల ఉపాధి ఉనికిని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని ఈ పార్క్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పి మాణిక్యం, కార్యదర్శి డిడి వరలక్ష్మి, కోశాధికారి కెవిఎస్ సూర్యప్రభ, నాయకులు ఎల్ గౌరి, జాయింట్ సెక్రటరీ మంగతాయారు, అన్నపూర్ణ, సత్య, గాయత్రి, పరమేశ్వరి, సుబ్బలక్ష్మి, సిఎంఎస్ నాయకులు లలిత, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయం ధ్వంసం చేసి.. మాపైనే కేసులా?

- వైసిపి నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హిందూపురంలో వైసిపి కార్యాలయాన్ని ధ్వంసం చేయడంతోపాటు తిరిగి వైసిపి కార్యకర్తలపైనే కేసులు నమోదు చేశారని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, వైసిపి నాయకులు దీపిక విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. తక్షణమే అక్రమ కేసులు ఆపాలని కోరారు. దాడిలో పాల్గొన్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితుల వివరాలను సిసి ఫుటేజీతో సహా సమర్పిస్తే వారిని శిక్షించాల్సిందిపోయి వైసిపి నాయకులపైనే అట్రాసిటీ కేసులు పెట్టారని తెలిపారు.

మంత్రి వాసంశెట్టి సుభాష్.. శెట్టి బలిజలను అవమానించారని, వారిని గౌడకులంలో చేర్చాలని కోరడం సరికాదని మాజీ మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. వన సమారాధనను అడ్డుపెట్టుకుని సుభాష్ అడ్డగోలుగా మాట్లాడారని తెలిపారు. శెట్టిబలిజ, గౌడ ఉపకులాలను ఒకే గొడుకు కిందకు తెస్తూ 1997లో చంద్రబాబు జిఓ ఇచ్చారని, ఇప్పటి వరకూ అమలు జరగలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తూ దాన్ని వైసిపిపై రుద్దుతున్నారని అన్నారు.

మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

'ద్రవిడ'లో విద్యార్థులతో నారా భువనేశ్వరి ముఖాముఖి

ప్రజాశక్తి- గుడిపల్లి (చిత్తూరు జిల్లా):

గుడిపల్లి మండలంలోని ద్రవిడ విశ్వవిద్యాలయం విద్యార్థులతో ఎన్‌టిఆర్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి బుధవారం ముఖాముఖి సమావేశమయ్యారు. ఆమెతోపాటు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కుప్పం డెవలప్‌మెంట్ అథారిటీ పొలిటికల్ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. మొదట జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ద్రవిడ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య దొరస్వామి గత 15 నెలల్లో విశ్వవిద్యాలయం సాధించిన అనేక విషయాలను ప్రస్తావించారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ ద్రవిడ విజయాలయాన్ని కూడా అత్యున్నత స్థాయిలో నిలబెట్టేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. విద్యార్థులనుద్దేశించి నారా భువనేశ్వరి మాట్లాడుతూ సమాజంలో అనేక రకాల ఒత్తిళ్లు ఉండడం చాలా సహజమని, వాటిని మనం ఏ దృష్టి కోణంలో చూస్తున్నామో, ఎలా ఎదుర్కొంటున్నామో అన్నదే చాలా ముఖ్యమని సూచించారు. సమాజం పట్ల సానుకూల దృక్పథం ఉంటే చాలా వరకు సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ముఖ్యంగా మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని నిజాయితీతో, క్రమశిక్షణతో శ్రమిస్తే తప్పకుండా మంచి ఫలితాలను సాధించగలరని వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కుప్పం డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వికాస్ మర్మత్, ద్రావిడ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్, అకడమిక్ డీన్ ఆచార్య కె శ్యామల, వివిధ శాఖల అధ్యక్షులు, డీన్లు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- పెందుర్తి (విశాఖపట్నం)

విశాఖపట్నం జిల్లా పెందుర్తి రైల్వే స్టేషన్ సమీపంలో విద్యుత్ పోల్ పక్కకు ఒరిగిన ఘటనలో టాటా - యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. పెందుర్తి రైల్వే స్టేషన్‌కు అతి సమీపంలో ట్రాక్‌కు పక్కనే కొత్తగా నిర్మించిన విద్యుత్ స్తంభం ఒక పక్కకు వాలి కరెంటు వైర్లపై పడింది. ఆ పక్కనే విద్యుత్ పనులు చేస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో పెందుర్తి రైల్వే స్టేషన్‌కు చేరుకుంటున్న టాటా- యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ ప్రమాద పరిస్థితిని దూరం నుంచి గమనించి రైలును ఆపేశాడు. లేదంటే రైల్లో ప్రయాణం చేస్తున్న వందలాది మంది ప్రయాణికులు ఈ ప్రమాదంలో చిక్కుకునేవారు. పరిస్థితిని విశాఖ రైల్వే, కొత్తవలస పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. విద్యుత్ స్తంభం పడి గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆరిలోవ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన ఇద్దరిని పెందుర్తిలోని 30 పడకల హాస్పిటల్‌లో చేర్పించారు. పెందుర్తి రైల్వే స్టేషన్లో గత కొంతకాలంగా విద్యుత్ పనులు చేపడుతున్నారు.

రాజధాని రైతుల సమస్యలు పరిష్కరించండి

- ముఖ్యమంత్రికి సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని ప్రాంతంలో రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. అమరావతిని రాష్ట్ర రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటులో చట్టం చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బుధవారం లేఖ రాశారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న మూడు రాజధానుల కేసులు, ఆర్-5 జోన్ కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. రిటనబుల్ ప్లాట్ల సమస్యలను తక్షణమే పరిష్కరించి, హద్దు రాళ్లను వేయాలన్నారు. ప్రైవేటు సంస్థలకు కేటాయించిన స్థలాల్లో పనులు వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. రాజధాని రైతులకు వార్షిక కౌలు బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. రాజధాని కోసం ఎంపిక చేసిన 29 గ్రామాల అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందని, గత పదేళ్లుగా ఎన్నికలు జరగకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. సిఆర్‌డిఎ అధికారుల నిర్లక్ష్య ధోరణి, ప్రభుత్వం చూపుతున్న సాగదీత వైఖరి రైతులను తీవ్ర నష్టానికి గురి చేస్తోందన్నారు.

రాష్ట్రంలో ఫిన్‌లాండ్ విద్య నమూనా అమలు

- ఆ దేశ పర్యటన వివరాలు వెల్లడించిన విద్యాశాఖ ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఫిన్‌లాండ్ విద్య నమూనాను అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఫిన్‌లాండ్ విద్యా వ్యవస్థపై అధ్యయనం చేసేందుకు మానవ వనరుల అభివృద్ధిశాఖ కార్యదర్శి కోన శశిధర్, కళాశాల విద్య డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, సాంకేతిక విద్య డైరెక్టర్ జి గణేష్ కుమార్, సమగ్రశిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు ఆ దేశంలో పర్యటించారు. ఫిన్నిష్ నేషనల్ ఏజెన్సీ ఫర్ ఎడ్యుకేషన్ (ఇడియుఎఫ్ఐ), హెల్సింకిలోని వల్లైలా ప్రైమరీ స్కూల్, అరోహాటీలో 'డేకేర్ వర్టియోక్యులా' సందర్శించారు. ఈ పర్యటన వివరాలను బుధవారం వారు ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ఫిన్‌లాండ్‌లో బోధన అత్యంత ప్రతిష్టాత్మకమైన వృత్తిగా పరిగణిస్తారని తెలిపారు. ప్రాథమిక ఉపాధ్యాయులకు కూడా ఐదేళ్ల మాస్టర్ డిగ్రీ తప్పనిసరి అని పేర్కొన్నారు. తనిఖీలు, ర్యాంకింగ్ వంటి వ్యవస్థలు లేవన్నారు. ఉపాధ్యాయులు తమ బోధనా విధానాలు, మూల్యాంకనాలను స్వయంగా నిర్ణయించుకునే పూర్తి స్వయంప్రతిపత్తి కలిగి ఉంటారని వివరించారు. 1943 నుంచి అమల్లో ఉన్న ఉచిత పాఠశాల భోజనం, ప్రామాణిక పరీక్షలు లేని మూల్యాంకన విధానం వంటి అంశాలు విద్యార్థి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని వెల్లడించారు. ఆట-ఆధారిత అభ్యాసం విధానాన్ని అధ్యయనం చేశామని, ఆట అనేది అభ్యాసానికి మాధ్యమం, విరామం కాదనే సూత్రాన్ని రుజువు చేశాయని తెలిపారు. పూర్వశిశు విద్య (ఇసిఇసి)లో డాన్సింగ్ మౌస్ ఎమోషన్ బోర్డు వంటి సాధనాలు పిల్లల భావోద్వేగ అక్షరాస్యతను పెంచడం వంటివి అద్భుతంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రిన్సిపల్‌కు పూర్తి పరిపాలనా అధికారం ఇస్తారని, మున్సిపాలిటీలు కేవలం నిధులు, మౌలిక సదుపాయాలకు మాత్రమే పరిమితమై బోధనలో జోక్యం చేసుకోకపోవడం ఫిన్‌లాండ్ విజయ రహస్యంగా వెల్లడైందని తెలిపారు. జిల్లాకు ఒక అంగన్‌వాడీ చొప్పున రాష్ట్రంలో ఫిన్నిష్ తరహా ఆట-ఆధారిత అభ్యాసం' నమూనాలో పూర్తిగా మార్చేందుకు పైలట్ ప్రాజెక్టును ప్రారంభించాలని కోన శశిధర్ ఇడియుఎఫ్ఐకి ప్రతిపాదించగా, ఆ సంస్థ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు పేర్కొందన్నారు. పూర్వశిశు విద్యను పటిష్టం చేసి, భవిష్యత్ తరాలకు మెరుగైన పునాదులు వేయడానికి ఇ ప్రాజెక్టు మార్గం సుగమం చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్యారంగంలో జరుగుతున్న సంస్కరణలను బలోపేతం చేయడానికి కళాశాల విద్య, సాంకేతిక విద్య అధికారుల బృందం ఫిన్‌లాండ్‌లోని ప్రముఖ సంస్థలు ఆల్టో యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఆర్ట్స్ హెల్సింకి, యూనివర్సిటీ ఆఫ్ టర్కు, హెల్సింకి లైబ్రరీలను సందర్శించింది.

రేపటి నుంచి రష్యా చమురుపై ఆంక్షలు

- నడి సముద్రంలో నౌకలు..!
- సందిగ్ధంలో 77 లక్షల బ్యారెల్స్ చమురు
- చమురు కంపెనీల్లోనూ ఆందోళన

న్యూఢిల్లీ : రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు జనవరి 21 నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో భారత్‌కు రావాల్సిన రష్యా చమురు సందిగ్ధంలో పడింది. యుఎస్ ఆంక్షలతో సముద్రంలో ప్రయాణిస్తున్న నౌకల పరిస్థితి ఇప్పుడు అయోమయంగా మారింది. శుక్రవారంలోగా భారత తీరం చేరకపోతే ఆ నౌకల్లోని చమురు ఎటూ వెళ్లలేని స్థితిలో పడే ప్రమాదం కనిపిస్తోందని రిపోర్టులు వస్తోన్నాయి. రష్యాకు చెందిన బ్లాక్ లిస్టెడ్ సంస్థలు రాస్‌నెఫ్ట్, లుకాయిల్ నుంచి బయలుదేరిన నౌకలు భారత్ వైపు వస్తున్నాయి. కెప్లర్ డేటా ప్రకారం వీటిలో సుమారు 77 లక్షల బ్యారెళ్ల ముడి చమురు రవాణ అవుతోంది. అమెరికా ఆంక్షల గడువులోగా చమురు భారత్ చేరకపోతే ఆ చమురును ఇక్కడి నౌకాశ్రయాల్లో దించుతారా లేదా అన్న సందేహాలు మొదలయ్యాయి. గడువు దగ్గర పడుతోంటే చమురు కంపెనీల్లోనూ ఆందోళన పెరిగింది.

సముద్రంలో ఉన్న ట్యాంకర్లలో ఎక్కువ భాగం రిలయన్స్ ఇండస్ట్రీస్ జామ్‌నగర్ రిఫైనరీకి, నయారా ఎనర్జీకి చెందిన వాడినార్ పోర్టుకు చేరాల్సి ఉంది. ఈ నౌకలు నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ మొదట్లో ఇక్కడకు చేరే అవకాశాలున్నాయని తెలుస్తోంది. గడువు ముగిసిన తర్వాత కూడా చమురు కొనేందుకు భారత కంపెనీలు అమెరికాను ఏమైనా మినహాయింపులు కోరాయా..? లేదా? అన్నది స్పష్టత రావాల్సి ఉంది. ఇటీవల హంగేరీ దేశానికి రష్యా ఆయిల్ కొనుగోలు విషయంలో అమెరికా వెసులుబాటు కల్పించింది. లుకాయిల్ లావాదేవీలకు సంబంధించి కొన్ని సడలింపులు ఇచ్చింది. రష్యా నుంచి చమురు కొనడం మానేస్తామని మోడీ సర్కార్ అంగీకారంతో భారత్‌లోని ఐదు సంస్థలు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ దేశం నుంచి కొనుగోళ్లను నిలిపివేశాయి. ఇందులో రిలయన్స్ వాటానే ఎక్కువ కావడం విశేషం. పూర్తిగా రష్యా సరఫరాలపై ఆధారపడ్డ నయారా సంస్థ మాత్రం ఇంకా కొనుగోలును కొనసాగిస్తోంది. ఈ ఆంక్షల కారణంగా నవంబర్ నెలలో రష్యా నుండి భారతదేశానికి వచ్చే చమురు రవాణా ఇప్పటికే భారీగా పడిపోయింది. అక్టోబర్ నెలతో పోలిస్తే నవంబర్ 1-17 మధ్య దిగుమతులు మూడింట రెండు వంతులు లేదా 66 శాతానికి తగ్గాయి. రష్యా నుంచి సరఫరాలో అంతరాయాన్ని తగ్గించుకోవడానికి భారతీయ రిఫైనరీలు అమెరికా, మధ్యప్రాచ్యం, ఇతర ప్రాంతాల నుండి చమురు కొనుగోళ్లను పెంచుతున్నాయి. ట్రంప్ ఆంక్షలకు భారత్ తలొగ్గి రష్యాకు చెందిన చౌక చమురును వదిలేసి.. ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తోందని తెలుస్తోంది. అదే జరిగితే పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి వినియోగదారులపై భారం పడనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఒప్పందాలతో మభ్యపెడుతున్న చంద్రబాబు, జగన్

- ఎపిసిసి అధ్యక్షురాలువైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఒప్పందాలు, పెట్టుబడులు అంటూ.. గత 11 ఏళ్లుగా చంద్రబాబు, జగన్ రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2014-19 మధ్య కాలంలో 3 సమ్మిట్‌లు పెట్టి 1,761 ఒప్పందాలు కుదుర్చుకున్నారని, రూ.19 లక్షల కోట్ల పెట్టుబడులు, 30 లక్షల ఉద్యోగాలు వస్తాయని ప్రకటించారని తెలిపారు.

2019-24 మధ్య జగన్ చేసిన 387 ఒప్పందాలతో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారని అన్నారు. రెండు ప్రభుత్వాలు 11 ఏళ్లలో 50 లక్షల ఉద్యోగాలు ఎవరికి ఇచ్చారని ప్రశ్నించారు. విశాఖలో సిఐఐ భాగస్వామ్య సదస్సు-2025లో జరిగిన ఒప్పందాలు, వచ్చే పెట్టుబడులకు సంబంధించి అఫిడవిట్ సమర్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలకు జరిగే వాస్తవ ప్రయోజనంపై లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కోరారు. 613 ఎంఒయులు, రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు, 16.31 లక్షల ఉద్యోగాలు వివరాలు స్టాంప్ పేపర్‌పై రాసి సంతకం చేసి ఇవ్వాలని కోరారు. ఈ మేరకు స్టాంప్ పేపర్‌ను సిఎం చంద్రబాబుకు పంపించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 80 లక్షల మంది రైతులుంటే కేవలం 46 లక్షల మందికే అన్నదాత సుఖీభవ సాయం అందిస్తున్నారని చెప్పారు. మొంథా తుపాను కారణంగా 20 లక్షల ఎకరాల్లో నష్టం జరిగితే కేవలం 4 లక్షలకు కుదించారని చెప్పారు. ఉక్కు పరిశ్రమపై సిఎం చంద్రబాబు మాటలు దారుణమన్నారు.

మీకు దిక్కున్న చోట చెప్పుకోండి..

- విద్యార్థుల తల్లిదండ్రుల పట్ల 'నారాయణ' ప్రిన్సిపల్ దురుసు ప్రవర్తన

ప్రజాశక్తి-బాపట్ల

విద్యార్థి తండ్రి పై అరుస్తూ మాట్లాడుతున్న ప్రిన్సిపల్..

తమ అమ్మాయిని ఎందుకు కొట్టారని అడిగిన విద్యార్థి తల్లిదండ్రుల పట్ల నారాయణ కార్పొరేట్ స్కూల్ ప్రిన్సిపల్ దురుసుగా ప్రవర్తించారు. 'నేను కొడతాను.. తిడతాను.. మీకు దిక్కున్న చోట చెప్పుకోండి..' అని సమాధానమిచ్చారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. బాపట్ల నారాయణ స్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని తనను ప్రిన్సిపల్ భాగ్యరాణి కొట్టారని సోమవారం తల్లిదండ్రులకు చెప్పింది.

తమ అమ్మాయిని ఎందుకు కొట్టారని విద్యార్థి తండ్రి మంగళవారం స్కూలుకు వెళ్లి ప్రిన్సిపల్‌ని అడిగారు. దీంతో ఆమె 'పిల్లల్ని నేను కొడతాను.. తిడతాను.. ఏమైనా చేస్తా.. మీరేంటి ఇక్కడ మాట్లాడేది.. మీకు దిక్కున చోట చెప్పుకోండి' అని విద్యార్థి తండ్రిపై విరుచుకుపడ్డారు. ఈ వీడియో సోషల్ మీడియాలో బుధవారం హల్‌చల్ చేసింది. విద్యార్థినికి అనవసరంగా కొట్టడమే కాకుండా తల్లిదండ్రుల పట్ల దురుసుగా ప్రవర్తించడంపై ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

స్టార్టప్‌లకు నిధుల కటకట..

- ఫండ్స్ సమీకరణలో సవాళ్లు
- ఈ ఏడాదిలో 25 శాతం పతనం



బెంగళూరు : భారత్‌లోని స్టార్టప్ సంస్థలు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయి. నిధుల సమీకరణలో తీవ్ర సవాళ్లను చవి చూస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందని మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి.. స్టార్టప్‌ల్లో పెట్టుబడులకు భిన్నమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు భారతీయ టెక్ వెంచర్లలో వందల కోట్ల డాలర్ల పెట్టుబడులకు ఆసక్తిని చూపిన ఇన్వెస్టర్లు ఇటీవల నెమ్మదించారు. దీంతో నిధుల కొరతతో ఔత్సాహిక వ్యాపారవేత్తలు నిరాశ చెందుతున్నారని తాజా రిపోర్టులు వెల్లడిస్తోన్నాయి. పెట్టుబడులు, స్టార్టప్‌ల తీరుపై విశ్లేషణలు చేసే ట్రాక్సన్ రిపోర్ట్ ప్రకారం.. ఈ ఏడాది 2025లో జనవరి 1 నుంచి జూన్ మధ్య కాలంలో స్టార్టప్‌ల్లో పెట్టుబడులు 25 శాతం పతనమై 4.8 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే కాలంలో 6.4 బిలియన్ డాలర్ల పెట్టుబడులు నమోదయ్యాయి. 2024 జులై నుంచి డిసెంబర్ కాలంలో 5.9 బిలియన్ డాలర్ల పెట్టుబడులు చోటు చేసుకున్నాయి.

కాగా.. గడిచిన జనవరి నుంచి జూన్ ప్రథమార్థంలో అమెరిక స్టార్టప్‌లకు అత్యధికంగా 125.8 బిలియన్ల, బ్రిటన్ సంస్థలకు 7.9 బిలియన్ డాలర్ల చొప్పున నిధులు సమకూరాయి. ప్రపంచ వ్యాప్తంగా స్టార్టప్ పెట్టుబడుల్లో భారత్ మూడో స్థానంలో ఉంది. భారత్‌లో బెంగళూరులోని స్టార్టప్‌లకు అత్యధికంగా 26 శాతం నిధులు అందగా.. ఢిల్లీ సంస్థలకు 25 శాతం నిధులు పొందాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న బలహీనతలు, డిమాండ్‌లో తగ్గుదల స్టార్టప్ నిధులకు ప్రధాన సవాళ్లుగా నిలుస్తున్నాయని నిపుణులు భావిస్తున్నారు.

"గత సంవత్సరాల్లో పెట్టుబడిదారుల్లో ఉన్న ఉత్సాహం ఇప్పుడు కానరావడం లేదు. పెట్టుబడులపై చాలా అప్రమత్తతను ప్రదర్శిస్తున్నారు. అంతర్జాతీయంగా పెరుగుతున్న వడ్డీ రేట్లు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం భయాల వల్ల నెలకొన్న ప్రపంచ ఆర్థిక అనిశ్చితి కారణంగా పెట్టుబడిదారులు రిస్క్ తీసుకోవడానికి వెనకాడుతున్నారు." అని ట్రాక్సన్ సహ వ్యవస్థాపకురాలు నేహా సింగ్ పేర్కొన్నారు.

పారిశ్రామికవేత్తలతో మంత్రి సీతారామన్ భేటీ

న్యూఢిల్లీ : బడ్జెట్ రూపకల్పనలో భాగంగా ముందస్తుగా పారిశ్రామికవేత్తలతో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం భేటీ అయ్యారు. సీతారామన్ అధ్యక్షతన స్టార్టప్ వాటాదారులతో ప్రీ బడ్జెట్ సంప్రదింపులు జరిగాయని ఆర్థిక శాఖ ఓ ట్వీట్‌లో తెలిపింది. 2026-27 బడ్జెట్ కోసం సూచనలు తీసుకున్నట్లు పేర్కొంది. ఇప్పటికే ఆర్థికవేత్తలు, ఎంఎస్ఎంఇ, కాపిటల్ మార్కెట్స్ ప్రతినిధులతో మంత్రి సంప్రదింపులు జరిపారు.

ప్రతి గంటకు ఐదు ఎంజి విండ్సర్ విక్రయాలు

గుర్‌గావ్ : జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తన ఎంజి విండ్సర్ విక్రయాల్లో భారీ వృద్ధిని సాధిస్తోన్నట్లు తెలిపింది. 400 రోజుల్లో 50,000 యూనిట్ల పైగా అమ్మకాలు చేసినట్లు తెలిపింది. ప్రతీ గంటకు 5 యూనిట్ల చొప్పున విక్రయాలు జరిగాయని ఆ కంపెనీ ఎండి అనురాగ్ మెహ్రోత్రా తెలిపారు.

ఇది కంపెనీకి చారిత్రాత్మక విజయం, మైలురాయిని సూచిస్తుందన్నారు. మెట్రోయేతర మార్కెట్ల నుండి ఎంజి విండ్సర్ నిరంతర డిమాండ్‌ను చూస్తోందన్నారు. ఇది న్యూ ఎనర్జీ వాహనాల పట్ల మా నిబద్ధతను మరింతగా పెంచుకోవడానికి మద్దతునివ్వనుందన్నారు.

సంపాదకీయం

ఎన్‌కౌంటర్లు!

రెండు రోజులుగా రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా వరుసగా జరుగుతున్న మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు, అరెస్టులు రాష్ట్రాన్ని ఒక కుదుపు కుదిపాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీప్రాంతంలో మంగళ వారం ఉదయం జరిగిన పోలీసు కాల్పుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా, ఆయన భార్య రాజక్కతో సహా ఆరుగురు మరణించారు. ఈ సంఘటన రేపిన కలకలం చల్లారకముందే, 24 గంటలలోపే బుధవారం ఉదయం దాదాపు అదే ప్రాంతంలో జరిగిన మరో ఘటనలో ఏడుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ ఘటనలపై పోలీసులు ఎప్పుడూ వినిపించే ఎదురు కాల్పుల కథనాన్నే మరోసారి వినిపించారు. అదే సమయంలో అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరు పెట్టే అవకాశం ఉన్నప్పటికీ బూటకపు ఎన్‌కౌంటర్ చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వమే మావోయిస్టుల నిర్మూలన కార్యక్రమాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయుధాలతో సహా బేషరతుగా లొంగిపోవడం తప్ప మరో మార్గంలేదని సాక్షాత్తు కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా పదేపదే ప్రకటించారు.

అసలు ఆపరేషన్ కగార్ చేపట్టిందే హిడ్మా కోసమని, ఆయన కోసం డెడ్‌లైన్ కూడా పెట్టారని, ఆ గడువులోపలే 'పనిపూర్తయింది' అని మీడియాలో వస్తున్న కథనాలతో ఏం జరిగిందో అర్థం చేసుకోవచ్చు! భయోత్పాతం సృష్టించడమే లక్ష్యంగా జరిగే పోలీసు కనుసన్నల్లో జరిగే ఈ తరహా సంఘటనలు ఎంతమాత్రం సమర్థనీయం కాదు! ఇటువంటి అప్రజాస్వామిక, హింసాత్మక విధానాలను కేంద్ర ప్రభుత్వం తక్షణం విడనాడాలి. తిప్పిరి తిరుపతి పోలీసుల అదుపులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే నిజమైతే, ఆయనతో పాటు విజయవాడ, ఏలూరు, కాకినాడ తదితర ప్రాంతాల్లో పోలీసులు అదుపులోకి తీసుకున్న వారందరినీ తక్షణం న్యాయస్థానాల ముందు హాజరుపర్చాలి. చట్టబద్ధంగా వారికున్న అన్ని హక్కులను వినియోగించుకోవడానికి అవకాశం ఇవ్వాలి. ఆపరేషన్ కగార్ చేపట్టినతరువాత ఇప్పటివరకు 1,225 మంది మావోయిస్టులు లొంగిపోగా, 270 మంది పోలీసుల కాల్పుల్లో మరణించారు. మరో 680 మందికి పైగా అరెస్టు అయ్యారు. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. మరోవైపు గిరిజనులపైన, వారి నివాస ప్రాంతాల పైన సర్కారీ దాడి పెద్దఎత్తున చోటు చేసుకుంటోంది. కార్పొరేట్ల కన్ను అటవీ ప్రాంతాలపైన, కొండల కింద ఉన్న గనుల పైన పడటంతో గిరిజనులను అక్కడి నుండి వెళ్లగొట్టడానికి వివిధ పేర్లతో కుట్రలు జరుగుతున్నాయి. అటవీ హక్కులను తిరస్కరిస్తున్నారు. వారితో నామమాత్రంగా కూడా చర్చించకుండానే పలు ప్రాజెక్టులను వారి నివాస ప్రాంతాల్లో చేపడుతున్నారు. చట్ట ప్రకారం తప్పనిసరైన గ్రామసభలనుసైతం దాటవేస్తున్నారు. ఈ తరహా సర్కారీ దమనకాండపై అసంతృప్తిని, నిరసనను వ్యక్తం చేయడానికి కూడా అవకాశం ఇవ్వకుండా ఉక్కుపాదం మోపుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగానే తీవ్ర నిర్బంధ చర్యల ద్వారా మావోయిస్టులపై పై చేయి సాధించవచ్చు. కానీ, అణచివేతకు గురవుతున్న ప్రజానీకపు జీవన పరిస్థితుల్లో మార్పు రాకుంటే వారిలోని అసంతృప్తి మరో రూపం తీసుకోవచ్చు. ఇది ఒక సామాజిక ఆర్థిక సమస్య. క్షేత్రస్థాయిలో అసమానతలు రూపుమాపడమే దీనికి పరిష్కారం. కార్పొరేట్ల అడుగులకు మడుగులొత్తడం మాని కేంద్ర ప్రభుత్వం ఈ దిశలోచర్యలు చేపట్టాలి. మాటల్లో కాకుండా గిరిజనులను పాలనలో భాగస్వాములను చేయాలి. వారి నివాస ప్రాంతాల్లో అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో నిర్ణయాధికారం వారిదే కావాలి. దేశ వ్యాప్తంగా అణచివేతకు గురవుతున్న ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి. విద్య, వైద్య సౌకర్యాలతో పాటు, ఉపాధిని పెద్ద ఎత్తున కల్పించాలి. అదే విధంగా లొంగిపోయిన, అరెస్టయిన మావోయిస్టులు సాధారణ జీవితం గడపడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకోవాలి. మావోయిస్టుల పేరుతోనో, వారి సానుభూతిపరుల పేరుతోనో గిరిజనులపై పోలీసుల వేధింపులను, నిర్బంధాన్ని తక్షణం నిలిపివేయాలి. కాల్పుల ఘటనలపై న్యాయవిచారణ జరపాలన్న డిమాండ్ సరైనదే! అనుమానాల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ఆ దిశలో చర్యలు తీసుకోవాలి.

మహనీయుల మాట



ప్రతి వ్యక్తికి విద్యా హక్కు ఉంది.
దీని ద్వారా తను అభివృద్ధి
చెందడమే కాక
తన జీవితాన్ని జీవించడానికి
వీలు కల్పిస్తుంది.

- ఎ.పి.జె. అబ్దుల్ కలామ్,
భారత పూర్వ రాష్ట్రపతి.

విత్తనాల ముసాయిదా బిల్లు ఎవరి కోసం?

విశ్లేషణ



డా॥ కొల్లా రాజమోహన్

దశాబ్దాల నాటి 1966 విత్తనాల చట్టం, సీడ్ కంట్రోల్ ఆర్డర్ 1983 బదులుగా '2025 విత్తనాల ముసాయిదా బిల్లు'ను కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. రానున్న పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టబోయే ముందు (డిసెంబర్ 11 లోగా) ప్రజల అభిప్రాయం కోరుతూ ఈ ముసాయిదా బిల్లును ప్రకటించింది.

జన్యుమార్పిడి విత్తనాలను, కొత్త హైబ్రిడ్ విత్తనాలను కార్పొరేట్ కంపెనీల నుంచి తేలికగా దిగుమతి చేసుకోవడానికి చట్టాలను సవరిస్తున్నారు. జన్యుమార్పిడి విత్తనాలు, దిగుమతి చేసుకునే విత్తనాల సాగుకు పురుగు మందులు, ఎరువులు, నీళ్ళు ఎక్కువ అవసరం. మనం కార్పొరేట్ కంపెనీ వ్యవసాయ ఉచ్చులో చిక్కుకుంటున్నాం. ఈ బిల్లు కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నది. చిన్న రైతులను నాశనం చేసేలా ఉంది. తరతరాలుగా జాగ్రత్తగా చేస్తున్నటువంటి వ్యవసాయాన్ని పురాతన విత్తన రకాల వెరైటీలను రక్షించుకోవడానికి ఏమాత్రం సహాయం చేసే పరిస్థితి లేదు. సాధారణ రైతులకు, ముఖ్యంగా సాంప్రదాయ విత్తనాలను తయారు చేస్తున్న రైతుల ప్రయోజనాలకు నష్టం కలుగుతుంది.

కేంద్రీకృత అనుమతి

ఒక కంపెనీ కేంద్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందితే, అది దేశంలోని అన్ని రాష్ట్రాలలో విత్తనాలను విక్రయించడానికి అనుమతి పొందినట్లే. బహుళ రాష్ట్రాల నియంత్రణ లేనందున కార్పొరేట్ కంపెనీల వ్యాపార విస్తరణను వేగవంతం చేస్తుంది. రాష్ట్రాలపై కేంద్ర పెత్తనాన్ని సుస్థిరపరుస్తున్నారు. కంపెనీలు ప్రతి రాష్ట్రంలో వేర్వేరు అనుమతులు పొందాల్సిన అవసరం ఉండదు. నియంత్రణల సరళీకరణ పేరుతో అపరిమితమైన స్వేచ్ఛ లభిస్తుంది. కంపెనీల ఉల్లంఘనలపై నేరారోపణలను తొలగిస్తారు. లేదా శిక్షలను తగ్గిస్తారు. దీంతో కంపెనీల అధికారులు జైలుకు వెళ్లాల్సిన భయం తప్పుతుంది. మైనర్ నేరాలుగా భావించమంటున్నారు. విత్తనాల డీలర్లు, పంపిణీదారులు విత్తనాలను విక్రయించడానికి, దిగుమతి చేసుకోవడానికి, ఎగుమతి చేసుకోవడానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. క్యూఆర్ కోడ్ ద్వారా పక్కా నియంత్రణ వుంటుంది. చిన్న వ్యాపారస్తులు పోటీలో నిలబడలేరు. పెద్ద కార్పొరేట్ కంపెనీలకు కేంద్రీకృత అనుమతి వలన వ్యాపారం సులభమవుతుంది.

నకిలీ విత్తనాలు

వ్యవసాయ మంత్రిత్వ శాఖ చాలా కాలంగా నకిలీ విత్తనాల గురించి మాట్లాడుతున్నది. కార్పొరేట్ కంపెనీలు నకిలీ విత్తనాలు అమ్మితే కఠినమైన జరిమానా విధించబడుతుందనే అభిప్రాయాన్ని కలిగించింది. అయితే ప్రస్తుత బిల్లులో ఎటువంటి కఠినమైన నిబంధనలను ప్రతిపాదించలేదు. ముసాయిదాలో నకిలీ విత్తనాలు అనే పదమే లేదు.

ప్రపంచ వెరైటీలను భారత దేశంలోకి విచక్షణారహితంగా అనుమతించటంద్వారా దేశీయ విత్తనాభివృద్ధిని శాశ్వతంగా దెబ్బగొడుతున్నారు. రైతుల సృజనాత్మక చొరవను పెంచే గ్రామీణ విత్తన కేంద్రాల అభివృద్ధి నినాదంగానే మిగిలిపోయింది. రైతు విత్తనాలను స్వంతంగా తయారు చేసుకునే హక్కుపై దాడి చేస్తున్నారు. భారతదేశ విత్తన సంపదను కాపాడవలసిన అవసరం గురించి మౌనం వహించారు. విత్తన స్వావలంబనను అందుబాటులోకి తీసుకురావడం, విత్తన సరఫరాలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచటం ద్వారా రైతు హక్కులను కాపాడటం లక్ష్యంగా పెట్టుకోవటం విస్మరించారు. రైతులు తయారు చేసిన విత్తనాలు ఏదో ఒక కంపెనీ కొనుక్కుని బ్రాండ్ వేసుకొని మార్కెట్లో అమ్ముకుంటున్నది. మన రైతుల శక్తిని విస్మరించి, కార్పొరేట్ ఒత్తిడికి లొంగి విత్తన స్వాతంత్ర్యాన్ని తాకట్టు పెడుతున్నారు.

ప్రత్యేకించి రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతి సంవత్సరం ఖరీఫ్ రబీ సీజన్లో నకిలీ, నాణ్యత లేని నాసిరకం విత్తనాల అమ్మకాల కారణంగా రైతులు భారీగా నష్టాలు చవిచూస్తున్నాయి. విత్తనాలు అమ్మిన కంపెనీలు ముందు ఒకరకంగా వాగ్దానాలు ఇస్తున్నారు. మొలక శాతానికి, దిగుబడులకు మాదే గ్యారంటీ అంటున్నారు. అమ్ముకున్న తరువాత సమస్య వచ్చినపుడు ముఖం చాటేస్తున్నారు. విత్తన సరఫరా గొలుసులో పారదర్శకత, జవాబుదారీతనం నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్తున్నా...సెక్షన్ 31 కింద నియమించబడిన సీడ్ ఇన్‌స్పెక్టర్‌కు విశేష అధికారాలను ఇచ్చారు. అనుమానం వచ్చిన విత్తనాల శాంపిళ్లను ఆ ప్రాంత అనలిస్ట్ దగ్గరకు పంపి, స్టాక్‌ను సీజ్ చేయాలి. సీడ్ ఇన్‌స్పెక్టర్‌కు అనుమానం వచ్చినప్పుడు ఇంటి తలుపులు పగలకొట్టైనా అనుమానం వున్న విత్తనాలను స్వాధీనం చేసుకునే అధికారాలను ఇచ్చారు. అపరిమితమైన అధికారాలను సీడ్ ఇన్‌స్పెక్టర్‌కు కట్టబెట్టారు.

కొంతమంది స్వార్థ ప్రయోజనాలు కలిగిన రైతులు కంపెనీలను అనవసరంగా కోర్టుకు లాగుతున్నారంటూ కంపెనీలను రక్షించాలని ప్రభుత్వం వాదించింది. 2025 నాటికి భారత విత్తన మార్కెట్ విలువ దాదాపు 3.82 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా. 2030 నాటికి దాదాపు 5.5 శాతం వార్షిక వృద్ధిరేటుతో దాదాపు 5 బిలియన్ డాలర్లు పెరుగుతుందని అంచనా. ఇంత భారీ మార్కెట్‌పై బేయర్స్, మాన్సాంటో, సింజెంటా లాంటి కార్పొరేట్ కంపెనీలు కన్ను వేశాయి. పెద్ద కంపెనీలు తప్పులు చేయరంటున్నారు. వలస పాలకులు తమ సహాయకులను రక్షించేందుకు ఉపయోగించిన 'గుడ్ ఫెయిత్' క్లాజును విత్తన చట్టంలో కూడా ప్రయోగిస్తున్నారు.

చట్టాలను అతిక్రమించే కార్పొరేట్లకు వెసులుబాటు

మొదటి తప్పు, రెండవ తప్పులకు పెనాల్టీ లేదు. కేంద్ర ప్రభుత్వం లేక రాష్ట్ర ప్రభుత్వం అవసరాన్ని బట్టి పెనాల్టీని నిర్ణయించటానికి సెక్షన్ 34 ప్రకారం ఒక నోటిఫికేషన్ ద్వారా ఒక ఆఫీసర్‌ను నిర్ణయించవచ్చు. ప్రభుత్వం నియమించిన ఆఫీసరు పెనాల్టీని నిర్ణయిస్తాడు. ఆ ఆఫీసురు సెక్షన్ 31 ప్రకారం ప్రథమ తప్పు అని భావిస్తే కంపెనీని శిక్ష లేకుండా వదిలేయొచ్చు. లేకపోతే రూ.50 వేల పెనాల్టీని, చిన్న తప్పు కింద విధించవచ్చు. మూడు సంవత్సరాల వరకు అదే తప్పులు మరలా చేస్తూ ఉంటే రెండు లక్షల పెనాల్టీ వరకు విధించవచ్చు. పెద్ద తప్పు అని భావిస్తే పది లక్షల పెనాల్టీ జరిమానా కూడా విధించవచ్చు. మరలా ఐదు సంవత్సరాల తర్వాత కూడా అదే పని చేస్తుంటే రూ.30 లక్షలు వరకు కూడా పెనాల్టీ విధించడానికి, డీలర్‌షిప్‌ని రద్దు చేయడానికి, మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించడానికి ఈ బిల్ అవకాశమిస్తున్నది. ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే ఎక్కువ ధరలకు అమ్మడం, రిజిస్ట్రేషన్ గడువు ముగిసిన తర్వాత ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం విత్తన వ్యాపారాన్ని కొనసాగించటం, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ప్రదర్శించకపోవడం, విత్తన ప్యాకెట్‌పైన లేబుల్ అతికించకపోవటం లాంటివన్నీ కూడా చిన్న తప్పుల కింద భావిస్తారు.

విత్తనం మొలకెత్తే వరకు కంపెనీలు బాధ్యత వహించేలా బిల్లు నిర్దేశించాలి. విత్తనాలు మొలకెత్తినప్పటికీ పంట దిగుబడి ఇవ్వకపోతే ఏం చేయాలి? విత్తన నష్టానికి గరిష్ట పరిహారంపై పరిమితి ఉండకూడదని రైతు నాయకులు కోరుతున్నారు. నకిలీ విత్తనాలు తరచుగా ఒకేలాంటి బ్రాండ్ కింద అమ్ముడవుతాయి. మొలకెత్తడంలో లేదా వాగ్దానం చేసిన దిగుబడిని అందించడంలో ఇవి తరచుగా విఫలమవుతాయి. దీనివలన రైతుల అప్పుల భారం పెరుగుతుంది. సంవత్సరంలో ఒక్క పంట నష్టపోయినా దెబ్బ నుంచి కోలుకోలేరు. 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల విత్తన తనిఖీదారులు సేకరించిన మొత్తం 2.5 లక్షల విత్తన నమూనాలలో 32,525 నమూనాలు నాణ్యత లేనివిగా తేలిందన్నారు.

విత్తన దిగుమతులు

విత్తన ఉత్పత్తిలో ప్రపంచంలో భారతదేశం మూడవ స్థానంలో ఉంది మొదటి స్థానాల్లో అమెరికా, చైనా, తర్వాత భారతదేశం ఉంది. భారతదేశంలో కూడా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఉత్పత్తిలో ముందున్నాయి. భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన స్థానిక విత్తనాలను భద్రపరిచి, తిరిగి వాడుకునే సాంప్రదాయ ప్రక్రియకు ప్రమాదం ఏర్పడింది. పేటెంట్ ఉన్న బ్రాండెడ్ పంపిణీ విత్తనాలను మాత్రమే వాడాలనే దుష్ట సాంప్రదాయాన్ని ఈ ముసాయిదా బిల్లులో ప్రతిపాదించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో లక్షల ఎకరాల్లో విత్తనాలను తయారుచేస్తున్నారు. విత్తనాలను తయారుచేస్తున్న కర్నూలు, మహబూబ్ నగర్, నూజివీడు రైతుల రక్షణ గురించి బిల్లు ఏమీ మాట్లాడలేదు. అమెరికా, యూరప్ దేశాల పేటెంట్లతో మన రైతులు విత్తన స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను కోల్పోనున్నారు. భారత సంప్రదాయ వ్యవసాయంలోని మంచి లక్షణాలను కూడా విస్మరిస్తున్నందున వ్యవసాయం ప్రమాదంలో పడుతున్నది. ఈ బిల్లు విత్తన దిగుమతులను సరళీకరించి, కార్పొరేట్ కంపెనీలకు లాభాలను కూడపెట్టడం ముఖ్య ధ్యేయంగా పెట్టుకున్నట్లుంది.

ప్రపంచ వెరైటీలను భారత దేశంలోకి విచక్షణా రహితంగా అనుమతించటం ద్వారా దేశీయ విత్తనాభివృద్ధిని శాశ్వతంగా దెబ్బగొడుతున్నారు. రైతుల సృజనాత్మక చొరవను పెంచే గ్రామీణ విత్తన కేంద్రాల అభివృద్ధి నినాదంగానే మిగిలిపోయింది. రైతు విత్తనాలను స్వంతంగా తయారు చేసుకునే హక్కుపై దాడి చేస్తున్నారు. భారతదేశ విత్తన సంపదను కాపాడవలసిన అవసరం గురించి మౌనం వహించారు. విత్తన స్వావలంబనను అందుబాటులోకి తీసుకురావడం, విత్తన సరఫరాలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచటం ద్వారా రైతు హక్కులను కాపాడటం లక్ష్యంగా పెట్టుకోవటం విస్మరించారు. రైతులు తయారు చేసిన విత్తనాలను ఏదో ఒక కంపెనీ కొనుక్కుని బ్రాండ్ వేసుకొని మార్కెట్లో అమ్ముకుంటున్నది. మన రైతుల శక్తిని విస్మరించి, కార్పొరేట్ ఒత్తిడికి లొంగి విత్తన స్వాతంత్ర్యాన్ని తాకట్టు పెడుతున్నారు.

- నాసిరకం లేదా నకిలీ విత్తనాల వల్ల పంట నష్టం సంభవించిన రైతులకు తప్పనిసరిగా, సులభంగా నష్టపరిహారం చెల్లించడానికి బిల్లులో స్పష్టమైన, సరళమైన నిబంధనలు ఏమీ లేవు. నష్ట పరిహారం క్లెయిమ్ చేసుకోవడానికి అవసరమైన ప్రక్రియ క్లిష్టంగా వున్నది. శాంపుల్ సేకరణ, లాబొరేటరీ పరీక్షలు, విచారణలు అన్నీ చాలా క్లిష్టంగా, ఖరీదైనదిగా ఉన్నాయి. ఇది చిన్న రైతులు న్యాయం పొందకుండా నిరోధిస్తుంది.
- విత్తన పరిశ్రమపై ప్రభుత్వ నియంత్రణ తగ్గి, కేంద్రీకృత గుర్తింపు వ్యవస్థ కారణంగా పెద్ద కార్పొరేట్ కంపెనీల ఆధిపత్యం పెరుగుతుంది. విత్తన ధరలు అమాంతం పెరిగే అవకాశం ఉంది.
- ఈ ముసాయిదా బిల్లు విత్తన పరిశ్రమలో కార్పొరేట్ కంపెనీల వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని పెంచడం ద్వారా, వారి పరిశోధన పెట్టుబడులకు రక్షణ కల్పించడం ద్వారా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనం చేకూరుస్తుంది.

ఈ నిబంధనలన్నీ కలిసి, పెద్ద కార్పొరేట్ కంపెనీలు భారతదేశ విత్తన మార్కెట్‌లో మరింత స్వేచ్ఛగా, వేగంగా కార్యకలాపాలు నిర్వహించడానికి ఈ బిల్లు ఉపయోగపడుతుంది. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా, రైతు ప్రయోజనాలకు వ్యతిరేకంగా వున్న ఈ బిల్లును తిప్పికొట్టాలి.

/వ్యాసకర్త సెల్ : 9000657799,
నల్లమడ రైతు సంఘం, గుంటూరు/

బలిపీఠంపై కార్మికుల భవితవ్యం

వ్యాఖ్య

జి. తిరుపతయ్య

కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడానికి కనీస సభ్యుల సంఖ్యను అమాంతం పెంచివేయడం, నిరసనలు ధర్నాలు నిర్వహించడానికి అనుమతులను తప్పనిసరి చేయడం, సదరు నిరసనలు సమ్మెలు చేయడానికి కంపెనీ లేదా సంస్థ కార్యాలయానికి కనీసం రెండు కిలోమీటర్ల దూరాన్ని పాటించాలని షరతు విధించడం, పని ప్రదేశాలలో ప్రమాదాలు జరిగినప్పుడు పరిహారాన్ని యాజమాన్యాల ఇష్టానుసారానికి వదిలివేయడం, కలిసికట్టుగా తెలిపే నిరసనను నేరపూరితంగా పరిగణించడం వంటివి ప్రతిపాదిత నాలుగు లేబర్ కోడ్‌లలో పొందుపరిచినప్పుడే కార్మికుల, కార్మిక సంఘాల అస్తిత్వానికి చరమగీతం పాడారు. ఇప్పుడు కార్మికులు ఇవన్నీ పాటించినప్పటికీ 'శ్రమశక్తి నీతి' పేరు మీద యాజమాన్యాలు ఎలాంటి కక్షపూరిత చర్యలకు పాల్పడినా ప్రభుత్వాలు ఏమీ పట్టించుకోవు.

కార్మిక మంత్రిత్వశాఖ ఇకనుండి యాజమాన్యాల మంత్రిత్వశాఖగా మారబోతున్నదా! యాజమాన్యాల రక్త దాహానికి రహదారులను ప్రభుత్వమే సిద్ధం చేస్తున్నదా! మోడీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను చూస్తుంటే అవుననే చెప్పుకోవాల్సి వుంటుంది.

29 కార్మిక చట్టాలను చుట్ట గట్టి, చూరు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా రూపొందించి కార్మికుల నరాలన్నింటినీ ఎలా బిగించాలో పార్లమెంట్ సాక్షిగా సిద్ధం చేశారు. వాటి అమలుకు ఆదేశాలు ఇంకా వెలువడక ముందే అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, అనేకానేక కంపెనీలు ఆ నాలుగు లేబర్ కోడ్‌లలో ఉన్న వాటికన్నా ఎక్కువ నిర్బంధాలతో పని గంటలు పెంచి, రాత్రింబవళ్ల తేడా లేకుండా ఉద్యోగులను రాచి రంపాన పెడుతూ, మహిళలకు ఏమాత్రం రక్షణ లేకుండా అన్ని వేళల్లోనూ పని చేయించుకుంటూ ఇష్టానుసారంగా రంపపు కోత సాగుతున్నది.

ఈలోపునే 'శ్రమశక్తి నీతి 2025' పేరున కేంద్ర కార్మిక శాఖ కార్మిక చట్టాల స్వరూపాన్ని పూర్తిగా మార్చివేసి, దానిపై స్పందన తెలియజేయ వలసిందిగా ప్రజలను ప్రభుత్వం కోరుతున్నది. ప్రభుత్వాన్ని అడగవలసిన మొత్తం మొదటి ప్రశ్న–కార్మికులను ప్రభావితం చేసే అంశాలపై ప్రజలు స్పందించగలుగుతారా లేదా కార్మిక సంఘాలు, కార్మికులు స్పందిస్తారా? దీన్నిబట్టి కార్మిక సంఘాల పట్ల, కార్మికుల పట్ల ఈ పెద్దలకు ఎంత నిర్లక్ష్య భావన ఉన్నదో స్పష్టమవుతున్నది. ఈ శ్రమశక్తి నీతి విధానాన్ని రూపొందించడానికి కౌటిల్యుని అర్థశాస్త్రం, మనుస్మృతి, యజ్ఞవల్క్య స్మృతి, నారద స్మృతి, శుక్ర నీతి వంటి వాటిని ప్రాతిపదికగా చేసుకుని రచించామని ప్రకటించారు. వారెవా! మన సాంప్రదాయాలను, మన నమ్మకాలను ఉటంకిస్తూ మన వేలితో మన కన్నునే నేరుగా పొడుచుకోవడానికి ఎంతటి కుయుక్తులతో సిద్ధమవుతున్నారో చూడండి! ఇలాంటి స్మృతులను ఉటంకించి భవిష్యత్తులో చట్టాలకు బదులు సాంప్రదాయ వాదంలో సమాధానాలు వెతుక్కోమని చెప్పడానికి మార్గం సుగమం చేసుకుంటున్నారన్నమాట! "వ్యాపారం ద్రోహ చింతనం" (వ్యాపారం చేయడం మోస ప్రవృత్తికి అవకాశం ఇస్తోందని చెప్పిన కౌటిల్యుని మాటలకు ఏ మాత్రం విలువ ఇవ్వరు కానీ, "లాభార్థి సర్వకార్య సాగుణ నీతి" (లాభాన్ని ఆశించేవాడు చేసే పనిలో అన్ని కార్యాలు సరైనవే) అనే అంశాన్ని మాత్రం యాజమాన్యానికి అనుకూలంగా అన్వయింపజూస్తున్నారు. ఇంకో రకంగా చెప్పాలంటే భవిష్యత్తులో కార్మిక చట్టాలేవీ న్యాయ సమ్మతమైనవి కాకుండా చేయడానికి ఇవీ నాంది. కోర్టులో కూడా సవాల్ చేయడానికి వీలులేని విధంగా ఈ విధానాలను రూపొందిస్తున్నట్లు మనకు స్పష్టంగా అర్థమవుతోంది. కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడానికి కనీస సభ్యుల సంఖ్యను అమాంతం పెంచివేయడం, నిరసనలు ధర్నాలు నిర్వహించడానికి అనుమతులను తప్పనిసరి చేయడం, సదరు నిరసనలు సమ్మెలు చేయడానికి కంపెనీ లేదా సంస్థ కార్యాలయానికి కనీసం రెండు కిలోమీటర్ల దూరాన్ని పాటించాలని షరతు విధించడం, పని ప్రదేశాలలో ప్రమాదాలు జరిగినప్పుడు పరిహారాన్ని యాజమాన్యాల ఇష్టానుసారానికి వదిలివేయడం, కలిసికట్టుగా తెలిపే నిరసనను నేరపూరితంగా పరిగణించడం వంటివి ప్రతిపాదిత నాలుగు లేబర్ కోడ్‌లలో పొందుపరిచినప్పుడే కార్మికుల, కార్మిక సంఘాల అస్తిత్వానికి చరమగీతం పాడారు. ఇప్పుడు కార్మికులు ఇవన్నీ పాటించినప్పటికీ 'శ్రమశక్తి నీతి' పేరు మీద యాజమాన్యాలు ఎలాంటి కక్షపూరిత చర్యలకు పాల్పడినా ప్రభుత్వాలు ఏమీ పట్టించుకోవు. పైగా సూచనప్రాయ సలహా మాత్రమే ఇస్తాయి. పైపెచ్చు 'కోఆపరేటివ్ ఫెడరలిజం' అనే పేరును ఉటంకించి కార్మికులు యాజమాన్యాలు కలిసి మాట్లాడుకోవాలి తప్ప, పోరుబాట పట్టరాదన్నారు. ఇంకా చెప్పాలంటే యాజమాన్యాలకు సహకరిస్తూ, కావాల్సిన పరిహారాన్ని అర్థించాలి తప్ప డిమాండ్ చేసి బాధ పెట్టకూడదట. ఇలాంటి వాటిని కార్మిక చట్టాలంటారా? యాజమాన్య చట్టాలంటారా?

కార్మిక చట్టాల అమలుకు బాధ్యత వహించాల్సిన కేంద్రం కేవలం అవి అమలు జరిగేందుకు తోడ్పాటును అందిస్తుందట. అంటే ఇకనుండి యాజమాన్యాలు కార్మిక చట్టాలను పాటించకపోయినా అమలు చేయకపోయినా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన ఉండదు. ఒకవేళ కార్మికులెవరైనా తమ దృష్టికి తీసుకువస్తే ఇరు పక్షాలకు సూచనలు చేస్తుంది. ఇలాంటి పరిస్థితి ఇప్పుడు కొనసాగుతూనే ఉన్నది. అనేక కంపెనీలు ప్రావిడెంట్ ఫండ్ చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన కేంద్రం కేవలం సూచనప్రాయంగా కూడా మందలించడం లేదు. కార్మికులు, కార్మిక సంఘాలు కోర్టుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా ఫలితాల సున్నా. పి.ఎఫ్ డిపార్ట్‌మెంట్లు ఏమీ చేయలేని అసహాయతలో ఉన్నాయి. ఇకనుండీ ఇది అధికారికంగా యాజమాన్యాలకు లభించే హక్కుగా మారబోతున్నది. కాంట్రాక్ట్ ఎంప్లాయ్‌మెంట్ కల్పించే కాంట్రాక్టర్, వర్కర్లకు కాంట్రాక్ట్‌లోని అన్ని సదుపాయాలను కల్పించకపోతే, వర్కర్ల సేవలు పొందే ప్రిన్సిపల్ ఎంప్లాయర్ బాధ్యత వహించాలని కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్స్‌డ్ ఎంప్లాయ్‌మెంట్ చట్టంలో ఉండేది. లేబర్‌కోడ్ లలో దీన్ని పూర్తిగా తొలగించారు. ఇప్పుడు కాంట్రాక్టర్ బాధ్యత కూడా చట్ట పరిధి నుంచి తొలగిపోతున్నది. వర్కర్లను ఇష్టారీతిన తొలగించడానికి అనేక కారణాలతో పాటు మార్కెట్లో చౌకగా లభించే వర్కర్లు ఉన్నారని చూపించడానికి కూడా వెసులుబాటు కల్పిస్తున్నారు. గతంలో కంపెనీలలో కార్మికులకు సంబంధిత అంశాలను పరిశీలించడానికి ఇన్‌స్పెక్టర్‌ను నియమించేది. ఇప్పుడు దాని పేరు ఫెసిలిటేటర్‌గా మార్చుకున్నారు. ప్రస్తుతం ఉన్న లేబర్ పాలసీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పార్లమెంట్‌లో, విధానసభలో చర్చించిన అనంతరం రాజ్యాంగం ద్వారా ఏర్పడినది. స్వాతంత్ర్యానికి పూర్వమే అంబేద్కర్ ఆధ్వర్యంలో ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ మొదలైంది. కానీ ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తర్వాత 2015 నుండి ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశాలు జరగడం లేదు. "కార్మిక సంఘాలు, యాజమాన్యాలు, ప్రభుత్వం" కలిసి కార్మిక చట్టాల అమలు, కార్మికుల వెతలు, యాజమాన్య వ్యవస్థ స్థితిగతుల వంటి వాటిపై చర్చించాల్సిన అధికారిక కార్యక్రమం పూర్తిగా విడనాడబడింది. దీన్నిబట్టి కార్మికుల పట్ల కార్మిక సంఘాల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఎంతటి నిర్లక్ష్యపూరిత వైఖరి ఉన్నదో స్పష్టమవుతోంది. ఇకనుండి 'ఫేర్ వేజ్, లివింగ్ వేజ్, మినిమమ్ వేజ్' అన్న విధానాలు ఉండవు. యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై వేతనాలు ఆధారపడి ఉంటాయి.

పెట్టుబడిదారులు కంపెనీ లాభాల కోసం వర్కర్ల వేతనాలను టార్గెట్ చేసుకోవడం చూస్తున్నాం. అయితే కార్మికోద్యమ చరిత్రలో ఏనాడూ యాజమాన్యాలుగానీ ప్రభుత్వాలుగానీ తమ దయాదాక్షిణ్యాలతో చేయి విదిలించిన సందర్భాలు లేవు. ప్రజలు అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, చట్టాలు పోరాడి సాధించుకున్నవే తప్ప బుర్జువా పాలకులు ఇష్టంతో ప్రసాదించినవి కాదు. రాజకీయాలు పూర్తిగా డబ్బు మయమైపోయి, అమాయక ఓటర్లను చిరు కోరికలతో మోసం చేసే ప్రక్రియలో పాలక వర్గాలకు ఆశ్రిత పెట్టుబడిదారులు ఉపయోగపడుతున్నారు కాబట్టే ఇలాంటి దుర్నీతి చట్టాలు ముందుకొస్తున్నాయి. వీటిని ఎదుర్కొనే భాష కేవలం పోరాటం మాత్రమే. ★

జనవాక్యం

బాబాల తప్పులను కాసినట్లేగా!

ఎందుకూ పనికిరాని ఆవారాలు, సినిమా హాళ్లలో బ్లాక్ టికెట్లు అమ్ముకునేవాళ్ళు కాషాయ గుడ్డలు వేసుకొని, మెడలో రుద్రాక్షలు, ముఖాన విభూది పూసుకుని నాలుగు కంత్రీ మాటలు, నాలుగు మ్యాజిక్కులు నేర్చుకుని రాష్ట్రపతులను సైతం బురిడీ కొట్టించ గలిగినవాళ్లు ఈరోజు బాబాలుగా వేశాలు వేస్తూ సమాజాన్ని మూఢనమ్మకాలలో ముంచివేస్తున్నారు. వీళ్లను రాజకీయ నాయకులే పెంచి పోషిస్తున్నారు. అందుకే జీవితకాల శిక్ష పడిన డేరా బాబా 14 సార్లు పెరోల్ మీద బయటికి వచ్చాడు. ప్రభుత్వ భూములు ఆక్రమించినా బాబాలుగా కొనసాగుతున్నారు. ఆశ్రమాలలో ఎన్ని హత్యలు, అత్యాచారాలు జరిగినా కేసులుండవు. పైగా శతజయంతులు జరుపుతున్నారు. రాష్ట్రపతులూ, ప్రధానులూ, ఉప రాష్ట్రపతులు, గవర్నర్లూ, ముఖ్యమంత్రులూ వారిని దర్శించుకుంటూ ప్రజలకు ఏం సంకేతాలు ఇస్తున్నట్లు? బాబాలు చేసిన తప్పుడు పనులకు వీరంతా మద్దతు పలికినట్లేకదా? వారి సొంత డబ్బుతో, ఆ యా ఉద్యోగాలకు, పదవులకు రెండు రోజులు సెలవు పెట్టుకొని, అనధికారికంగా వస్తే ఇబ్బందిలేదు! అధికారికంగా వస్తేనే రాజ్యాంగంలోని లౌకికవాదాన్ని మంటగలిపినట్లు.

- నార్నె వెంకట సుబ్బయ్య

20 ఏళ్లలోనే పెళ్లి.. పిల్లలు

- జోహో సిఇఒ శ్రీధర్ వెంబు

న్యూఢిల్లీ : యువత 20ల్లోనే పెళ్లి చేసుకొని.. పిల్లల్ని కనాలని జోహో సిఇఒ శ్రీధర్ వెంబు తెలిపారు. అపోలో సిఎస్ఆర్ వైస్ ఛైర్‌పర్సన్, నటుడు రామ్‌చరణ్ సతీమణి ఉపాసన చేసిన పోస్ట్‌పై ఆయన ఈ అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇటీవల ఉపాసన ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులతో ముచ్చటించారు. ఆ సంభాషణను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు. పెళ్లి చేసుకుంటున్నారా..? అని అడిగిన ప్రశ్నకు అమ్మాయిల కంటే అబ్బాయిలే ఎక్కువగా చేతులు పైకెత్తారని ఆమె వెల్లడించారు. "మహిళలు కెరీర్‌ను నిర్మించుకోవడంపై దృష్టి పెట్టారని దీనిని బట్టి అర్థమైంది. ఇది సరికొత్త భారత్" అని ఆమె రాసుకొచ్చారు. దీనిపై వెంబు స్పందించారు. "యువత 20ల్లోనే పెళ్లి చేసుకోవాలి. పిల్లల్ని కనాలని నేను సూచిస్తున్నాను. వారు తమ సమాజం, పూర్వీకుల కోసం ఈ విధిని నిర్వర్తించాలి. ఇవన్నీ పాతకాలం మాటల్లా అనిపిస్తాయి. అయితే మళ్లీ ఈ మాటలే ప్రతిధ్వనిస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆ పోస్ట్ చేశారు. శ్రీధర్ సలహాపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. యువత వివాహాలు వాయిదా వేయడం వెనక ఆర్థిక ఒత్తిడులు ప్రధాన కారణమని ఓ నెటిజన్ కామెంట్ పెట్టారు. "స్థిరమైన జీతాలు, వర్క్-లైఫ్ బ్యాలెన్స్ లేకపోవడం, వచ్చే జీతంలో 40 శాతం అద్దెకే వెళ్లిపోవడం వల్ల వారు కుటుంబాన్ని ఏర్పరుచుకోవాలంటే భయపడుతున్నారు. అది జనాభా సంక్షోభం కాదు.. ఆర్థిక సంక్షోభం" అని వివరణ ఇచ్చారు. "ఒక్కోతరం దృష్టిలో బాధ్యతకు ఒక్కో అర్థం ఉంటుంది. కొందరు కుటుంబానికి ప్రాధాన్యం ఇస్తే.. ఇంకొందరు కెరీర్ ముఖ్యమనుకుంటారు. ఈ రెండు మార్గాలు సమాజానికి అర్థవంతమైనవే" అని మరొకరు పేర్కొన్నారు. ఆలస్యంగా వివాహం చేసుకుంటే కలిగే సమస్యల గురించి మరికొందరు ప్రస్తావించారు.

భారత్, హిందూ రెండూ ఒక్కటే

- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వివాదాస్పద వ్యాఖ్యలు

గౌహతి : భారత్, హిందూ పర్యాయపదాలని, రెండింటి అర్థం ఒక్కటేనని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. ఈ మాటలు అన్న కాసేపటికే ఇతర మతాలకు చెందిన వారు భారత సంస్కృతిని అవలంభిస్తే వారు కూడా హిందువులేనని అనడం ద్వారా ఆయన కొత్త వివాదానికి తెర తీశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా అస్సాంలో పర్యటిస్తున్న మోహన్ భగవత్ మంగళవారం అనుబంధ సంస్థల ప్రముఖులతో గౌహతిలో సమావేశమైన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల ద్వారా ఆయన భారతీయ సంస్కృతికి ఉన్న విశిష్టతను దెబ్బతీస్తుండటంతో పాటు, సంఘ్‌పరివార్ చెబుతున్న హిందుత్వమే భారతీయత అన్న అర్థం ఇచ్చేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో ఇతర మతాల అస్తిత్వాన్ని దెబ్బకొట్టే ప్రయత్నంచేశారు. ఇతర మతాలకు చెందిన వారు వారి ఆచారాలను, సాంప్రదాయాలను పాటిస్తూ, భారతీయ సంస్కృతిని అనుసరిస్తే వారిని కూడా హిందువులుగానే భావించవచ్చని ఆయన చెప్పారు. అంతేకాకుండా వారి పూర్వీకులు హిందువులు అనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. దేశంలో ఉండేవారందరు భారతీయ (హిందూ) సంస్కృతిని ఆచరిస్తే, అందరూ హిందువులే అవుతారని, అప్పుడు దేశాన్ని 'హిందూ రాష్ట్రం'గా ప్రత్యేకంగా ప్రకటించాల్సిన అవసరం కూడా ఉండదని అన్నారు. ఈ మాటలు చెబుతూనే ఆయన ఇతర మతస్తుల జనాభా పెరుగుతోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి ప్రతిగా ప్రతి హిందూ కుటుంబం కనీసం ముగ్గురు పిల్లలను కనాలని చెప్పారు. అమెరికా ప్రభుత్వం ప్రాపకంకోసం ఆర్ఎస్ఎస్ కోట్ల రూపాయలు ఖర్చు చేసి లాబీయింగ్ జరిపించిన కొద్ది రోజుల క్రితం మీడియాలో కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే సాంస్కృతిక సంస్థ అని చెప్పుకునే ఆర్ఎస్ఎస్ ఇప్పటికరకూ దానిపై స్పందించకపోవడం గమనార్హం.

నోయిడాలోని ఇస్తాంబుల్ ప్రింటింగ్ ప్రెస్‌పై దాడులు

న్యూఢిల్లీ : ఢిల్లీ పేలుడు కేసులో కీలక నిందితుడు డా.ఉమర్ నబీ, ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్‌కు చెందిన డా.ముజమ్మిల్ గనాయీ తదితరులు 2021లో తుర్కియేకు వెళ్లారని.. ఆ దేశంలో వారు జైషే మహమ్మద్ ప్రతినిధులను కలిసినట్లు దర్యాప్తు అధికారులు ఆరోపించిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా తుర్కియేతో సంబంధాలు ఉన్న సంస్థలపై అధికారులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో ఉత్తర ప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం (ఎటిఎస్) అధికారులు గ్రేటర్ నోయిడాలోని ఇస్తాంబుల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రింటింగ్ ప్రెస్‌పైనా దాడులు చేశారు.

ఇస్తాంబుల్ ఇంటర్నేషనల్ ప్రింటింగ్ ప్రెస్‌లో మత విద్వేషాలు రెచ్చగొట్టే కంటెంట్‌ను ప్రచురిస్తున్నట్లు గుర్తించామని ఎటిఎస్ అధికారులు పేర్కొన్నారు. కార్యాలయంలోని సిసిటివి ఫుటేజీ, ఇతర పత్రాలు, డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. 2021లో డా.ముజమ్మిల్ గనాయీ, ఉమర్ తుర్కియే వెళ్లిన సమయంలో ఉమర్ ఓ విదేశీ హ్యాండ్లర్‌ను కలిశాడని.. ఈ హ్యాండ్లర్ భారత్‌లో టెర్రర్ మాడ్యూల్‌ను ఏర్పాటు చేయడం, నిర్వహించడంపై వివరణాత్మక సూచనలు చేశాడన్నారు. పేలుడు పదార్థాలు, ఇతర వనరులను సేకరించడానికి తుర్కియే ఆధారిత నెట్‌వర్క్‌ల ద్వారా వారికి ఆర్థికసాయం అందిందని తెలిపారు. దీంతో తుర్కియేతో సంబంధాలు ఉన్న సంస్థలపై దాడులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నిందితుల విచారణ ప్రకారం.. 2021లో డా.ముజమ్మిల్ గనాయీ, ఉమర్ తుర్కియే వెళ్లొచ్చిన తర్వాత బహిరంగ మార్కెట్ నుంచి పెద్దఎత్తున రసాయనాలు సేకరించడం ప్రారంభించారు. వీటిలో 360 కిలోల అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్, సల్ఫర్ ఉన్నాయి. వీటిలో ఎక్కువ భాగం అల్ ఫలా విశ్వవిద్యాలయ ప్రాంగణం సమీపంలో నిల్వ చేశారు. డిసెంబర్ 6న (బాబ్రీ మసీదు కూల్చివేత రోజు) భారీ పేలుళ్లకు ఉమర్ నబీ ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అంతలోనే ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కుట్ర బయటపడింది. ఇదికాస్త ఉమర్‌లో భయాందోళనకు దారితీయడం.. చివరకు ఎర్రకోట సమీపంలో ముందుగానే పేలుడు చోటుచేసుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

రిపోర్టర్‌పై ట్రంప్ ఆగ్రహం

వాషింగ్టన్ : సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ సుమారు ఏడేళ్ల తర్వాత అమెరికాలో పర్యటించారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన విలేకరుల సమావేశంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఏబీసీ ఛానల్‌కు చెందిన ఒక రిపోర్టర్ జర్నలిస్టు జమాల్ ఖషోగ్గి హత్యపై ప్రశ్నించగా.. ట్రంప్ ఆమెపై మండిపడ్డారు.

2018లో జర్నలిస్టు జమాల్ ఖషోగ్గి హత్యకు గురయ్యారు. దీని వెనక సల్మాన్ హస్తం ఉందని ఆరోపణలు వచ్చాయి. ఇదే విషయాన్ని అమెరికా ఇంటెలిజెన్స్ విభాగం కూడా వెల్లడించింది. ఈ హత్యపై తాజాగా జర్నలిస్టు ప్రశ్నించగా.. అమెరికా నిఘా ఆరోపణలను కూడా తోసిపుచ్చుతూ ట్రంప్ క్రౌన్ ప్రిన్స్‌ను సమర్థించారు. 'మీరు మాట్లాడుతున్న ఆ పెద్దమనిషి చాలామందికి నచ్చలేదు. మీకు నచ్చినా.. నచ్చకపోయినా అది జరిగిపోయింది. క్రౌన్ ప్రిన్స్‌కు దానిగురించి ఏమీ తెలియదు. మనం దాన్ని అలాగే వదిలేయాలి. ఇలాంటి ప్రశ్నలు అడిగి మీరు అతిథిని ఇబ్బందిపెట్టాల్సిన అవసరం లేదు' అని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ఆయన రిపోర్టర్‌పై మండిపడ్డారు. ఆ ఛానల్‌కు సంబంధించి యూఎస్ లైసెన్స్‌ను రద్దు చేయాలన్నారు. మీవి నకిలీ వార్తలంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇదే ప్రశ్నకు ఎంబీఎస్ స్పందిస్తూ ఖషోగ్గి హత్య చాలా బాధాకరమైనదన్నారు.

ట్రంప్ మొదటి పదవీకాలంలో జరిగిన ఖషోగ్గి హత్య సౌదీ- అమెరికాల మధ్య దౌత్య సంక్షోభానికి దారితీసింది. ప్రస్తుతం సౌదీతో తన సంబంధాలను పెంచుకునేందుకు ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నారు. సల్మాన్ పర్యటన నేపథ్యంలో అమెరికాతో కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. యూఎస్‌లో 1 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని నిర్ణయించుకున్నారు. దీంతో పాటు ఎఫ్-35 ఫైటర్ జెట్‌లను సౌదీకి విక్రయించనున్నట్లు ట్రంప్ తెలిపారు. అలాగే, ఈ పర్యటన నేపథ్యంలో ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ విందును ఏర్పాటుచేశారు. ఇందులో ఫుట్‌బాల్ దిగ్గజం, పోర్చుగల్ స్టార్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో కూడా పాల్గొన్నారు. ఈ క్రమంలో ట్రంప్ మాట్లాడుతూ తన చిన్న కుమారుడు బారన్ ట్రంప్.. రొనాల్డోకు పెద్ద అభిమాని అని తెలిపారు.

2వ ర్యాంక్‌కు రోహిత్

- ఐసిసి వన్డే ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజాగా ప్రకటించిన వన్డే బ్యాటర్ల జాబితాలో టీమిండియా ఓపెనర్ రోహిత్ శర్మ అగ్రస్థానాన్ని కోల్పోయాడు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రోహిత్ రెండో స్థానానికి పడిపోయాడు. ఈ క్రమంలో న్యూజిలాండ్‌కు చెందిన డారిల్ మిచెల్(782పాయింట్లు) వన్డే బ్యాటర్స్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం స్థానంలో నిలిచాడు. దీంతో వన్డే బ్యాటర్లలో టాప్ ప్లేస్‌కు చేరుకున్న రెండో న్యూజిలాండ్ బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. వెస్టిండీస్‌తో బుధవారం జరిగిన తొలి వన్డేలో మిచెల్ సెంచరీ కదం తొక్కాడు. దీంతో అతని ర్యాంక్ మెరుగైంది. రోహిత్ శర్మ(781) కన్నా ఓ పాయింట్ ఎక్కువ ఉన్నాడు. 1979లో కివీస్ బ్యాటర్ గ్లెన్ టర్నర్ ఒక్కడే ఆ దేశం తరపు నుంచి వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేస్‌లో నిలిచాడు. కివీస్ మాజీ క్రికెటర్లు మార్టిన్ క్రోవ్, ఆండ్రూ జోన్స్, రోజర్ టౌస్, నాథన్ ఆస్టిల్, కేన్ విలియమ్సన్, మార్టిన్ గుప్తిల్, రాస్ టేలర్.. టాప్ అయిదు ర్యాంకుల్లో మాత్రమే నిలిచారు. తాజా ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘన్ బ్యాటర్ జర్దాన్ మూడవ స్థానంలో గిల్(745), కోహ్లి(725) నాలుగు, ఐదో స్థానాలో నిలిచారు.

రెండో వన్డేలో కివీస్ గెలుపు

- వెస్టిండీస్‌తో సిరీస్ 2-0తో కైవసం

నేపియర్: వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో న్యూజిలాండ్ జట్టు ఘన విజయం సాధించింది. వర్షం కారణంగా 34ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ నిర్దేశించిన 248పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ జట్టు మరో మూడు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. కాన్వే(90), రచిన్ రవీంద్ర(56) అర్ధసెంచరీలకి తోడు వికెట్ కీపర్ లాథమ్(39), కెప్టెన్ సాంట్నర్(34) బ్యాటింగ్‌లో రాణించారు. విండీస్ బౌలర్లు ఫోర్డే, సీల్స్, గ్రీవ్స్, ఛేస్, స్ప్రింజర్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు తొలుత బ్యాటింగ్‌కు దిగిన విండీస్‌ను కెప్టెన్, వికెట్ కీపర్ హోప్(109) రికార్డు సెంచరీతో ఆదుకున్నాడు. గ్రీవ్స్, షెఫర్డ్, అగస్టే బ్యాటింగ్‌లో ఫర్వాలేదనిపించారు. దీంతో వెస్టిండీస్ జట్టు నిర్ణీత 34 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 247పరుగులు చేసింది. న్యూజిలాండ్ బౌలర్లు స్మిత్‌కు నాలుగు, జేమీసన్‌కు మూడు వికెట్లు దక్కాయి.

రికార్డుపుటల్లో హోప్...

వెస్టిండీస్ సంచలన బ్యాటర్ షాయ్ హోప్ న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో సెంచరీతో పలు రికార్డులను సమం చేశాడు. కేవలం 69 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 109 పరుగులు చేసిన హోప్.. ఈ ఏడాది విండీస్ తరపున మూడు ఫార్మాట్లలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డుపుటల్లోకెక్కాడు. ఈ సెంచరీ హెూప్‌కు వన్డేల్లో 19వది. తద్వారా క్రిస్ గేల్(25) తర్వాత అత్యధిక వన్డే సెంచరీలు చేసిన ఆటగాడిగా రికార్డు. ఈ క్రమంలో దిగ్గజ బ్యాటర్ బ్రియాన్ లారా(19) రికార్డు సమం. 19 శతకాలను హెూప్ కేవలం 142 ఇన్నింగ్స్‌ల్లోనే సాధించాడు. తద్వారా బాబర్ ఆజమ్ (102), హాషిమ్ ఆమ్లా (104), విరాట్ కోహ్లి (124), డేవిడ్ వార్నర్ (139) తర్వాత అత్యంత వేగంగా ఈ శతకాల మైలురాయిని తాకిన ఆటగాడిగా రికార్డు. హెూప్ ఒక్క ఇన్నింగ్స్‌తో పలు రికార్డులు సాధించినా ఈ మ్యాచ్‌లో విండీస్ పరాజయం పాలైంది. ఈ పరాజయంతో విండీస్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 0-2తో కోల్పోయింది. నేపియర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. మూడో, చివరి నామమాత్రపు వన్డే హామిల్టన్ వేదికగా శనివారం జరగనుంది.

అమెరికాలో ఎపి మహిళ హత్య కేసులో మరో మలుపు

- అసలు నిందితుడిని పట్టించిన ల్యాప్‌టాప్

న్యూఢిల్లీ : అమెరికాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శశికళ నర్రా అనే మహిళ హత్య కేసు విచారణలో మరో మలుపు చోటు చేసుకుంది. శశికళ భర్త నర్రా హనుమంతరావు సహోద్యోగి ఈ హత్యకు పాల్పడినట్లుగా దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కేసు వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నర్రా హనుమంతరావు అనే వ్యక్తి అమెరికాలోని న్యూజెర్సీలో భార్య శశికళ(40), కొడుకు అనీష్ సాయి(7)తో కలిసి నివసించేవాడు. 2017 మార్చి 23న హనుమంతరావు విధులు ముగించుకొని వచ్చేసరికి.. మాపుల్ షేడ్‌లోని వారి అపార్ట్‌మెంట్‌లో భార్య, కొడుకు రక్తపు మడుగులో పడివుండడాన్ని గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. వీరి మరణాలకు భర్త నర్రా హనుమంతరావే కారణమని.. అతడికి, ఒక కేరళ మహిళకు మధ్య ఉన్న వివాహేతర సంబంధంతోనే భార్యాబిడ్డలను హత్య చేసినట్లు మృతురాలి బంధువులు ఆరోపించడంతో అతడిని విచారించారు. అయితే దర్యాప్తులో ఘటనాస్థలంలో లభించిన డిఎన్‌ఏ హనుమంతరావు డీఎన్‌ఏతో సరిపోకపోవడంతో అతడిని వదిలిపెట్టారు. తరువాత హనుమంతరావుకు సహెూద్యోగి హమీద్‌తో భేదాభిప్రాయాలు ఉన్నట్లు విచారణలో భాగంగా అధికారులు గుర్తించారు. ఈ హత్య కేసుతో హమీద్‌కు సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్న సమయంలో హత్య జరిగిన ఆరు నెలల అనంతరం అతడు భారత్‌కు తిరిగి వెళ్లినట్లు గుర్తించారు. అమెరికా అధికారులు భారత్‌లోని హమీద్‌ను సంప్రదించి, అతడి డీఎన్‌ఏ నమూనా ఇవ్వాలని పలుమార్లు కోరారు. అయితే హమీద్ వారి అభ్యర్థనను తిరస్కరిస్తూ వచ్చారు. దీంతో అతడి డీఎన్‌ఏను సేకరించడానికి హమీద్‌కు జారీ చేసిన ల్యాప్‌టాప్‌ను తమకు పంపమని కోరుతూ అమెరికా కోర్టు 2024లో కాగ్నిజెంట్ సంస్థకు ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా అతడి ల్యాప్‌టాప్ నుంచి సేకరించిన డీఎన్‌ఏ ఘటనా స్థలంలోని డీఎన్‌ఏతో సరిపోవడంతో హమీద్‌ను నిందితుడిగా పేర్కొంటూ అమెరికా పోలీసులు ఒక ప్రకటన జారీ చేశారు. అతడి ఆచూకీ తెలిసినవారు తమకు తెలియజేయాలని సూచించారు. హమీద్ ప్రస్తుతం భారత్‌లో ఉండడంతో అతడిని తిరిగి అమెరికాకు అప్పగించాలని అక్కడి అధికారులు భారత విదేశాంగశాఖను కోరారు. ఈ హత్య చేయడానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

జపాన్‌లో భారీ అగ్నిప్రమాదం

జపాన్ : నైరుతి జపాన్‌లోని ఓయిటా నగరంలో బుధవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదం కారణంగా 170 ఇళ్లు ధ్వంసం అయ్యాయి. మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. ఆ ప్రాంత ప్రజలను ఖాళీ చేయించారని సమాచారం. ఈ ఘటనలో ఒక వ్యక్తి ఆచూకీ తెలియలేదని జపాన్ అగ్నిమాపక, విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. మంగళవారం సాయంత్రం ఓయిటా నగరంలోని ఫిషింగ్ ఓడరేవు సమీపంలో బలమైన గాలుల సమయంలో మంటలు ప్రారంభమై అడవికి వ్యాపించాయి. ఓయిటా దక్షిణ ద్వీపం క్యుషులో ఉంది. ఒక నివాసి క్యోడో న్యూస్ ఏజెన్సీతో మాట్లాడుతూ.. మంటలు "కనురెప్పపాటులో వ్యాపించాయి" అని తెలిపారు. దీంతో ఆమె అక్కడ నుండి పరుగులు తీసిందని పేర్కొన్నారు.

శ్రీలంకకు వెళ్లాల్సిన విమానాలు దారి మళ్లింపు

తిరువనంతపురం: శ్రీలంకలో నెలకొన్న ప్రతికూల వాతావరణం కారణంగా బుధవారం శ్రీలంకకు వెళ్లాల్సిన రెండు విమానాలను కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు. దమ్మామ్-కొలంబో విమానం, తిరువనంతపురంకు వెళ్లాల్సిన టర్కిష్ ఎయిర్‌లైన్స్ విమానం ఉదయం విమానాశ్రయంలో సురక్షితంగా దిగాయి. మళ్లించిన ఈ విమానాలు శ్రీలంకలో వాతావరణం మెరుగుపడిన తర్వాత వాటి గమ్యస్థానాలకు బయలుదేరుతాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు. బంగాళాఖాతం, దాని ఆనుకుని ఉన్న శ్రీలంకలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శ్రీలంక, దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి.

హసీనా అప్పగింత కోసం ఇంటర్‌పోల్‌కు బంగ్లాదేశ్ ?

న్యూఢిల్లీ : భారత్ నుంచి తమ మాజీ ప్రధాని షేక్ హసీనా అప్పగింత కోసం ఇంటర్‌పోల్‌ను బంగ్లాదేశ్ ఆశ్రయించనుంది. షేక్ హసీనాకు బంగ్లాదేశ్ ప్రభుత్వం మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమెను తమకు అప్పగించాలని యూనస్ ప్రభుత్వం కోరుతున్నప్పటికీ భారత్ విముఖత చూపిస్తోంది. దీంతో ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న హసీనా, బంగ్లా మాజీ హెూంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌ల అప్పగింతపై ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించాలని బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ చర్యలు తీసుకుంటున్నట్లు అక్కడి మీడియా సంస్థలు వెల్లడించాయి.

దేశం విడిచి పారిపోయిన హసీనా, అసదుజ్జమాన్ ఖాన్‌లపై రెడ్ నోటీసులు జారీ చేయాల్సిందిగా ఇంటర్‌పోల్‌ను అభ్యర్థించడానికి బంగ్లా ప్రాసిక్యూటర్ గాజీ తమీమ్ సన్నాహాలు చేపట్టారని బంగ్లాదేశ్ దినపత్రిక ది ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులపై రెడ్ నోటీసులు జారీ చేయాలని కోరుతూ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఇప్పటికే ఇంటర్‌పోల్‌కు అరెస్ట్ వారెంట్‌తో పాటు దరఖాస్తు సమర్పించినట్లు తెలిపింది.

కాగా, మరోవైపు హసీనాకు బంగ్లాదేశ్ అంతర్జాతీయ ట్రైబ్యునల్ మరణ దండన విధించిందని పేర్కొంటూ ఆమెను తమకు అప్పగించాలని ఆ దేశ విదేశాంగశాఖ భారత్‌పై ఒత్తిడి తెస్తోంది. అయితే.. హసీనాపై వచ్చిన అభియోగాలు రాజకీయంగా చేసినవే తప్ప వాటిలో వాస్తవం లేదని భావిస్తున్న భారత్.. ఆమెను ఎట్టిపరిస్థితుల్లోనూ వారికి అప్పగించదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పాక్ ప్రభుత్వమే ఉగ్ర దాడులు చేయిస్తోంది

- ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ ముఖ్యమంత్రి విమర్శలు

కరాచీ : పాకిస్తాన్‌పై ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది.. తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయ అజెండాలో భాగంగానే పాకిస్తాన్ ప్రభుత్వం నకిలీ ఉగ్ర దాడులు చేయిస్తోందన్నారు. గత నెలలో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అఫ్రిది పాక్ ప్రభుత్వం ఖైబర్ ప్రాంతంలో ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాద సంఘటనలను సృష్టిస్తోందని ఆరోపించారు. నిజమైన శాంతి ప్రయత్నాలను అడ్డుకుంటుందన్నారు. ఇటీవల ఓ కార్యక్రమానికి హాజరైన పష్తున్ తహాఫుజ్ మూవెంట్ (పీటీఎం) సభ్యులు అపహరణకు గురైనట్లు తెలుస్తోంది. దీన్ని అఫ్రిది తీవ్రంగా ఖండించారు. శాంతి మార్గాలను పక్కదారి పట్టించడంతో పాటు అఫ్గానిస్థాన్‌తో తమ ప్రావిన్స్‌కు మధ్య ఏర్పడిన సంబంధాలను అడ్డుకునేందుకు ఇస్లామాబాద్ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రయత్నంగా దీన్ని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తమ నాయకుడు, మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌లాగానే తాను తలవంచనన్నారు. శాంతి ప్రయత్నాలకు భంగం కలిగించేవారిని ఉమ్మడి శత్రువుగా పరిగణిస్తామని హెచ్చరించారు. పఖ్తుంఖ్వా ప్రాంతాల్లో కొనసాగుతున్న సైనిక కార్యకలాపాలను ఆయన విమర్శించారు. సాయుధ దళాలు ఉగ్రవాద ఏరివేత పేరుతో పౌరులను లక్ష్యంగా చేసుకొని నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వారు దీన్ని ఉగ్రవాదంపై యుద్ధంగా పేర్కొంటున్నారని.. కానీ, సొంత ప్రజలనే చంపుతున్నారని మండిపడ్డారు. ఇటీవల పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని తిరా లోయలోని పాక్ వైమానిక దాడులు చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో అనేకమంది మహిళలు, చిన్నారులతో సహా 30 మంది ప్రాణాలు కోల్పోయారు. సైనిక కార్యకలాపాలను సమర్థించుకునేందుకు ఇస్లామాబాద్ సరిహద్దు ప్రాంతాల్లో దాడులకు పాల్పడుతుందని ఆరోపించారు.

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం UNI MONI FINANCIAL SERVICES LIMITED ద్వారా **24.11.2025** ఉదయం 10.00 గంటలకు దిగువ ఇవ్వబడిన సంబంధిత కేంద్రాలలో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేస్తున్నాం. వేలం వేయబోయే బంగారు ఆభరణాలు బకాయిలు చెల్లించడంలో విఫలమైన మా వివిధ కస్టమర్ల రుణఖాతాలకు చెందినవి., ఈ రుణ గ్రహీతలకు మా వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడ్డాయి. మా వివిధ కస్టమర్లు గడువు వ యిగిసిన ఋణం తిరిగి చెల్లించనందున వేలం వేయడం జరుగుతుంది. ఈ క్రింద వేలం వేయబడే బంగారు ఆభరణం బ్రాంపేరుతో పేర్కొన్నాం.

Auction Centre Address & Loan Nos: KHAMMAM (KHM - D No 8 - 3 - 215, First Floor, Beside Indus Ind Bank, Wyra Road, Khammam - 507001, Contact no : 9959617256) 2199161, 2201097, 2153251, 2134601, 2196432.

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate – A Government of India Undertaking
ప్రాంతీయ కార్యాలయం విజయవాడ-520003. | **బంగారు ఆభరణముల వేలం ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా ఈ క్రింది పేర్కొనబడిన ఖాతాదారులు, దిగువ తెలిపిన **కెనరా బ్యాంకు** బ్రాంచ్‌లలో బంగారు నగలు తాకట్టు పెట్టి, తీసుకున్న ఋణములు చెల్లించాల్సిందిగా బ్యాంకు వారు పలుమార్లు కోరినను, నోటీసులు పంపినను, వారు తమ బాకీలు చెల్లించలేదు. ఋణము చెల్లించవలసిన కాలము గడిచినందున సదరు బంగారు నగలను మా బ్యాంకు సంబంధిత బ్రాంచ్ ఆవరణలో **తేది.27.11.2025, గురువారం మధ్యాహ్నం 3 గం॥లకు** బహిరంగ వేలము వేసి వారి పేరున ఉన్న బకాయిలు జమకట్టుకొనబడును. ఈ ఖాతాదారులలో ఎవరికైననూ బ్యాంకు వారి నోటీసులు అందని యెడల లేదా నోటీసులు తిరస్కరించిన వారికి పత్రికాముఖంగా చివరగా తెలియజేయడమైనది. వేలము వేసినా బకాయిలు రద్దుకాని యెడల వారిపై చట్టరిత్యా తగుచర్యలు తీసుకొని మిగిలిన బకాయిలు వసూలు చేయబడును మరియు వేలము తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. ఈ దిగువ ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

నెం.	ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	స్థూల బరువు	నికర బరువు
విజయవాడ నాగార్జున నగర్ బ్రాంచ్ (6080), ఫోన్: 83338 13827				
1	164059283810	లక అంక బాబు	8.60 గ్రా॥	7.40 గ్రా॥
2	164067059897	లక అంక బాబు	7.80 గ్రా॥	6.60 గ్రా॥

వేలం నియమనిబంధనలు: (1) వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 10,000/- ధరావత్తు సొమ్మును సంబంధిత బ్రాంచ్‌లో చెల్లించి వేలంలో పాల్గొనవచ్చును. ధరావత్తు చెల్లించిన వ్యక్తిని మాత్రమే ఆక్షన్ హాలులోకి అనుమతించబడును. (2) పై నగలను వేలం తేదీనాటికి ఉన్నటువంటి బంగారం ధరను బట్టి రిజర్వు ధర నిర్ణయించబడును. వేలంలో పాల్గొన్నవారు పై వస్తువుల విలువ పరిమాణము, నాణ్యత కొరకు ఎటువంటి వివాదములకు బ్యాంకు బాధ్యత వహించదు. (3) హెచ్చుపాటదారుడు మొత్తం పాట సొమ్మును అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను. లేనియెడల ధరావత్తు సొమ్ము కోల్పోవుదురు. (4) పై ఖాతాదారులలో ఎవరికైనా మా బ్యాంకు నందు ఇంకనూ అప్పులు వున్నచో, వేలం ద్వారా మిగిలిన సొమ్మును ఆ ఖాతాకు సర్దుబాటు చేయబడును. (5) బ్యాంక్ సంతృప్తి మేరకు కె.వై.సి. డాక్యుమెంట్ తప్పనిసరిగా సమర్పించవలెను. (6) జిఎస్‌టి మరియు ఇతర ట్యాక్స్‌లు పాటదారుడే భరించవలెను. (7) ఏకారణం చూపకుండానే వేలం షరతులు మార్చుటకు, వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి సర్వహక్కులు కలిగియున్నవి. (8) ఇతర వివరములకు సంబంధిత బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించవలెను.

తేది: 11-11-2025, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governorpet, Vijayawada - 520002 (A.P.)

E-Procurement Short Tender Notice(Third Call)

NIT No. 29/PROC/MAU61-USIOUS(OTH)/35/2025-HB/3rd call — Dt.18.11.2025

Name of Work: Repairs and Annual Maintenance Contract to Blue Star IVRF-18TC and IVRF-12TC Air Condition System along with connected IDU's of Various capacities Installed at the CRDA Unit Office, Thulluru"-Estimate Value: Rs.10,00,000/-

The bid can be downloaded on AP e-procurement portal from **20.11.2025** to **28.11.2025** up to **14.00 Hrs.** Due date for submission of Bid **28.11.2025** up to **15.00 Hrs**, Technical bid opening **28.11.2025 @ 16.00Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA, Vijayawada

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate – A Government of India Undertaking
ప్రాంతీయ కార్యాలయం : విజయవాడ
రికవరీ సెక్షన్, గురునానక్ కాలనీ, విజయవాడ. ఫోన్: 0866-2468600

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీతలు : శ్రీమతి ఉడత్తు వెంకట పద్మ కమల కుమారి, శ్రీ ఉడత్తు వెంకట లక్ష్మీనాంచారయ్య మరియు శ్రీ ఉడత్తు విశ్వనాథ్ వెంకటేష్** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ.33,51,083/- (అక్షరాల ముప్పై మూడు లక్షల యాభై ఒక్క వేల ఎనభై మూడు రూపాయలు మాత్రమే)** బకాయి మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా కోరుతూ **తేది.09.09.2025 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ ఆస్తిని **19.11.2025 తేదీన స్వాధీనపరచుకున్నార**ని ఋణగ్రహీత మరియు ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత మరియు యావన్మంది ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్, విజయవాడ భారతీనగర్ బ్రాంచ్** వారికి చెల్లించవలిసిన బకాయి **తేది.24.10.2025 నాటికి రూ.34,04,950/- (అక్షరాల ముప్పై నాలుగు లక్షల నాలుగు వేల తొమ్మిది వందల యాభై రూపాయలు మాత్రమే)** + వడ్డీ మరియు కాస్ట్స్ కలిపి మొత్తమునకు లోబడి వుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:

ఎ-షెడ్యూల్ : కృష్ణా జిల్లా, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్, ఉయ్యూరు మండలం, ఉయ్యూరు శివారు గండిగుంట గ్రామ పంచాయితీ, ఉయ్యూరు, ఆర్.ఎస్ నెం.814/2, సమీప డోర్ నెం.4-46 నందు విస్తీర్ణం 2516.4 చ॥గ॥లులోని స్థలం. **హద్దులు : తూర్పు** : దండమూడి పూర్ణ చంద్ర రావు మరియు వల్లభనేని రామకృష్ణ ప్రసాద్ గార్ల ఆస్తి, **దక్షిణం** : కె. గోపాలరావు గారి ఆస్తి, **పడమర** : పంచాయితీ రోడ్డు, **ఉత్తరం** : వల్లభనేని రామకృష్ణ ప్రసాద్ గారి ఆస్తి.

ఈ నాలుగు హద్దుల యందు విస్తీర్ణం 2516.4 చ॥గ॥లు లేదా 2104.03 చ॥మీ॥లు స్థలంలోని 1/36 అవిభాజ్యమైన ఉమ్మడి వాటా 48.89 చ॥గ॥లు లేదా 40.87 చ॥మీ॥లులోని స్థలం.

బి-షెడ్యూల్ : పై ఎ-షెడ్యూల్ నందు మొత్తం స్థలంలోని నిర్మించబడిన శ్రీ వెంకట పద్మావతి నిలయం అను పేరు మరియు స్టైల్‌తో ఉన్న అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం.308 (డబుల్ బెడ్‌రూమ్). **హద్దులు : తూర్పు** : ఓపెన్ టు స్కై, **దక్షిణం** : ఓపెన్ టు స్కై, **పడమర** : కారిడార్, **ఉత్తరం** : ఓపెన్ టు స్కై.

ఈ నాలుగు హద్దుల యందు ఫ్లాట్ యొక్క ప్లింత్ ఏరియా 874 చ॥అ॥లు, కామన్ ఏరియా 190 చ॥అ॥లు మరియు కార్ పార్కింగ్ ఏరియా 115 చ॥అ॥లు మరియు అన్ని ఈజిమెంట్ హక్కులతో కలదు.

CERSAI SI ID : **400072722705** : **టైటిల్ హోల్డర్ : శ్రీమతి ఉడత్తు వెంకట పద్మ కమల కుమారి, భర్త : యు వి ఎల్ నాంచారయ్య**

తేది : 19.11.2025 — సం/- అధీకృత అధికారి
స్థలం : విజయవాడ — కెనరా బ్యాంక్

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనమైనది)
సిఐఎన్: L65110TN2014PLC097792
నమోదిత కార్యాలయం : కెఆర్ఎమ్ టవర్స్, 8వ అంతస్తు, హరింగ్టన్ రోడ్, చెట్‌పెట్, చెన్నై-600031.
టెలి: +91 44 4564 4000, ఫ్యాక్స్: +91 44 4564 4022.
IDFC FIRST Bank

అనుబంధం 4 (రూల్ 8(1))
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

స్థిరాస్తుల వివరణ

తేది: 14.11.2025
ప్రదేశం: ఆం.ప్ర.
రుణ ఖాతా నం. 61188904.
అధీకృత అధికారి, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనమైనది)

నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ nido HOME FINANCE
(గతంలో ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడింది)
నమోదిత కార్యాలయం : టవర్ 3, 5వ అంతస్తు, వింగ్ 'బి', కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్, కుర్లా (పశ్చిమం), ముంబై-400 070.
బృందావన్ కాలనీ, ప్లాట్ నం.2, బేగంపేట, హైదరాబాద్-500016.

సర్ఫేసీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

1. LAN.NO.: L075STLAP000005336152 & L0750STHL000005336151
2. LAN.NO.: LVIJSTH0000096703

తేది: 20.11.2025
సం/- అధీకృత అధికారి, నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడింది)

తోటపల్లిలో సెయిలింగ్ యూనిట్!

ప్రజాశక్తి- గరుగుబిల్లి (పార్వతీపురం మన్యం జిల్లా)

ప్రభుత్వ సహకారంతో తోటపల్లి ప్రాంతంలో సెయిలింగ్ యూనిట్ నడిపే ఉద్దేశం ఉన్నట్లు ఆస్ట్రేలియాకు చెందిన ఇంటర్నేషనల్ హంస సెయిలింగ్ బోట్స్ వ్యవస్థాపకులు క్రిస్ మిచెల్ తెలిపారు. జిల్లాలోని జంఝావతి, తోటపల్లి ప్రాజెక్టులను బుధవారం ఆయన సందర్శించారు. సెయిలింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతంలోని చిన్నారులకు శిక్షణ ఇచ్చే ఆలోచన ఉన్నట్లు సెయిలింగ్ ఇంటర్నేషనల్ రేస్ అధికారి తిమిటి శ్రీకాంత్ చతుర్వేది తెలిపారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నరేష్ కుమార్ ఎంపిక

ప్రజాశక్తి- పెనుకొండ టౌన్

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జిసి నరేష్ కుమార్ ఎంపికయ్యారు. రొద్దం మండలం కంచి సముద్రం ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటిగా ఆయన పని చేస్తున్నారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఎంప్లాయిస్ అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం, వంద మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. బీహర్‌లోని పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్ర రెడ్డి ఎం. సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో కూడా ప్రథమ శ్రేణిలో రాణించి రాష్ట్రానికి, యుటిఎఫ్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాక్షించారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి

120 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- చింతూరు (అల్లూరి జిల్లా)

ఒడిశా నుండి మన రాష్ట్రానికి బొలెరో వాహనంలో తవుడు బస్తాల కింద పెట్టి అక్రమంగా తరలిస్తున్న 120 కిలోల గంజాయిని పోలీసులు బుధవారం సాయంత్రం అల్లూరి జిల్లా ఎర్రంపేటలోని ఒడిశా (మోటు) రోడ్ జంక్షన్లో స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని, బొలెరో వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించి బొలెరో వాహనంలో గంజాయిని స్వాధీనం చేసుకొని బిశ్వజిత్ మండల్, సుధీప్ హల్దార్, మల్కనగిరి జిల్లాలోని 71 క్యాంపునకు చెందినవారని పోలీసులు అరెస్ట్ చేశారు. గంజాయి విలువ సుమారు ఆరు లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం (శ్రీకాకుళం): ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 20.70 కేజీల గంజాయిని పట్టుకున్నామని సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఒడిశా రాష్ట్రం మోహన బ్లాక్ బాపూజీ నగర్ వీధికి చెందిన అమిలైసా పాణి గంజాయిని కొనుగోలు చేసి ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు వస్తున్నారని తెలిపారు. సమీపంలోని మట్టి రోడ్డు వద్ద టౌన్ ఎస్ఐ ముకుందరావు తనిఖీ చేయగా... గంజాయి పట్టుబడిందన్నారు. ఒడిశాలోని కొనుగోలు చేసి గంజాయి వ్యాపారం చేసే బీరజ్ ఎలియాస్ దరమ్ బీర్ నాయక్‌తో కలసి ముంబయిలో అమ్మేందుకు వెళ్తున్నట్టు వెల్లడించారు. నిందితుడుని అరెస్టు చేసి సెల్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

దళితులపై కొనసాగుతున్న వివక్ష

- కేసుల నమోదు, ఛార్జిషీట్, నష్టపరిహారం చెల్లింపుల్లో తీవ్ర జాప్యం
- నేడు జిల్లాకు రానున్న ఎస్‌సి కమిషన్ చైర్మన్

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి, కంటోన్మెంట్

విజయనగరం జిల్లాలో దళితులపై సామాజిక వివక్ష కొనసాగుతోంది. చాలా సందర్భాల్లో కేసులు నమోదు మొదలుకుని, ఛార్జిషీట్లు వేయడం, అట్రాసిటీ కేసుల్లోని బాధితులకు నష్టపరిహారం చెల్లింపు తదితర విషయాల్లో పోలీసుల వద్ద తీవ్ర జాప్యం కూడా జరుగుతోంది. ఇదే విషయాన్ని కమిషన్ ముందుపెట్టేందుకు దళితులు, దళిత సంఘాల నాయకులు చాలాకాలంగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌సి కమిషన్ చైర్మన్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. పలు గ్రామాల్లో అంటరానితనం, కులవివక్ష ఉండడంతో పాటు చాలాకాలం క్రితమే అత్యధిక అత్యాచారాలు జరిగిన జిల్లాగా విజయనగరాన్ని గుర్తించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ వీటిని రూపుమాపడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. జిల్లాలో చాలామంది రైతులు భూ సమస్య ఎదుర్కొంటున్నారు. వైఎస్‌ఆర్ ప్రభుత్వం తర్వాత అసైన్‌మెంట్ భూముల పంపిణీ జిల్లాలో జరగలేదు. 20 ఏళ్ల క్రితం ఇచ్చిన భూములను గత ప్రభుత్వం రెగ్యులైజేషన్ చేస్తామనే పేరుతో విక్రయించినవారి భూములను మాత్రమే ఫ్రీహోల్డ్ చేసింది. ఆ మేరకు దళితులు భూములు కోల్పోయారు. ఈ ఏడాది మెంటాడ మండలం పెదమేడపల్లిలో భూ వివాదం కారణంగా ఓ దళితుడు హత్యకు గురయ్యారు. కేసు నమోదు చేసినా ప్రస్తుతం అది నీరుగారుతోందని కులవివక్ష వ్యతిరేక పోరాటం సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డి-పట్టాలు రద్దు చేయడంలో మెంటాడకు చెందిన 60 మంది, జక్కువలో 30 మంది దళిత కుటుంబాల వారికి అన్నదాతా సుఖీభవ పథకం వర్తించలేదు. దీనిపై అధికారులు అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేదనే సాకు చెబుతున్నారు. జిల్లాలో ఎన్నో సమస్యలు దళితులను వెంటాడుతున్నాయి. డప్పు కళాకారులు డప్పులు, గజ్జల కోసం దశాబ్దాల తరబడి ఎదురు చూస్తున్నారు. పింఛన్లు కూడా మంజూరు కావడం లేదు. చాలా ఎస్‌సి కాలనీల్లో సబ్-ప్లాన్ నిధులు ఉపయోగించడం లేదు. బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే స్వగ్రామం పిరిడిలో నేటికీ రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతోందని దళిత సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. బొండపల్లి మండలం బి.రాజేరులో స్మశానవాటికకు దారిలేకుండా ఆటంకపరుస్తున్నారంటూ స్థానిక దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల్లిమర్ల మండలం సతివాడలోని దళితవాడలో ఈ ఏడాది ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాన్ని ఊరేగించేందుకు పెత్తందారులు నిరాకరించారు. దీంతో, దళితులు ఇతర సామాజిక తరగతుల మధ్య వాగ్వివాదం, పెనుగులాట చోటుచేసుకుంది. చివరకు దళితులకు తెలియకుండానే వారి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు నిమజ్జనం చేసేశారు. ఈ విషయంలో కేసు నమోదు, విచారణలో పోలీసులు తీవ్ర జాప్యం ప్రదర్శించారని బాధితులు, దళిత సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ఎవరు నిమజ్జనం చేశారన్నది ఇప్పటికీ పోలీసులు తేల్చలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరిగినా స్థానిక ఆర్‌డిఒ ఆ గ్రామాన్ని సందర్శించలేదు. ఇదే మండలం మల్యాడలో గతంలో చేతిబోరు వద్ద అంటరానితనం బయట పడింది. గడిచిన మూడు నెలల్లో 20 అట్రాసిటీ కేసులు నమోదు కాగా, ఇప్పటికీ 19 కేసులు విచారణ దశలోనే ఉన్నట్టు సమాచారం. కుల ధ్రువీకరణ పత్రాలు, మెడికల్ సర్టిఫికెట్లు లేవనే సాకుతో కాలయాపన చేస్తున్నారని దళితులు ఆరోపిస్తున్నారు. అట్రాసిటీ కేసులు నమోదు సమయంలో బాధితులకు ఏడు రోజుల్లో నష్టపరిహారం అందించాల్సి ఉన్నప్పటికీ జాప్యం జరుగుతోందని దళిత సంఘాలు అంటున్నాయి. పోలీసుల విచారణ, లేదా కోర్టులకు హాజరు వంటి సందర్భాల్లో బాధితులతోపాటు వారి తరఫున వచ్చేవారికి టిఎ, డిఎ ఇచ్చే నిబంధన ఉందని, దాన్ని కూడా చెల్లించడం లేదని చెబుతున్నారు.

చైర్మన్ పర్యటన ఇలా..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మను కెఎస్.జవహర్ ఆధ్వర్యంలో కమిటీ గురువారం జిల్లాలో పర్యటించనున్నదని కలెక్టర్ ఎస్ రామసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లా పరిషత్ గెస్ట్ హస్‌లో షెడ్యూల్డ్ కుల సంఘాల ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లా అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం ఐదు గంటల నుండి ఆరు వరకు జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్‌లో ఎస్‌సి నాయకులను కలసి వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

మావోయిస్టులకు 14 రోజులు రిమాండ్

ప్రజాశక్తి- ఏలూరు స్పోర్ట్స్

పోలీసులు మంగళవారం మధ్యాహ్నం ఏలూరు గ్రీన్ సిటీలో అదుపులోకి తీసుకున్న 15 మంది మావోయిస్టులను బుధవారం సాయంత్రం కోర్టులో హాజరుపర్చారు. వారికి న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో, వారిని అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఏలూరు నగరంలోని గ్రీన్ సిటీలో గత పది రోజులుగా నివాసం ఉంటున్న మావోయిస్టులను జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివ కిషోర్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బలగాలు, గ్రేహౌండ్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. వారిని నగరంలోని రహస్య ప్రాంతానికి తరలించి విచారించారు. బుధవారం ఉదయం విజయవాడలో ఉన్నతాధికారుల ఎదుట హాజరుపర్చి అనంతరం జిల్లా ఎస్‌పి కార్యాలయం సమీపంలో ఉన్న మహిళా పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ప్రభుత్వ వైద్యులను అక్కడికే రప్పించి వారందరికీ వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం మొబైల్ కోర్టులో హాజరు పర్చారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో అంతా ఛత్తీస్‌గఢ్‌లోని సుఖ్మా, భీజాపూర్ జిల్లాలకు చెందినవారు. వీరంతా హిడ్మా దళంలో కీలక నేతలుగా ఉన్నట్లు గుర్తించారు. సోడె లచ్చు అలియాస్ గోపాల్, సోడె లక్ష్మీ అలియాస్ భీషు, గంగి లక్ష్మి అలియాస్ మాదే, వెట్టి వెంకట్, పుడకం పగ, కాశ్యప్ భీషు అలియాస్ యోగేష్, పొడియం ఆనంద్ అలియాస్ దస్సు, పుడకం లక్ష్మణ్ అలియాస్ కోసా, కుంజుం బుజ్జి, తాటి కమల, దూడి ఆదపు అలియాస్ మల్లేష్, మాదవి జోగ, మాధవి సునీత, కుంజం నందిని, బదిన రాజును ఏలూరు జిల్లా పోలీసులు కోర్టుకు హాజరుపర్చారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు ఇవే..

మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలు, నగదుసు ఏలూరు జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు రివాల్వర్లు, ఒక డబుల్ బ్యారెల్ బోర్ గన్, 11 కంట్రీమేడ్ సింగిల్ బ్యారెల్ గన్‌లు, ఒక తపంచా, 132 రౌండ్ల బుల్లెట్లు, రూ.2.80 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఏలూరు జిల్లాలో మావోయిస్టు కార్యకలాపాలపై నిఘా ఉంచామని తెలిపారు. ఏలూరు గ్రీన్ సిటీలోని ఓ ఇంట్లో 15 మంది మావోయిస్టులు ఉంటున్నట్లు పక్కా సమాచారంతో అదుపులోకి తీసుకున్నామన్నారు. ఏలూరులో పట్టుబడిన వారిలో మావోయిస్టు కీలక నేతలు ఉన్నారని, హిడ్మాతో కలిసి అనేక దాడుల్లో పాల్గొన్నారని తెలిపారు. ఇంటిని అద్దెకు ఇచ్చిన వారిని విచారించామని చెప్పారు. అద్దెకు ఇల్లు ఇచ్చే వారు ఆధార్, పూర్తి వివరాలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

హాస్టల్లో అపరిశుభ్రతపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి- పాచిపెంట (పార్వతీపురం మన్యం జిల్లా)

పి.కోనవలసలోని గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం అపరిశుభ్రతగా ఉండడం పట్ల ప్రిన్సిపల్‌పై జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆయన ఈ వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని వంటగదిలో నెలకొన్న అపరిశుభ్రతపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు నివసించే ప్రాంతాలు, వంటశాల, మరుగుదొడ్లు, పరిసరాలు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. ఇకపై ఇటువంటి వాతావరణం కనిపిస్తే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్. వైశాలి తదితరులు పాల్గొన్నారు.

అక్కడ జైకొట్టి... ఇక్కడ సన్నాయి నొక్కులు

- ప్రజాభిప్రాయం లేకుండా అనుమతి మంజూరు
- ఏకపక్షంగా హైడ్రో పవర్ ప్రాజెక్టుకు మంత్రి మండలి ఆమోదం
- ప్రజల అభ్యంతరాలు గౌరవిస్తామంటూ మంత్రి ద్వంద్వ వైఖరి



మంత్రి సంధ్యారాణిని కలిసిన టిడిపి నాయకులు, రైతులు

ప్రజాశక్తి- పార్వతీపురం

ప్రశాంతంగా ఉన్న దుగ్గేరు ఏజెన్సీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుతో రాష్ట్ర ప్రభుత్వం అలజడి సృష్టించింది. ప్రజాభిప్రాయం తీసుకోకుండానే అనుమతి మంజూరు చేసింది. కొద్ది రోజుల క్రితం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఏకపక్షంగా పవర్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. దీంతో, ఈ ప్రాంత గిరిజనుల్లో ఆందోళన మొదలైంది. చిన్న, సన్నకారు గిరిజన రైతులుండే ఈ ప్రాంతంలో రెండు వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు వేలాది ఎకరాల భూములు సేకరించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆందోళన చెందుతున్న గిరిజనులు, రైతులను మరింత మభ్యపెట్టేందుకు జిల్లా మంత్రి చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలో నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. 1,500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు పాచిపెంట మండలంలోని సరిహద్దు గ్రామాల్లోనూ భూసేకరణకు హద్దు రాళ్లు వేశారు. పాచిపెంట మండలంలో అనంతగిరి మండలం సరిహద్దు ప్రాంతంలోని గ్రామాల భూములు కోల్పోయే అవకాశం ఉంది. దీనిని వ్యతిరేకిస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు పెద్ద ఎత్తున పోరాడుతున్నారు. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మక్కువ మండలంలోని దుగ్గేరు ప్రాంతంలో రెండు వేల మెగావాట్ల పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయడం వివాదాస్పదమైంది. మెస్సర్స్ చింతా గ్రీన్ ఎనర్జీ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి మంజూరు చేస్తూ జిఒ 84ని జారీ చేసింది. ఇప్పటికే ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధమయ్యారు. సమీపంలోని వెంగళరాయ సాగర్ రిజర్వాయర్, తోటపల్లి రిజర్వాయర్ నుంచి 24 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు సరఫరాకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రిజర్వాయర్ల ద్వారా వాటి పరిధిలోని ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందని పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ రెండు ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టు రైతులను, పవర్ ప్రాజెక్టు ఏర్పాటుతో నిరాశ్రయులయ్యే గిరిజన రైతులను ప్రభుత్వం ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దుగ్గేరు ప్రాంతంలో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటును వ్యతిరేకిస్తూ బుధవారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని టిడిపి మండల అధ్యక్షులు గుల్ల వేణుగోపాల్ నాయుడు ఆధ్వర్యాన నాయకులు, రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలను గౌరవిస్తామని ఆమె సన్నాయి నొక్కులు నొక్కడం చర్చనీయాంశమైంది. గతంలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ఏకపక్షంగా ఆమోదం తెలిపి ఇప్పుడేమో ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తామని చెప్పడం మంత్రి ద్వంద్వ వైఖరికి నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నాయి. హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడుతున్న గిరిజన సంఘాల అభిప్రాయాలనుగాని, ఈ ప్రాంత గిరిజనుల, రైతుల అభిప్రాయాలనుగాని ఇంతవరకూ ప్రభుత్వం తీసుకోలేదు.

మంత్రి ద్వంద్వ వైఖరి మానుకోవాలి

రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి భాగస్వామి. గత నెల పదిన జరిగిన మంత్రివర్గ సమావేశంలో దుగ్గేరు ప్రాంతంలో రెండు వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు మంజూరుకు ముందు ప్రజల అభిప్రాయాలను ఎందుకు తీసుకోలేదు? దుగ్గేరు ప్రాంత ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పవర్ ప్రాజెక్టును అడ్డుకుంటామని మంత్రి సంధ్యారాణి స్పష్టంగా చెప్పాలి. అంతేకానీ, సన్నాయి నొక్కులు నొక్కడం సరైన విధానం కాదు.

- కొల్లి గంగు నాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి

తగ్గిన మద్యం ఆదాయం

- అక్టోబర్‌లో 56 శాతం మైనస్
- గతేడాది కన్నా కూడా తక్కువే
- మొత్తం ఆదాయానికీ గండమే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఖజానాకు మద్యం ద్వారా వచ్చే ఆదాయం తగ్గుతోంది. ఈ ఏడాది మద్యం ఆదాయం అక్టోబర్‌లో 56 శాతం తగ్గినట్లు తేలింది. గత ఏడాది అక్టోబర్‌లో రు.4,409 కోట్లు రాగా, ఈ అక్టోబర్‌లో కేవలం రు. 1,956 కోట్లు మాత్రమే రావడం గమనార్హం. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ఏడు నెలల్లో రు. 16,288 కోట్లు రాగా, ఈ ఏడాది అదే ఏడు నెలల్లో రు. 15,275 కోట్లు ఖజనాకు చేరాయి. అంటే, అంటే ఆరు శాతం తక్కువగా వచ్చినట్లు తేలింది. ఇలా భారీగా ఆదాయం తగ్గడానికి గల కారణాలను కూడా అధికారులు విశ్లేషిస్తున్నారు. ఇక మొత్తం ఆదాయం కూడా ఆందోళన కలిగించేదిగానే కనిపిస్తోంది. గతేడాది అక్టోబర్ వరకు రు. 57,528 కోట్లు రాగా, ఈ ఏడాది అక్టోబర్ వరకు కేవలం మూడు శాతం వృద్ధితో రు. 57,392 కోట్లు వచ్చింది. అయితే ఒక్క అక్టోబర్ నెల గణాంకాలు పరిశీలిస్తే 20 శాతం తక్కువగా వచ్చినట్లు తేలింది. గత ఏడాది అక్టోబర్‌లో రు. 10,235 కోట్లు రాగా, ఈ ఏడాది అక్టోబర్‌లో రు. 8,203 కోట్లు మాత్రమే రావడం విశేషం. మిగిలిన ఆదాయ విభాగాలను పరిశీలిస్తే వాణిజ్య పన్నుల విభాగంలో గతేడాది కన్నా కేవలం నాలుగు శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. వాహనాల పన్నుద్వారా కూడా నాలుగు శాతమే వృద్ధి కనిపించింది. అటవీశాఖ ఆదాయంలో 22 శాతం మైనస్ వృద్ధి నెలకొనగా, ఇతర పన్నుల్లో 44 శాతం, పన్నేతర ఆదాయంలో 14 శాతం మైనస్ వృద్ధి నమోదైంది. అయితే గనుల శాఖలో 39 శాతం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లలో 32 శాతం అధిక వృద్ధి నమోదు కావడం కొంతవరకు ఊరటనిస్తోంది. అయితే ఈ రెండు విభాగాల్లో వృద్ధి ఎక్కువగా ఉన్నప్పటికీ మొత్తం ఆదాయం చెప్పుకోదగ్గదిగా లేకపోవడం, చిన్న మొత్తం మాత్రమే కావడంతో ఆర్థికశాఖ కూడా పెద్దగా పట్టించుకోవడంలేదు.

పలు విభాగాల్లో ఆదాయ వివరాలు (రూ. కోట్లలో)

విభాగం	2024-25 అక్టోబర్‌వరకు	2025-26 అక్టోబర్‌వరకు	వృద్ధి
వాణిజ్య పన్నులు	28,819	29,947	4
ఎక్సయిజ్	16,288	15,275	-6
రిజిస్ట్రేషన్లు	4,724	6,227	32
గనులు	1,242	1,730	39
అటవీ	22	17	-22
ఇతర పన్నులు	356	201	-44
పన్నేతర	1,370	1,177	-14

విహార యాత్రలో విషాదం

ప్రజాశక్తి- మోతుగూడెం (అల్లూరి జిల్లా)

చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోర్‌బై గ్రామం వద్ద పవర్ కెనాల్‌లో ప్రమాదవశాత్తూ పడి పర్యాటకుడు గల్లంతు అయ్యారు. స్థానికుల కథనం ప్రకారం... ఎలమంచిలి గ్రామానికి చెందిన గనిశెట్టి జగదీష్ (26) స్థానికంగా మెకానిక్‌గా పని చేస్తున్నారు. ఆయన తన స్నేహితులు ఆరుగురుతో కలిసి విహారయాత్రకు వచ్చారు. ప్రమాదవశాత్తు పవర్ కెనాల్‌లో పడి గల్లంతయ్యాడు. మోతుగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం కోసం గాలిస్తున్నారు.

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' అమల్జేయాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు కౌలు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని టిడిపి హామి ఇచ్చిందన్నారు. కానీ ఇప్పటి వరకు నూతన కౌలు చట్టం తేలేదన్నారు. కనీసం అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు అమలు చేసి రూ.20 వేల సాయం అందించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపు

అన్నదాత సుఖీభవ పథకంలో కూటమి ప్రభుత్వం కౌలు రైతులను మోసం చేసిందంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కౌలు రైతులకు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం పిలుపునిచ్చింది. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని 2వ పర్యాయం నిధుల విడుదల సమయంలోనూ వర్తింపజేయకపోవడం దారుణమని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలివిడత నిధుల విడుదల సమయంలో కౌలు రైతులకు అక్టోబరులో రెండో విడత నిధులు విడుదల చేసే సమయంలో అందిస్తామని హామీ ఇచ్చి, నిధులు విడుదల చేయకుండా మోసం చేశారన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు చొప్పున ఇస్తామని ప్రకటించిన ఈ ప్రభుత్వం ఇప్పటి వరకూ ఒక్క కౌలు రైతుకూ ఈ పథకాన్ని వర్తింపజేయలేదన్నారు. కొత్త కౌలు చట్టాలను తెస్తున్నామని అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి చట్టం తీసుకురాలేకపోవడం తమ చేతకాని తనంగా ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ తదితరులు

'పోసా' చట్టం పకడ్బందీగా అమలు

- లైంగిక వేధింపుల నిరోధం అందరి బాధ్యత
- చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోసా యాక్టు - 2013) పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. లైంగిక వేధింపులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆచరించే విధానంపై డాక్టర్ బిఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన శ్రీకాకుళంలోని బిఆర్ అంబేద్కర్ కళా వేదికలో బుధవారం నిర్వహించిన వర్క్‌షాపు, అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు పని ప్రాంతాల్లో లైంగిక వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. సంఘటిత రంగాల్లోనే ఈ వేధింపులు ఎక్కువగా ఉంటున్నాయన్నారు. లైంగిక వేధింపులు, గృహ హింసకు సంబంధించిన ఫిర్యాదులు మహిళా కమిషన్‌కు ఎక్కువగా వస్తున్నాయన్నారు. కార్యాలయాలు, సంస్థల్లో వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు స్థానిక కమిటీలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. 2013లో వచ్చిన లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై ఉద్యోగులకూ సరైన అవగాహన లేదన్నారు. అందరూ బాధ్యత తీసుకొని లైంగిక వేధింపులను అరికట్టడానికి సహకరించాలని కోరారు. లైంగిక వేధింపులపై ఫిర్యాదులకు స్థానిక కమిటీలు లేకపోవడంతో విద్యార్థులు కమిషన్ వద్దకు రావాల్సి వస్తోందన్నారు. చట్టాలపై మహిళలకు అవగాహన ఉన్నప్పుడే లైంగిక వేధింపులు తగ్గుతాయన్నారు. ఎక్కువ మంది మహిళలు పనిచేసే చోట స్థానిక ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటయ్యే విధంగా కలెక్టర్‌తో మాట్లాడతానని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కెఆర్ రజిని, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ దినేష్ కుమార్, మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నారీమణి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (భీమునిపట్నం) ప్రిన్సిపల్ పి.సురేఖ, లోకల్ కంప్లైంట్ కమిటీ సభ్యులు లక్ష్మీకుమారి, మహిళా కమిషన్ సలహాదారులు రావూరి సూయిజ్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఐ.విమల, బెజ్జిపురం మనోవికాస కేంద్రం అధ్యక్షులు ప్రసాదరావు అంబేద్కర్ యూనివర్సిటీ సోషల్ వర్కు అసిస్టెంట్ ప్రొఫెసర్ యు.కావ్యజ్యోత్స్న పాల్గొన్నారు.

ఐద్వా వినతి

అనకాపల్లి జిల్లా చోడవరం మండలం బుచ్చయ్యపేటలో భార్యను అదనపు కట్నం కోసం వేధిస్తూ తల్లీబిడ్డల బలవన్మరణానికి కారణమైన పోరెడ్డి ఉమామహేశ్వరరావుకు బెయిల్ మంజూరు చేయకుండా కఠినంగా శిక్షించాలని కోరుతూ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు ఐద్వా శ్రీకాకుళం నగర కార్యదర్శి టి.ప్రవీణ, నగర కమిటీ సభ్యులు మధురగుంట లక్ష్మి వినతిపత్రం అందజేశారు.

మాట్లాడుతున్న వ్యకాస నేత రామకృష్ణ

సీడ్ ఆర్గనైజర్‌పై చర్యలు తీసుకోవాలి

- హనుమాల్‌గూడెంలో మొక్కజొన్న విత్తన రైతుల రిలే దీక్షలు

ప్రజాశక్తి- ద్వారకాతిరుమల

మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్ నుంచి డబ్బులు వెంటనే ఇప్పించాలని, మోసగించిన సీడ్ ఆర్గనైజర్ చిలక అప్పారావుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో పంగిడిగూడెం శివారు హనుమాల్ గూడెంలో సీడ్ ఆర్గనైజర్ ఇంటి ముందు బాధిత మొక్కజొన్న రైతులు బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, మండల కార్యదర్శి గుర్రం రాంబాబు మాట్లాడుతూ మండలంలోని పంగిడిగూడెం శివారు హనుమాల్ గూడెంలో మొక్కజొన్న రైతులు సీడ్ ఆర్గనైజర్ చిలక అప్పారావు చేతిలో మోసపోయారని, వారికి న్యాయం చేయాలని కోరారు. గతంలో పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయగా తహశీల్దార్, మండల వ్యవసాయాధికారి పలు దఫాలుగా ఆర్గనైజర్లు పిలిపించి మాట్లాడగా రైతులకు సీడ్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చినా తప్పించుకుని తిరుగుతున్నారని తెలిపారు. అధికారుల సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం ఖాళీ బ్యాంకు చెక్కులు ఇచ్చారని, అవి కూడా బ్యాంకులో చెక్ బౌన్స్ అయ్యాయని అన్నారు. మోసపోయిన మొక్కజొన్న విత్తన రైతులకు దాదాపు రూ.15 లక్షలకుపైగా సొమ్ము ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రస్తుతం అధికారులు సైతం తాము ఏమీ చేయలేం పోలీస్ కేసు పెట్టుకోండని సలహా ఇచ్చి చేతులు దులుపుకునే పరిస్థితి ఏర్పడడంతో రైతులు దీక్షలు చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం కంపెనీలకు అనుకూలంగా ఉంటూ చట్టాలు చేస్తోంది తప్ప రైతులకు అనుకూలంగా నిర్ణయాలు చేయకపోవడం విచారకరమన్నారు. తక్షణం సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మోసపోయిన మొక్కజొన్న విత్తన రైతులు వీరవల్లి శివ నాగరాజు, వీరవల్లి మోహనరావు, వీరవల్లి వీర వెంకట్రావు, గుర్రం పాపారావు పాల్గొన్నారు.

26న రైతన్నల దేశవ్యాప్త పోరు

- ఎస్‌కెఎస్ పిలుపు
- గత 11 ఏళ్లలో కార్పొరేట్లకు రూ.16.41 లక్షల కోట్ల రుణ మాఫీ
- రైతులకు ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ సరిహద్దుల్లో చారిత్రాత్మక రైతు పోరాటం ప్రారంభమై ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 26న దేశవ్యాప్తంగా సామూహిక నిరసన ప్రదర్శనలు చేపట్టాలని ఎస్‌కెఎం నేతలు పిలుపునిచ్చారు. బుధవారం నాడిక్కడ వర్చువల్‌గా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌కెఎం నేతలు రాకేష్ టికాయిత్, అశోక్ ధావలే, బల్బీర్ సింగ్ రాజేవాల్, రాజన్ క్షీరసాగర్, వడ్డే శోభనాద్రీశ్వరరావు, సునీలం, సత్యవాన్, ప్రేమ్ సింగ్ గెహ్లావత్, కన్వర్జిత్ సింగ్, ఇంద్రజిత్ సింగ్, సుఫల్ కుమార్ మహతో, రమేష్ మహాపాత్ర, పి.కృష్ణప్రసాద్ తదితరులు మాట్లాడారు. నవంబర్ 26న అన్ని రాష్ట్రాల్లోనూ, జిల్లాల్లోనూ రైతులు, కార్మికులు సమూహిక నిరసన ప్రదర్శనలు చేపట్టాలని పిలుపు ఇచ్చారు. 380 రోజుల సుదీర్ఘ పోరాటంతో దిగొచ్చిన బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక వ్యవసాయ చట్టాలను రద్దు చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఈ పోరాటంలో 736 మంది అమరవీరులు ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. అయితే ఐదేళ్లు గడిచినప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక కమిటీతో చేతులు దులుపుకున్నారని విమర్శించారు. 2021 డిసెంబర్ 9న ఎస్‌కెఎంకి ఇచ్చిన సి2+50శాతంతో కూడిన ఎంఎస్‌పి, రుణ ఉపశమనం, విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లు ఉపసంహరణపై లిఖితపూర్వక హామీలను ఇంకా అమలు చేయలేదని దుయ్యబట్టారు. మోడీ ప్రభుత్వం గత 11 ఏళ్లలో కార్పొరేట్లకు రూ.16.41 లక్షల కోట్ల రుణాన్ని మాఫీ చేసిందని, కానీ రైతులకు ఒక్క రూపాయి కూడా రుణ మాఫీ చేయలేదని విమర్శించారు. తమ డిమాండ్ల సాధన కోసం రైతులు, కార్మికులు క్షేత్రస్థాయి వరకు ఐక్యతతో పోరాడాలని పిలుపు ఇచ్చారు.

ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రం

- చర్యలకు సుప్రీం ఆదేశం
- స్పోర్ట్స్ వాయిదా వేయాలన్న ధర్మాసనం

న్యూఢిల్లీ : ఢిల్లీ, దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)లో వాయు కాలుష్యం సమస్య తీవ్రమైంది. శీతాకాలం కావడంతో పరిస్థితి మరింత దిగజారింది. ఈ నేపథ్యంలో తక్షణ చర్యలు తీసుకోవడానికి వాయునాణ్యత నిర్వహణ కమిషన్ (సిఎక్యూఎం)కు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. అలాగే, పాఠశాలల స్పోర్ట్స్, అథ్లెటిక్స్ కార్యక్రమాలను వాయిదా వేయడాన్ని పరిశీలించాలని సిఎక్యూఎంకు సుప్రీంకోర్టు సూచించింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో వాయు కాలుష్యంపై దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రధానన్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. నవంబరు, డిసెంబరు నెలల్లో అండర్-16, అండర్-14 విద్యార్థులకు ఇంటర్ జోనల్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఢిల్లీ ప్రభుత్వం సిద్ధమైనట్లు సీనియర్ న్యాయవాది, అమికస్ క్యూరీ అపరాజిత సింగ్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. కాలుష్యం గరిష్ఠ స్థాయిలో ఉండే ఈ నెలల్లో ఇటువంటి ఈవెంట్స్‌కు అనుమతించడం.. స్కూల్ పిల్లలను గ్యాస్ ఛాంబర్‌లో ఉంచడంతో సమానమేనని వాదించారు. ఈ సమయంలో బహిరంగ క్రీడా కార్యకలాపాలు నిర్వహించడం వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చని తెలిపారు.

ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. వాయు కాలుష్యం తక్కువగా ఉండే నెలల్లో క్రీడాపోటీలు నిర్వహించేలా స్కూళ్లను ఆదేశించాలని సిఎక్యూఎంకు సూచించింది. కాగా, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో వాయు కాలుష్యం మరింత పెరగకుండా నిరోధించేందుకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఈ సంస్థను ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

పుతిన్‌తో జై శంకర్ భేటీ

మాస్కో : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది చివరిలో భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉన్నతస్థాయిలో ముమ్మర చర్చలు, సంప్రదింపుల క్రమం కొనసాగుతోంది. మాస్కోలో విదేశాంగ మంత్రి జై శంకర్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యారు. షాంఘై సహకార సదస్సు (ఎస్‌సిఓ) సభ్య దేశాల ప్రభుత్వాధినేతల మండలి 24వ సమావేశం నేపథ్యంలో వీరి భేటీ జరిగింది. భారత్, రష్యాల మధ్య సహకారానికి సంబంధించిన వివిధ అంశాలను ఇరువురు చర్చించారు. మరోవైపు ప్రధాని మోడీ మంగళవారం రష్యా సముద్ర జలాల బోర్డు చైర్మన్ నికొలాయ్ పత్రుషెవ్‌తో భేటీ అయి డిసెంబరులో పుతిన్‌తో జరిగే వార్షిక సదస్సు వివరాలను చర్చించారు. ఇప్పటికే ఇరు దేశాల మధ్య వున్న కార్యాచరణను మరింత బలోపేతం చేసుకునేందుకు ఉభయ పక్షాలు ఆసక్తిని కనబరిచాయని ఢిల్లీలోని రష్యా ఎంబసీ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటన పేర్కొంది.

సిడ్నీ రోడ్డు ప్రమాదంలో భారత గర్భిణి మృతి

సిడ్నీ : ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు దాటుతుండగా అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో భారత్‌కు చెందిన ఓ మహిళ మతి చెందారు. మతురాలు 8 నెలల గర్భిణి కావడం మరింత విషాదకరం. గత వారాంతంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

భారత్‌కు చెందిన 33 ఏళ్ల సమన్విత ధారేశ్వర్ కుటుంబం హార్న్స్‌బై ప్రాంతంలో నివాసముంటోంది. 8 నెలల గర్భిణి అయిన సమన్విత తన భర్త, మూడేళ్ల కుమారుడితో కలిసి సమీపంలోని పార్క్ వద్దకు వాకింగ్‌కు వెళ్లారు. ఈ క్రమంలోనే ఫుట్‌క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా.. వేగంగా వచ్చిన బీఎండబ్ల్యూ కారు ఆమెను బలంగా ఢీకొట్టింది.

ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన సమన్వితను హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గర్భస్థ శిశువు ప్రాణాలు కూడా దక్కలేదని తెలిపారు. మరికొన్ని వారాల్లో డెలివరీ కావాల్సిఉండగా.. ఈ లోగా రోడ్డు ప్రమాదంలో మతి చెందడంతో సమన్విత భర్త కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదానికి కారణమైన బీఎండబ్ల్యూ కారును నడిపింది 19 ఏళ్ల ఆరోన్ పపాజోగ్లుగా గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. మతురాలు సమన్విత స్థానికంగా ఉన్న సాఫ్ట్‌వేర్ కంపెనీలో టెస్ట్ అనలిస్ట్‌గా పనిచేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

లెబనాన్‌పై ఇజ్రాయిల్ వైమానిక దాడి

- ఒకరు మృతి, 11మందికి గాయాలు

బీరుట్ : దక్షిణ లెబనాన్‌లో బుధవారం ఇజ్రాయిల్ వైమానిక దాడికి పాల్పడింది. ఈ దాడిలో ఒకరు మరణించగా, 11మంది గాయపడ్డారు. ఆ ప్రాంతమంతా రక్తపు మరకలతో భయానకంగా మారింది. అనేక కార్లు దగ్ధమయ్యాయి. ఎగిరి విరిగిపడిన గ్లాస్ కిటికీలు ఇతరత్రా శిథిలాలు చుట్టుపక్కలా పడ్డాయి. సమీప బస్సులో కూర్చున్న విద్యార్థులు కూడా గాయపడిన వారిలో వున్నారని ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. దక్షిణ లెబనాన్‌లోని ఇన్ ఎల్ హిల్వేహ్ పాలస్తీనా శరణార్థ శిబిరంపై మంగళవారం రాత్రి ఇజ్రాయిల్ డ్రోన్‌లతో దాడి చేసిన ఘటనలో 13మంది మరణించగా, అనేకమంది గాయపడ్డారు. అది జరిగిన కొద్ది గంటల వ్యవధిలోనే తిరి గ్రామంపై బుధవారం దాడి జరిగింది. ఏడాది క్రితం ఇజ్రాయిల్-హిజ్బుల్లా మధ్య కాల్పుల విరమణ జరిగిన తర్వాత ఇంత పెద్ద దాడి జరిగి, ఇంతమంది మరణించడం ఇదే.

బుధవారం దాడి సమయంలో సమీపం నుండే బస్సు వెళుతుండడంతో అందులోని విద్యార్థులు కూడా గాయపడ్డారని ప్రభుత్వ మీడియా వర్గాలు తెలిపాయి.. ఇజ్రాయిల్ మిలటరీ ఈ దాడిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. హమాస్ శిక్షణా శిబిరాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేశామని మంగళవారం నాటి దాడి గురించి ఇజ్రాయిల్ మిలటరీ చెబుతోంది. కానీ హమాస్ ఈ దాడిని తీవ్రంగా ఖండించింది.

ఎల్గార్ పరిషద్ కేసులో జ్యోతి జగతప్‌కి తాత్కాలిక బెయిల్

న్యూఢిల్లీ : 2020 ఎల్గార్ పరిషద్-మావోయిస్టు సంబంధాల కేసులో సామాజిక కార్యకర్త జ్యోతి జగతప్‌కి సుప్రీంకోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ చంద్రశర్మ ప్రసాద్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం ఈ ఆదేశాలు జారీ చేసింది. జ్యోతి జగతప్ గత ఐదేళ్లుగా జైలులోనే ఉన్నారని ఆమె తరపున సీనియర్ న్యాయవాదులు అపర్ణా భట్, కరిష్మా మరియాలు కోర్టుకు తెలిపారు. ఆమెపై ఎన్ఐఎ చేసిన ఆరోపణలన్నీ అవాస్తమవని, ఎలాంటి ఆధారాలు లేవని వాదనలు వినిపించారు.

కాగా, కబీర్ కళా మంచ్ (కెకెఎం) గ్రూపులో జ్యోతి జగతప్ చురుకుగా వ్యవహరిస్తున్నారని, 2017 డిసెంబర్ 31న పూణెలో జరిగిన ఎల్గార్ పరిషద్ సదస్సులో స్టేజీపై ప్రదర్శనివ్వడమే కాకుండా రెచ్చగొట్టే నినాదాలు చేశారని ఆరోపిస్తూ హైకోర్టు ఆమెకు గతంలో బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే. ఆమె ఉగ్రవాద చర్యకు కుట్రపన్నారని, యత్నించారని, సమర్థించారని, ప్రోత్సహించారంటూ ఎన్ఐఏ చేసిన ఆరోపణలను హైకోర్టు సమర్థించింది. ఆమెకు బెయిల్ నిరాకరిస్తూ 2022లో ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు జ్యోతి జగతప్ దాఖలు చేసిన అప్పీల్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

భారత్, పాక్ యుద్ధంపై మళ్లీ పాతపాట !

- సౌదీ యువరాజుతో భేటీలో ట్రంప్ గొప్పలు

న్యూయార్క్ : భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి పాత పాట పాడారు. ఈ వ్యవహారంలో తృతీయ పక్షం ప్రమేయమే లేదంటూ భారత్ ఎంతగా ఈ వ్యాఖ్యలను తోసిపుచ్చుతున్నా, వెళ్ళిన చోటల్లా, అవకాశమున్నప్పుడల్లా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేస్తూనే వున్నారు. తాజాగా సౌదీ యువరాజుతో భేటీ సమయంలో కూడా ట్రంప్ ఇదే వ్యాఖ్యలు చేయడం గమనార్హం. వైట్‌హౌస్‌లోని ఓవల్ కార్యాలయంలో సౌదీ యువరాజు అరబియా మహ్మద్ బిన్ సుల్తాన్‌తో ద్వైపాక్షిక సమావేశం సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇప్పటి వరకు 8 యుద్ధాలు ఆపాను, ఇంక పుతిన్‌తో మాట్లాడి మరో యుద్ధం ఆపాల్సి వుంది. కాకపోతే అనుకున్నదానికన్నా ఎక్కువ సమయం ఇందుకు పట్టడం ఆశ్చర్యంగా వుంది. భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని మేం ఆపాం, ఆ జాబితా ఏమిటో నాకంటే మీకే బాగా తెలుసు." అని ట్రంప్ పేర్కొన్నారు. చాలామంది నేతలు వారి శాంతి ఒప్పందాలను ఇక్కడే ఈ ఓవల్ కార్యాలయంలోనే సంతకాలు చేశారని గుర్తు చేశారు.

నష్టపోయిన పెంపకందారులను ఆదుకోవాలి

- గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన గొర్రెలు, మేకల పెంపకందారులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం కోరింది. ఈ మేరకు పశు సంవర్ధకశాఖ డైరెక్టరును ఆ సంఘం ప్రధాన కార్యదర్శి జి శ్రీరామ్, సహాయ కార్యదర్శి తిరుపతయ్య బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. తమ సంఘం నాయకత్వం అనేక జిల్లాల్లో గ్రామాలు తిరిగి పరిశీలన చేసిందని తెలిపారు. తుపాను ప్రభావంతో అంటు వ్యాధులు వచ్చి వేలాది జీవాలు చనిపోయాయని తెలిపారు. కొన్ని వాగుల్లో కొట్టుకుపోయాయని, కొన్ని ప్రాంతాల్లో పిడుగులు పడి చనిపోయాయని వివరించారు. దీంతో పెంపకందారులు రూ.కోట్లలో నష్టపోయారని తెలిపారు. బీమా పథకం అమల్లో లేకపోవడంతో పైసా పరిహారం రాలేదని వివరించారు. ఇంత నష్టం ఎప్పుడూ చూడలేదని పెంపకందార్లు వాపోతున్నారని తెలిపారు. వ్యాధుల నివారణ మందులు సుమారు 8 నెలల నుంచి అందుబాటులో లేవని పశు వైద్యశాలలో వైద్యులు చెబుతున్నారని వివరించారు.

రెవెన్యూ యంత్రాంగం, పశు వైద్య సిబ్బంది తుపాను రోజు జరిగిన నష్టాన్ని మాత్రమే నమోదు చేశారన్నారు. రాష్ట్రంలో బొబ్బ వ్యాధి సోకుతుందని, దీని నివారణ టీకాలను వెంటనే సరఫరా చేయాలని కోరారు. తుపాను ప్రభావంతో చనిపోయిన ప్రతి జీవానికి రూ.10 వేలు చొప్పున నష్టపరిహారం అందించాలని, అధికార యంత్రాంగం ప్రతి గ్రామంలో పర్యటించి నష్టాన్ని నమోదు చేయాలని కోరారు. అంటువ్యాధుల నివారణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. పశు బీమా పథకానికి నిధులు కేటాయించి ఉచితంగా అమలు చేయాలని కోరారు.

నా తల్లి ప్రాణాలను భారత్ కాపాడింది

- షేక్ హసీనా కుమారుడు

న్యూఢిల్లీ : భారతదేశం వల్లే తన తల్లి ప్రాణాలు నిలిచాయని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజిబ్‌వాజేద్ తెలిపారు. తన తల్లిపై హత్యాయత్నాన్ని నిరోధించిన ఘనత భారత్‌దేనని వ్యాఖ్యానించారు. షేక్ హసీనాకు బంగ్లాదేశ్‌లో మరణశిక్ష విధించిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "భారత్ ఎల్లప్పుడూ మంచి మిత్రదేశంగా ఉంది. సంక్షోభ సమయంలో నా తల్లి ప్రాణాలు కాపాడింది. ఆమె బంగ్లాను వీడకపోయి ఉంటే.. మిలిటెంట్లు ఆమె హత్యకు కుట్రలు చేసేవారు. నా తల్లి ప్రాణాలు కాపాడినందుకు ప్రధాని మోడీకి నేను ఎల్లప్పుడూ కృతజ్ఞుడిని" అని సాజిబ్ పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనలతో గతేడాది ఆగస్టు 5న బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌కు వచ్చారు. నాటినుంచి ఆమె ఢిల్లీలోని ఓ రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు. అయితే ఆమెపై మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారన్న అభియోగాల నేపథ్యంలో పలు కేసులు నమోదైన సంగతి తెలిసిందే. వీటిపై వాదనలు విన్న ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ సోమవారం ఆమెను దోషిగా తేల్చి, మరణశిక్ష విధించింది. ఈ కేసుల విచారణలో భాగంగా బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం న్యాయ ప్రక్రియను పాటించలేదని సాజిబ్ విమర్శించారు.

హసీనాను ఒక ఫోన్ కాల్ కాపాడిందని, ఆ కాల్‌తో మూక దాడి నుంచి కేవలం 20 నిమిషాల తేడాతో ఆమె తప్పించుకున్నారని చెప్పారు.

నేడు నితీష్ కుమార్ ప్రమాణస్వీకారం

పాట్నా : బీహార్ నూతన ముఖ్యమంత్రిగా నితీష్‌కుమార్ గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఇతర కేంద్ర మంత్రులు, ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం నితీష్‌కుమార్‌కు ఇది 10వ సారి కావడం విశేషం. బుధవారం ముందుగా జరిగిన ఎన్‌డిఎ ఎమ్మెల్యేల సమావేశంలో ఆ కూటమి శాసనసభా పక్ష నేతగా నితీష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎల్‌జెపి (ఆర్‌వి) చిరాగ్ పాశ్వన్, ఆర్ఎల్ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వాహ, హెచ్ఎఎం(ఎస్) అధ్యక్షులు సంతోష్ కుమార్, బీహార్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దిలీప్ కుమార్ జైస్వాల్ సమక్షంలో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలోనే బిజెపి శాసనసభా పక్ష నేతగా సామ్రాట్ చౌదరి ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక అనంతరం నితీష్‌కుమార్ రాజ్‌భవన్‌కు బయలుదేరి వెళ్లారు. అక్కడ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను కలిసి రాజీనామా లేఖ సమర్పించారు. అలాగే, ఈ నెల 20న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. దీనికి గవర్నర్ ఆమోదం తెలిపారు. ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం పాట్నాలోని గాంధీ మైదాన్‌లో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గురువారం ఉదయం 11:30 గంటలకు నితీష్‌కుమార్ ప్రమాణస్వీకార కార్యక్రమం ఉండనుంది..

క్లౌడ్‌ఫేర్‌లో సాంకేతిక లోపం

- స్తంభించిన చాట్‌జిపిటి, ఎక్స్ తదితర సర్వీసులు

న్యూఢిల్లీ : ఇంటర్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్ క్లౌడ్‌ఫేర్‌లో సమస్య తలెత్తడంతో చాట్ జిపిటి, ఎక్స్, ఇతర ఇంటర్‌నెట్ సేవలు స్తంభించాయి. అందుకు సంబంధించిన వెబ్‌సైట్లు ఓపెన్ చేస్తుంటే ఎర్రర్‌కోడ్ 500 అని చూపిస్తోంది. అనేకమంది కస్టమర్లను ఇబ్బందులు పడ్డారు. అయితే ఈ అంశాన్ని గుర్తించామని క్లౌడ్‌ఫేర్ మంగళవారం పేర్కొంది. ఆ సమస్యను చక్కదిద్దే క్రమంలో బ్రిటన్ యూజర్లకు కొన్నిసేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపింది. మొత్తంగా పరిస్థితులను పరిష్కరించి, అన్ని సేవలను పునరుద్ధరించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపింది. ఇంటర్‌నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు నెట్‌వర్క్, సెక్యూరిటీ ఉత్పత్తులను అందించే ప్రముఖ ఇంటర్‌నెట్ హబ్ క్లౌడ్‌ఫేర్. ఆన్‌లైన్ ప్రపంచ ప్లంబింగ్‌ను బలోపేతం చేయడానికి కొన్ని బడా టెక్ కంపెనీలను అనుమతించడం వల్ల తలెత్తే తీవ్ర పర్యవసానాల గురించి గత కొద్ది సంవత్సరాలుగా సైబర్ భద్రతా నిపుణులు హెచ్చరిస్తూనే వస్తున్నారు.

గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్ అరెస్ట్...

న్యూ ఢిల్లీ : గ్యాంగ్ స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) బుదవారం అరెస్ట్ చేశారు. ప్రముఖ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్యకేసులో నిందితుడిగా ఉన్న అన్మోల్ అమెరికా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం భారత్‌కు తరలించారు. న్యూ ఢిల్లీ విమానాశ్రయంలో అన్మోల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అన్మోల్ పై 18 కేసులున్నాయి. ఎన్‌సిపి నాయకుడు, మాజీ మంత్రి బాబా సిద్ధిఖి హత్య కేసులో ప్రధాన నిందితుడు. ఈ ముఠాను కెనడా ప్రభుత్వం ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన విషయం తెలిసిందే. 2014వ సంవత్సరం నుండి జైల్లో ఉన్న బిష్ణోయ్ అక్కడి నుండే సోదరుడు అన్మోల్ సహకారంతో తన ముఠాను నడిపిస్తున్నాడు. పంజాబ్, హర్యానాలతో పాటు కెనడాలోని డయాస్పోరా కమ్యూనిటీలున్న ప్రాంతాల్లో ఈ ముఠా నేరాలు చేస్తుంది. అయితే పంజాబ్ సింగర్ సిద్ధూ మూసేవాలా హత్య, బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ ఇండి వద్ద కాల్పుల ఘటనలో అన్మోల్ ప్రధాన నిందితుడు.. అనేక దేశాల్లో నేర సామ్రాజ్యాన్ని విస్తరించిన ఈ ముఠా అనేక నేరాలకు పాల్పడుతుంది. ప్రముఖుల నుండి బలవంతంగా డబ్బులు వసూలు చేయడం, మాదక ద్రవ్యాలు, ఆయుధాలు అక్రమ రవాణా చేస్తుందని పోలీసులు వెల్లడించారు..

ఎపెస్టిన్ ఫైళ్ళ విడుదలకు అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మిత్రుడు జెఫ్రీ ఎపెస్టిన్ ఫైళ్ళను విడుదల చేయడానికి ఎట్టకేలకు అమెరికన్ కాంగ్రెస్ అధిక మెజారిటీ ఓటుతో (దాదాపు ఏకగ్రీవంగా) ఆమోద ముద్ర వేసింది. దేశ రాజకీయాలను, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలను, ఉన్నత వర్గాలను కుదిపివేసిన ఈ సెక్స్ కుంభకోణానికి సంబంధించిన ఫైళ్ళను తెరవడానికి తొలుత ట్రంప్ తీవ్ర విముఖతను వ్యక్తం చేశారు. అందుకు సంబంధించిన సమాచారమేదీ బయటకు రావడానికి వీల్లేదంటూ కాంగ్రెస్‌లో మిత్రపక్షాలపై తీవ్రంగా ఒత్తిడి తీసుకువచ్చారు. అయితే, ఈ విషయంలో తనను ధిక్కరించడానికి రిపబ్లికన్ పార్టీలో మెజారిటీ భాగం సిద్ధమవుతోందని స్పష్టమైన తర్వాత ట్రంప్ వెనక్కితగ్గారు.. ఎపెస్టిన్ ఫైల్స్ పారదర్శక చట్టాన్ని కాంగ్రెస్ దాదాపు ఏకగ్రీవంగానే ఆమోదించింది. మంగళవారం తెల్లవారు జామున సభ బిల్లును ఆమోదించింది. 428మంది సభ్యులు అనుకూలంగా ఓటు వేయగా, కేవలం ఒకే ఒక్కరు వ్యతిరేకంగా ఓటు వేశారు. సెనెట్ వెంటనే దానికి ఆమోద ముద్ర వేసి వైట్‌హౌస్‌కు నేరుగా పంపించేసింది. వెయ్యి మందికి పైగా బాధితులు వున్న ఈ కేసులో జరిగిన దర్యాప్తు తీరును, సమాధానాలను ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని కాంగ్రెస్ సభ్యులు భావించారు.

ఈ ఫైళ్ళ వల్ల ఎపెస్టిన్‌కు డెమోక్రాట్లతో గల సంబంధాల గుట్టు రట్టు అవుతుందని ట్రంప్ వ్యాఖ్యానిస్తున్నారు, కానీ సుదీర్ఘ స్నేహబంధం వున్న ఎపెస్టిన్ వ్యవహారంలో ట్రంప్ చాలా అసహనానికి గురవుతున్నట్లు స్పష్టంగా వెల్లడవుతోంది.

ఎస్‌సిల సాగు భూములపై అభ్యంతరాలొద్దు

- ఎస్‌సి కమిషన్ ఛైర్మన్‌కు కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌సిలు సాగు చేసుకుంటున్న భూములపై అభ్యంతరాలు పెట్టొద్దని కెవిపిఎస్ కోరింది. ఈ మేరకు ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కెఎస్ జవహర్‌ను ఆ సంఘం ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, రాష్ట్ర కమిటీ సభ్యులు జొన్నకూటి నవీన్ ప్రకాష్ విజయవాడలో బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. తిరుపతి జిల్లా ఓళ్ళూరు రాయలచెరువు కట్టకు గండిపడి కళత్తూరు దళితవాడ, పాతపాలెం అరుంధతి వాడలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ గండి వల్ల దాదాపు 700 కుటుంబాలు సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలాయని పేర్కొన్నారు. స్థానికంగా 700 ఎకరాలు పేదల సాగులో ఉన్నాయని, అటవీశాఖ పరిధిలో లేకపోయినా వీటిపై అభ్యంతరాలు పెడుతూ వేధిస్తున్నారని వివరించారు. రెవెన్యూ-ఫారెస్ట్ మధ్య వివాదంగా ఉన్న ఈ భూ సమస్యను పరిష్కరించి ప్రతి కుటుంబానికీ రెండెకరాలు చొప్పున పట్టాలివ్వాలని కోరారు. కళత్తూరులోని బ్లాక్-1లో 100 ఎకరాలు, బ్లాక్-4లో 300 ఎకరాలు ఎస్‌సిలు సాగు చేసుకుంటున్నారని, వీటిపై అటవీశాఖ అభ్యంతరం చెబుతోందని పేర్కొన్నారు. బ్లాక్ నెంబర్-3 ఆదవరం రెవెన్యూలో 300 ఎకరాల్లో 100 ఎకరాలు దళితులు సాగు చేస్తున్నారని, వీటిపై అటవీశాఖ అభ్యంతరం చెబుతుందని, ఒసి, బిసిలు సాగు చేసుకుంటున్న వివాదాస్పద భూములపై ఎలాంటి అభ్యంతరం తెలపడం లేదని వివరించారు.

2027 నాటికి టూరిజం హబ్‌గా రాష్ట్రం

- ఎపిటిడిసి ఛైర్మన్ బాలాజీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టూరిజం హబ్‌గా 2027 నాటికి రాష్ట్రం నిలవబోతుందని పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్, టిడిపి అధికార ప్రతినిధి నూకసాని బాలాజీ తెలిపారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలో విశాఖపట్నంలో జరిగిన సిఐఐ సదస్సులో పర్యాటక రంగంలో రూ.18 వేలకోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని చెప్పారు. 97 వేల ఉద్యోగాలు పర్యాటకంలో యువతకు రాబోతున్నాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సాస్కీ, ప్రసాద్ స్కీమ్‌ల ద్వారా రూ.441 కోట్లతో సూర్యలంక, సింహాచలం, అహోబిలం వంటి చోట్ల చురుగ్గా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. రిసార్ట్స్‌లను కలుపుతూ టెంపుల్ టూరిజం అభివృద్ధికి ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని చెప్పారు. విశాఖ సదస్సుపై వైసిపి తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు.

మన కులం మానవత్వం..

- మోడీ సమక్షంలో ఐశ్వర్యారాయ్ ప్రసంగం
- ఇబ్బంది పడిన ప్రధాని మోడీ

పుట్టపర్తి : ఒకే కులం ఉంది అది మానవత్వం, ఒకే మతం ఉంది అది ప్రేమ అని ప్రముఖ బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్ బచ్చన్ చేసిన ప్రసంగం అందర్ని ఆకట్టుకుంటుంది. శ్రీసత్యసాయి జన్మ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మోడీ సమక్షంలో ఐశ్వర్యరాయ్ ప్రసంగించారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఐశ్వర్వరాయ్ తన ప్రసంగంలో మానవత్వం, ప్రేమ యొక్క ప్రాముఖ్యతల గురించి ప్రస్తావించారు. విభజనలకు అతీతంగా ఉండాలని ప్రతీ ఒక్కరికీ పిలుపునిచ్చారు. ఆమె ప్రసంగాన్ని ప్రేక్షకులు ఆసక్తిగా విన్నారు. అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాత్రం ఐశ్వర్య ప్రసంగం సమయంలో ఇబ్బంది పడుతూ కనిపించారు. సోషల్ మీడియాలో దీనిపై నెటిజన్లు స్పందిస్తూ కామెంట్లు చేశారు. అయితే ఐశ్వర్యరాయ్ తన ప్రసంగంలో 'మనకు ఒకే కులం ఉంది, అది మానవత్వం అనే కులం. ఒకే మతం ఉంది, ప్రేమ అనే మతం. ఒకే భాష ఉంది..అది హృదయ భాష, ఒకే దేవుడు ఉన్నాడు ఆయన సర్వవ్యాప్తి' అని ఐశ్వర్య అన్నారు. ఈ మాటలకు సభికుల నుంచి పెద్ద ఎత్తున చప్పట్ల ప్రతిస్పందనగా వచ్చింది. మోడీ ఉన్న వేదికపై ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం..



'అన్నదాత సుఖీభవ' లబ్ధిదారులకు డెమో చెక్కును అందజేస్తున్న సిఎం చంద్రబాబు

గేమ్‌ఛేంజర్‌గా వ్యవసాయం

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి ఎకరాకు నీటిని ఇచ్చే బాధ్యత ఎన్‌డియేనని తెలిపారు. ప్రస్తుతం దేశంలో ఆహారపు అలవాట్లు మారాయని, డిమాండ్ ఆధారిత పంటలైన కూరగాయలు, పండ్లు, మిల్లెట్స్ తినడం వైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. భవిష్యత్తులో ప్రకృతి సేద్యానికి భవిష్యత్తు ఉందని తెలిపారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో 12 లక్షల ఎకరాల సాగుతో మన రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ఒకప్పుడు పంజాబ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు దేశానికి అన్నం పెట్టాయని, ప్రస్తుతం పంజాబ్ నుంచి ఢిల్లీకి కేన్సర్ రోగులతో కూడిన రైళ్లు వెళ్తున్న పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. 2019-24 పీరియడ్‌లో భూసార పరీక్షలను నిలిపేశారని, ప్రస్తుతం శాటిలైట్స్ సహాయంతో చేసిన భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించేలా చేస్తున్నామని తెలిపారు. రాయలసీమలో హార్టీ, ఆంధ్రా ప్రాంతంలో ఆక్వా, అరకు కాఫీలను బెస్ట్ ఉత్పత్తులుగా ప్రమోట్ చేస్తున్నామన్నారు. పామాయిల్, కోకో సాగులో అంతర పంటల వల్ల చాక్లెట్స్ కంపెనీలు, లూలూ, రిలయన్స్ వంటి ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలు రానున్నాయని వివరించారు. యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తెస్తానని తెలిపారు. ఆల్ట్రా హ్యూమన్ సెన్సార్ ద్వారా ఆహారంపై అవగాహన కల్పిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 నుంచి 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని, ఇప్పటికే రూ.1,595 కోట్ల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. రూ.13 వేల కోట్లతో రాయలసీమలో ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలు రానున్నాయని, రాయలసీమ సాంకేతిక, గ్రీన్‌ఎనర్జీ హబ్‌గా మారుతోందని అన్నారు. రాష్ట్రంలో అన్నదాతా సుఖీభవ పథకం కింద 46 లక్షల మందికిపైగా రైతుల ఖాతాల్లో రెండు విడతలో రూ.6,310 కోట్లు జమ చేస్తున్నామని వివరించారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ సి.శ్రీధర్, ఎస్‌పి నచికేత్ విశ్వనాథన్, రైతులు పాల్గొన్నారు.

స్థానిక మార్కెట్లను బలోపేతం చేయండి

(మొదటిపేజీ తరువాయి)

సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ద్వారా బాబా శతజయంతిని పురష్కరించుకుని వంద గోవులను స్థానిక రైతులకు అందించే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళారూపాలు

ఈ సందర్భంగా నిర్వహించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి, గుజరాతి గర్బా డ్యాన్సు, దేశ సమైక్యతను చాటే విధంగా అన్ని భాషల్లో సత్యసాయిబాబాను కీర్తిస్తూ రూపొందించిన నృత్యం ఆకట్టుకున్నాయి. డ్రమ్స్ మాస్టర్ పద్మశ్రీ శివమణి ఆధ్వర్యంలో తమిళనాడు, కేరళతోపాటు ఆయన డ్రమ్స్ ద్వారా రూపొందించిన డప్పుల చప్పుడు హిల్‌వ్యూ స్టేడియం మొత్తం మారుమోగింది. ఈ ప్రదర్శనలు ముగిసిన తరువాత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా సత్యసాయి బాబా శతజయంతిని పురష్కరించుకుని వంద రూపాయల నాణెం, ఆయన జీవిత చరిత్రను తెలియజేసే విధంగా రూపొందించిన పోస్టల్ స్టాంపులను విడుదల చేశారు. . సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ద్వారా సత్యసాయి జిల్లాలో సుకన్య సంవృద్ధి యోజన పథకం పత్రాలను ముగ్గురు బాలికలకు ప్రధాని అందచేశారు.

నెత్తుటి తడారని 'మారేడుమిల్లి'

(మొదటిపేజీ తరువాయి)

5 నుంచి 5.45 గంటల మధ్య పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారని తెలిపారు. వారిలో మావోయిస్టు కేంద్ర కమిటీ ముఖ్య సభ్యుడు మెట్టూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్, జ్యోతి అలియాస్ సరిత, సురేష్ అలియాస్ రమేష్, లోకేష్ అలియాస్ గణేష్, సైను అలియాస్ వాసు, అనిత, షమీమ్లు ఉన్నారని చెప్పారు. ఎకె 47 రైఫిల్స్ 2, ఎకె 47 మ్యాగజైన్స్ 5, ఎకె 47 ఎమ్యునిషన్ 72 రౌండ్లు, ఎస్‌బిబిఎల్ గన్స్ 5, ఎస్‌బిబిఎల్ ఎమ్యునిషన్ 34 రౌండ్లు, 303 రైఫిల్ 1, 303 ఎమ్యునిషన్ 24 రౌండ్లు, కార్డెక్స్ వైర్ 3 కేజీలు, డిటోనేటర్లు 18, కిట్ బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఏడుగురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించామని, వాటికి గురువారం పోస్టుమార్టం నిర్వహించనున్నారని చెప్పారు. టెక్ శంకర్ శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరుకు చెందిన వారు.

జీవన సౌరభం
గెలవాలనే స్ఫూర్తితో పోరాడితే ఓడినా తట్టుకోగలరు.

మీకోసం
అడుగు మాడిన గిన్నెలను ఉప్పు, నిమ్మచెక్కతో కలిపి తోమితే మురికి సులభంగా పోతుంది.

మేమే బాలలం

బాలలం బాలలం
భానుని కిరణాలం
ముద్దబంతి పూవులం
మమతల కెరటాలం

దేవుని రూపాలం
గృహమున దీపాలం
అందాల బాలలం
మందార మాలలం

పున్నమి రోజుల్లో
వెన్నెలమ్మ వెలుగులం
కన్నోళ్ల గుండెల్లో
ప్రేమలొలుకు చెలమలం

అందరికీ ఇష్టులం
స్నేహానికి గుర్తులం
వెన్నలాంటి మనసులం
కన్నవారి శ్వాసలం

-గద్వాల సోమన్న,
గణితోపాధ్యాయుడు,
ఎమ్మిగనూరు,
99664 14580.

మౌన గానం

కొమ్మల్లో కోయిలంట
రెమ్మల్లో దాగెనంట
కమ్మంగా కూయునంట
గమ్మతైన గాత్రమంట

తన రూపమే నలుపంట
తన హృదయమే తెలుపంట
తన పాటే తీయనంట
తన బాటే సాగమంట

మావి చిగురు మేయునంట
మైమరచి పాడునంట
పాటకు పల్లవి తానంట

మాటే మౌన గానమంట
తన పలుకే ఇల సంతోషమంట

తన ఊరే ఈ వనమంట
తన తీరే పావన మంట
తన ఇల్లే ఈలోక మంట

గుండాల నరేంద్రబాబు,
94932 35992.

నేను గీసిన బొమ్మ

సూరేపల్లి. ప్రియదర్శిని,
8వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్
చెరువుమాదారం,
నేలకొండపల్లి (మం),
ఖమ్మం (జిల్లా)

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

బాలల భవితకి బాటలు వేద్దాం

నేడు అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం

ఇళ్లల్లోనూ, పాఠశాలల్లోనూ, ఇతర ప్రాంతాల్లో అనేకమంది బాలలు హింస, దారిదోపిడీ, వేధింపుల వంటి రకరకాల అకృత్యాల బారిన పడుతున్నారు. అందుకే వారి హక్కుల గురించి, వారు పడుతున్న ఆవేదనను గురించి చైతన్యాన్ని తీసుకురావడానికి ఏటా 'ప్రపంచ బాలల హక్కుల వారోత్సవాలు నవంబర్ 14 నుండి 20 వరకు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయి.

ప్రపంచ బాలల హక్కుల దినోత్సవాన్ని (యూనివర్సల్ చిల్డ్రన్ డే) ఏటేటా నవంబర్ 20న జరుపుకుంటున్నాం. బాలలు తమ భావాలను, సమాచారాన్ని పంచుకోవడాన్ని, పరస్పర అవగాహనను పెంచుకోవడాన్ని ప్రోత్సహించేందుకుగాను 1989లో బాలల హక్కుల అంతర్జాతీయ ఒడంబడికను రూపొందించింది. ఇది బాలల పౌర, రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల పరిరక్షణకు పూనుకున్న ఏకైక ఒప్పందం. అన్ని దేశాల్లోను, అన్ని పరిస్థితుల్లోను బాలలందరికీ వర్తించే సార్వత్రిక ఒప్పందమిది. పరిమిత వనరులున్న ప్రభుత్వాలు కూడా బాలల హక్కులు కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని నిర్దేశించిన బేషరతు ఒప్పందమిది. భారత ప్రభుత్వం 1992లో ఈ ఒడంబడికను ఆమోదించి సంతకం చేసింది.బాలల హక్కుల్లో బాలలు ప్రధానంగా 40 రకాల హక్కుల్ని కలిగి ఉంటారు. యుఎన్‌సిఆర్‌సి ప్రకారం బాల హక్కులు 4 రకాలుగా వర్గీకరించారు.

జీవించే హక్కు : ప్రతి బిడ్డకు ఆహారం, ఆరోగ్యం, విద్యను అందించి, వారి పరిపూర్ణ, శారీరక, మానసిక, సామాజిక వికాసానికి పునాది వేయాలి.

రక్షణ పొందే హక్కు : అన్ని రకాల బాధల నుంచి, అవమానాలు, అమానుష్యాల నుండి పిల్లలకు విముక్తి, స్వేచ్ఛ కల్పించటం, అత్యవసర పరిస్థితుల్లో, సంఘర్షణలు సంభవిస్తే ప్రత్యేక రక్షణను కల్పించాలి. దోపిడీ నుంచి రక్షణను కల్పించి, వారి అభివృద్ధికి తగిన జాగ్రత్త తీసుకోవడం. భారత రాజ్యాంగ చట్టం ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలు, ఫ్యాక్టరీలు, గనుల్లో పనులు చేయడం నేరం.

అభివృద్ధి చెందే హక్కు : పిల్లల ఆలంబన, వికాసం, సంరక్షణ, సాంఘిక భద్రత హక్కులతో పాటు విశ్రాంతికి, వినోదానికి సాంస్కృతిక కార్యకలాపాలకు సంబంధించిన హక్కులు కూడా ఉన్నాయి. బడికి వెళ్ళని 5-14 సంవత్సరాల పిల్లలకు (పశువులను మేపుతూ, పొలం పనులు చేసేవారు) నిర్బంధ ఉచిత విద్యను ఆదేశించారు.

భాగస్వామ్య హక్కు: బాలల అభిప్రాయాలపై గౌరవం, భావ ప్రకటన, స్వేచ్ఛ, సరైన సమాచారం పొందే హక్కు. పిల్లలు వారి మనస్సులోని భావాలను, అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే హక్కులు వారి భావాలకు తగిన విలువను ఇవ్వాలి. భావప్రకటనకు స్వేచ్ఛను కలిగించాలి.

భారత రాజ్యాంగంలోని మూడు భాగాలైన ప్రాథమిక హక్కులు (విభాగం-3), ఆదేశిక సూత్రాలు (విభాగం-4), ప్రాథమిక విధులు (విభాగం-4 ఎ)లో పొందుపర్చారు.

బాల న్యాయమండళ్లు

2000 న్యాయచట్ట ప్రకారం నేరారోపణలో ఉన్న 18 ఏళ్లలోపు బాలలకు సంబంధించిన కేసులను విచారించడానికి బాలల న్యాయ మండలిని ఏర్పాటు చేశారు. ఇందులో నేరారోపణ చేయబడిన బాలలు చట్టం పరిధిలోని కేసులను పరిష్కరించి రక్షణ కల్పించడం ముఖ్య ఉద్దేశం. బాలలపై నేరారోపణ చేయబడిన కేసులపై రిపోర్ట్ జిల్లా ప్రొహిబిషన్ అధికారితో సామాజిక విచారణ చేయించి కేసుల పరిష్కారానికి వీలు కల్పిస్తారు. నేరారోపణ ఉన్న బాలలకు సంరక్షణ అవసరమైతే

వారిని బాల సంక్షేమ కమిటీ, సంరక్షణ విభాగానికి పంపడానికి వీలుంది. నేరం రుజువైన బాలలను ప్రత్యేక గృహాలకు పంపించి వారిలో మార్పు తీసుకొచ్చి సత్ప్రవర్తన కలిగిన బాలలుగా తీర్చి దిద్దడం ముఖ్య ఉద్దేశం.

బాలల సంక్షేమ సమితి : 18 ఏళ్లలోపు బాలలకు సంబంధించిన కేసులు విచారణ, సంరక్షణకు కావాల్సిన బాధ్యతలను 2000 చట్టం ప్రకారం సంక్షేమ సమితిని ఏర్పాటు చేశారు. ఈ సంక్షేమ పరిధిలో 18 ఏళ్ల లోపు పిల్లలందరికీ హక్కుల రక్షణకు పాటుపడడం, ఇష్టాలను గౌరవిస్తూ సంక్షేమానికి తోడ్పాటు అందజేయడం, సంక్షేమ సమితిలో బాలలకు ఆదరణ, సంరక్షణకు అవసరమైన బాలలతో వ్యక్తిగతంగా మాట్లాడి సామాజిక విచారణను తయారుచేస్తారు. బాలలతో సంబంధం ఉన్న కుటుంబ సభ్యులను ఇతర సంస్థలతో మాట్లాడి అవసరాలు, స్థితిగతులను గమనిస్తారు. సహాయం చేయాలని ఒక ప్రణాళికను తయారు చేసి సంరక్షణకు అవసరమైన బాలలను వివిధ గృహాల్లో చేర్చి ప్రవర్తనలో మార్పు వచ్చే వరకూ కృషి చేస్తారు. అదే విధంగా వివిధ స్వచ్ఛంద సంస్థలు, ఇతర అధికారులతో సంబంధాలు నెలకొల్పి వారి నుంచి బాలలకు సహాయం అందే విధంగా కృషి చేస్తారు.

పిల్లలను ఎదగనిద్దాం

మంచి వాతావరణం నుంచి వచ్చిన పిల్లలు మంచి ప్రవర్తనతో ఎట్టి పరిస్థితినైనా విజయవంతంగా అధిగమించగలరు. కుటుంబం, తోటిపిల్లలు, ఉపాధ్యాయులు, అందరూ పాఠశాల వాతావరణంలో కలిసి వుంటారు. పిల్లల అభివృద్ధికి, సక్రమ సామాజికతను పొందడానికి ఈ వాతావరణం తప్పనిసరి అంశం. పిల్లలను ప్రతిభావంతులుగా మలిచే సామాజిక కారణాల్లో తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులే ప్రథములు. 40 కోట్ల మంది బాలలున్న మన భారతదేశం, సాంఘికంగా, ఆర్థికంగా ఎంతో ప్రగతి సాధించినా, ఇంకా చాలా మంది పిల్లలు ఎన్నో రకాల ఇబ్బందులు పడుతున్నారు. దయనీయమైన, అమానుష మైన పరిస్థితుల్లో బతుకుతున్న బాలలు లక్షలాదిగా ఉన్నారు. బాల కార్మికులుగా పసితనంలోనే బాల్యం కోల్పోతున్న వారు కొందరైతే, బాల్య వివాహం వల్ల బ్రతుకునే కోల్పోతున్నవారు మరికొందరు. ముఖ్యంగా ఆడపిల్లలు మరింతగా బాధలు ఎదుర్కొంటున్నారు. సరైన ఆహారం లేక, ఆశ్రయం లేక, వీధుల్లో బతుకుతూ, అనారోగ్యం పాలై అనేక రకాల లైంగిక హింసలకి గురవుతూ, వ్యభిచారం కోసం అక్రమ రవాణాకి గురవుతూ వారు పడే బాధలు అన్నీ ఇన్నీ కావు. అలాంటి బాలలకి ప్రత్యేక రక్షణ, ఆదరణ కావాలి. శతాబ్దాలు మారినా, తరాలు మారినా ఇంకా గ్రామాల్లో కాదు పట్టణ ప్రజలు కూడా ఆడ, మగ అనే వ్యత్యాసం చూపిస్తున్నారు. ప్రతి ఒక్క బాలలు విద్యావంతులవ్వాలి. అకృత్యాల బారిన పడకుండా, ఎవరి దోపిడీకి గురి కాకుండా, రక్షణతో, సంరక్షణతో, గౌరవంతో జీవించే జీవితాన్ని బాలలకు ఇద్దాం. వారి బంగారు బాల్యం బాలల హక్కు కావాలి. దీనికి సమాజంలో అందరి భాగస్వామ్యం అవసరం. గత కొన్నేళ్లుగా నవజీవన్ బాలభవన్ ద్వారా వీధి బాలల రక్షణకు పాటుపడుతున్నాం.

- గోళ్ళమూడి శేఖర్‌బాబు,
ఎంఎ (సోషల్‌వర్క్)
ప్రోగ్రాం మేనేజర్,
నవజీవన్ బాల భవన్,
విజయవాడ
సెల్ : 8121214386

వేధింపులు అధికమే..

ప్రపంచవ్యాప్తంగా పరిశీలిస్తే మనం ఉండే వీధుల్లోనూ, చుట్టుపక్కల ప్రాంతాల్లో పిల్లలు భద్రంగా ఉండటం లేదు. పిల్లల భద్రతపై ఇటీవల జరిపిన సర్వేలో అత్యధిక మంది పిల్లలు వేధింపులకు గురవుతున్నట్లు వెల్లడైంది. అనేక వేధింపులు వంటి విషయాలు వెలుగులోకి వచ్చాయి. మనదేశంలో పిల్లలపై వేధింపుల కేసులు అధికంగా ఉత్తరప్రదేశ్, అస్సాం, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, బీహార్ రాష్ట్రాల్లో నమోదవుతున్నాయి. నమోదుకాని కేసులు లక్షల్లో ఉంటున్నాయి. ప్రతి ముగ్గురు పిల్లల్లో ఇద్దరు శారీరక వేధింపులకు గురవుతున్నారు. ప్రతి రోజూ ఎనిమిది కేసులు నమోదవుతున్నాయి. చాలాసార్లు తెలిసిన వారే లైంగిక దాడులకు తెగబడుతున్నారనేది వెలుగులోకి వచ్చింది. ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నట్లుగా స్పష్టమవుతోంది. పిల్లలు మాయం కావడం, అమ్మకం, దాడులు, హింస మొదలైనవాటితోపాటుగా నేటికి బాల్య వివాహాలు కొనసాగడం శోచనీయం. ఇందుకు సమాజంలో నెలకున్న మూఢ నమ్మకాలే కారణం.

జనవరి నుంచి 'జై హనుమాన్'!

'కాంతార: చాప్టర్ 1' ఘన విజయం తర్వాత రిషబ్‌శెట్టి తన తదుపరి ప్రాజెక్ట్ 'జై హనుమాన్' కోసం సిద్ధమవుతున్నారు. జనవరి మొదటి వారంలోనే ఈ చిత్రం షూటింగ్ ప్రారంభం కానుంది. రిషబ్ జనవరి నుంచి మే వరకు దర్శకుడు ప్రశాంత్‌వర్మకు ఐదు నెలల కాల్షీట్లు ఇచ్చారు. ఇందులో ఆయన ఆంజనేయస్వామి పాత్రలో కనిపించనున్నారు. సాయిమాధవ్ బుర్రా సంభాషణలు రాస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మాణం చేపట్టింది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తేజా సజ్జా కథానాయకుడిగా తెరకెక్కిన 'హనుమాన్' భారీ విజయం సాధించింది. దానికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపొందనుంది. నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవిశంకర్.

సమాజ పరిస్థితులకు అద్దంపట్టేలా 'జనం'

దర్శకుడు వెంకటరమణ పసుపులేటి

'నేటి సమాజ పరిస్థితులకు అద్దంపట్టేలా మా సినిమా 'జనం' ఉంటుంది. రాజకీయాలు ఎలా భ్రష్టుపట్టి పోయాయనేది ఈ సినిమాలో చాలా చక్కటి సన్నివేశాలను మేళవించి తెరకెక్కించాం. ఓట్ల కోసం రాజకీయ నాయకుల విన్యాసాలు, గెలిచిన తర్వాత ప్రజలను పట్టించుకోని వైనాన్ని కూడా ఇందులో చాలా మంచి ఎలిమెంట్లతో చూపించాం. ప్రజా ప్రతినిధులు ఎలా ఉండాలి, ఎలా ఉండకూడదు. తప్పుదోవ పట్టించే ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకుల పట్ల ప్రజలు ఎలా ఉండాలనే విషయాలను కూడా చాలా చక్కటి సన్నివేశాలతో తెరకెక్కించాం. సమాజంలోని పౌరులను పక్కదారి పట్టిస్తున్న ఘటనలను ఎత్తి చూపిస్తూ, అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా తీశాం. అదుపు తప్పుతున్న నేటి తరానికి అవగాహన కోసం చక్కటి సినిమా అందిస్తున్నాం. ఉత్తమ పౌరులుగా ఉండాల్సిన వారు స్మార్ట్‌ఫోన్‌కు, నాయకుల పంచే మందు, డబ్బులకు ఎలా బానిస అవుతున్నారో ఆలోచింపచేసేలా సినిమా తెరకెక్కించాం. ఒకప్పుడు సినిమాలు జనాన్ని ఆలోచింప చేసే విధంగా ఉండేవి. ఇప్పుడు కంటి చూపుతో విమానం కూలటం, రక్త పాతం, హింస, బీపీలు పెరిగే సౌండ్, అర్థం లేని సినిమాలు, వేల కోట్ల కలెక్షన్లు వంటివి సమాజానికి, రేపటి తరానికి ఎలాంటి నేపథ్యమో ఆలోచించండి. 'జనం' సినిమా ప్రతి ఒక్కరి జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. మంచి సందేశాన్ని సమాజానికి అందిస్తుంది. అందుకే ప్రతిఒక్కరూ ఈ సినిమాను చూసి ఆదరించాలని కోరుతున్నా. కథ, పాటలు, స్క్రీన్‌ప్లే వర్కు కూడా నేనే చేశా' అని దర్శక, నిర్మాత వెంకటరమణ పసుపులేటి అన్నారు. విఆర్‌పి క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కిన సినిమా 'జనం'. ఈనెల 28న థియేటర్లలో విడుదల కానుంది. ప్రముఖ నటులు సుమన్, అజయ్‌ఘోష్‌లతోపాటుగా కె.కిషోర్, వెంకట రమణ, ప్రగ్య నయన్, మౌనిక, లక్కీ, జయవాని, రషీదా తదితరులు కీలక పాత్రల్లో నటించారు.ఈ సినిమా ప్రచార కార్యక్రమంలో భాగంగా వెంకటరమణ మీడియాతో మాట్లాడారు.

వన్డే సిరీస్ మనదే

- చివరి వన్డేలో ఓడినా.. సిరీస్ 2-1తో ఇండియా-ఎ కైవసం
- మూడో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా-ఎ 73పరుగుల తేడాతో గెలుపు

రాజ్‌కోట్: దక్షిణాఫ్రికా-ఎతో జరిగిన మూడో అనధికారిక వన్డేలో భారత-ఎ జట్టు ఓటమిపాలైంది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 326 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారతజట్టు 49.1 ఓవర్లలో 252పరుగులకు ఆలౌటైంది. దీంతో 73 పరుగుల తేడాతో పరాజయంపాలైంది. ఈ వన్డేకు ముందే సిరీస్‌ను చేజిక్కించుకున్న టీమిండియా.. బుధవారం జరిగిన చివరి వన్డేలో ఓడినా.. సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా-ఎ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఓపెనర్లు లూహాన్ డ్రి ప్రిటోరియస్(123), రివాల్డో మూన్‌సామి(107) శతకాలతో మెరిసారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 37 ఓవర్లలో 241 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆతర్వాత రుబిన్ హెర్మన్(11), క్వైషైల్(1), కెప్టెన్ ఆకెర్‌మన్(16), డియాన్ ఫార్రె-స్టర్(20) తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. ఆఖర్లో డెలానో పాట్‌గెటర్(30నాటౌట్; 15బంతుల్లో 3ఫోర్లు, సిక్సర్) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. దీంతో దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 325పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. భారత బౌలర్లు ఖలీల్ అహ్మద్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ రెండేసి వికెట్లతో రాణించారు. 326 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన భారతజట్టు ఆది నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. రుతురాజ్ గైక్వాడ్(25), అభిషేక్ శర్మ(11), కెప్టెన్ తిలక్ వర్మ(11), రియాన్ పరాగ్(17) స్వల్ప స్కోర్లకే పెవీలియన్‌కు చేరారు. ఇషాన్ కిషన్(53), ఆయుశ్ బదోని(66) అర్ధసెంచరీలతో రాణించినా.. గెలుపు తీరాలకు చేర్చలేకపోయారు. నకాబా పీటర్‌కు నాలుగు, మొరేకి మూడు, ఫోర్టుయిన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ పీటర్సన్‌కు, సిరీస్

ఆ నంబర్ నాది కాదు

సోషల్ మీడియాలో సెలబ్రిటీల పేరుతో నకిలీ అకౌంట్లు సృష్టించడం కొత్త కాదు. తాజాగా శ్రియ శరణ్ ఇటువంటి మోసానికి గురయ్యారు. ఆమె పేరుతో నకిలీ వాట్సప్ నంబర్‌ని అపరిచిత వ్యక్తులు సోషల్ మీడియాలో యాక్టివ్ చేశారు. ఆ నంబరు నుండి కొంతమంది వ్యక్తులు, ఇండస్ట్రీకి చెందిన వారికి మెసేజ్‌లు పంపుతున్నారనే విషయం బయటకు రావడంతో, దీనిపై శ్రియ స్పందించారు. తన ఇన్‌స్టాగ్రామ్‌లో దీని గురించి ఆమె ఓ పోస్ట్ పెట్టారు. 'ఈ వాట్సప్ ఎవరిదో నాకు తెలియదు. దయచేసి ఇలాంటి నంబర్లతో మాట్లాడి మీ విలువైన సమయాన్ని వృధా చేసుకోవద్దు. ఇది నేను కాదు. ఆ నెంబర్ నాది కాదు. ఈ వ్యక్తి నా సన్నిహితులు, నేను పని చేయబోయే వ్యక్తులకు కూడా మెసేజ్‌లు పంపుతున్నాడు. అందరూ జాగ్రత్తగా ఉండండి' అని ఆ పోస్టులో రాశారు. ఇటీవల ఇదే తరహా ఘటన అదితి రావు హైదరి విషయంలోనూ జరిగింది. ఆమె పేరుతో నకిలీ వాట్సప్ అకౌంట్ సృష్టించి, ఫొటోషూట్ పేరుతో పలువురు ఫొటోగ్రాఫర్లను సంప్రదించినట్లు తెలిసింది. వెంటనే స్పందించిన అదితి 'ఫొటోషూట్ వంటి పనుల కోసం నేను వ్యక్తిగత నంబర్ నుంచి ఎప్పుడూ మెసేజ్ చేయను. నా టీమ్ ద్వారానే కమ్యూనికేషన్ జరుగుతుంది. అలాంటి ఫేక్ మెసేజ్‌లు వస్తే మా అధికారిక ఇన్‌స్టాకి సమాచారం ఇవ్వండి' అని విజ్ఞప్తి చేశారు.

డిసెంబరులో 'అన్న గారు వస్తారు'

కార్తీ నటించిన తాజా తమిళ చిత్రం 'వా వాతియార్' తెలుగులో 'అన్నగారు వస్తారు' పేరుతో డబ్ అవుతోంది. కృతీశెట్టి హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాను డిసెంబర్‌లో విడుదల చేయబోతున్నారు. ఈ సినిమాను స్టూడియో గ్రీన్ బ్యానర్ పై కె. ఇ. జ్ఞానవేల్ రాజా నిర్మించారు. నలన్ కుమారస్వామి కథను అందించడంతో పాటు దర్శకత్వం వహించారు. ఇతర ప్రధాన పాత్రలను సత్యరాజ్, మధుర్ మిట్టల్, ఆనంద రాజ్, రాజ్ కిరణ్, శిల్పా మంజునాథ్, కరుణాకరణ్ తదితరులు పోషించారు. ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.

యువ క్రికెటర్లకు సదవకాశం

- వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

దుబాయ్: ఐసిసి పురుషుల(అండర్-19) ప్రపంచకప్ షెడ్యూల్ బుధవారం విడుదలైంది. జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ టోర్నీ 2026 జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6వరకు జరుగనుంది. మూడు వారాల పాటు జరిగే ఈ మెగా టోర్నీలో మొత్తం 16 జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి. ఫిబ్రవరి 6న హరారేలో జరిగే ఫైనల్‌తో సహ 41 మ్యాచ్‌లు జరుగనున్నాయి. తొలి మ్యాచ్‌లో గత సీజన్ రన్నరప్ భారత్, అమెరికా జట్లు తలపడనున్నాయి. ఆరోజే జింబాబ్వే, స్కాట్లాండ్, టాంజానియా, వెస్టిండీస్ మ్యాచ్‌లు కూడా జరుగనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా వారి తొలి మ్యాచ్‌ను జనవరి 16న ఐర్లాండ్‌తో ఆడనుంది. ఈ టోర్నీలోని మ్యాచ్‌లు రెండు ఆతిథ్య దేశాల్లోని ఐదు మైదానాల్లో జరుగుతాయి. ఈ టోర్నీలో పాల్గొనే 16 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. అనంతరం సూపర్-6, సెమీఫైనల్స్, ఫైనల్స్ జరుగుతాయి. ఈ టోర్నీకి సంబంధించిన వార్మప్ మ్యాచ్‌లు జనవరి 9-14 మధ్యలో జరుగుతాయి. గ్రూప్-ఎ: భారత్, బంగ్లాదేశ్, అమెరికా, న్యూజిలాండ్ (బి) జింబాబ్వే, పాకిస్తాన్, ఇంగ్లండ్, స్కాట్లాండ్ (సి) ఆస్ట్రేలియా, ఐర్లాండ్, జపాన్, శ్రీలంక (డి) వెస్టిండీస్, టాంజానియా, ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా జట్లు ఉన్నాయి.

ప్రణయ్, లక్ష్యసేన్ శుభారంభం

- ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల హవా కొనసాగించింది. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్‌తోపాటు కిదాంబి శ్రీకాంత్, ఆయుష్ శెట్టి, తస్నిన్ మన్నేపల్లి రెండోరౌండ్‌కు చేరగా.. కిరణ్ జార్జి మూడుసెట్ల హోరాహోరీ పోరులో ఓటమిపాలయ్యాడు. లక్ష్యసేన్ 21-17, 21-13తో సూ(చైనీస్ తైపీ), కిదాంబి శ్రీకాంత్ 21-19, 19-21, 21-15తో లీ(చైనీస్ తైపీ)పైనే విజయం సాధించారు. ఇక ఆయుష్ శెట్టి 21-11, 21-15తో యువాన్ సామ్(కెనడా)ను చిత్తుచేయగా.. కిరణ్ జార్జి 21-11, 22-24, 17-21తో జపాన్‌కు చెందిన నిషిమోటో చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. ఇక హెచ్‌ఎస్ ప్రణయ్ 6-21, 21-12, 21-17తో మార్లెల్లో(ఫ్రాన్స్)ను చిత్తుచేసి రెండోరౌండ్‌కు చేరాడు.

తెలంగాణా ప్రభుత్వానికి తెలుగు చిత్ర పరిశ్రమ ధన్యవాదాలు

తెలుగు పరిశ్రమను వేధిస్తున్న పైరసీ భూతాన్ని తాజాగా తెలంగాణ రాష్ట్ర పోలీసులు అణిచివేశారు. ఐ-బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసి, సినిమా ఇండస్ట్రీకి తెలంగాణ పోలీసులు ఊరట కల్పించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుగు చిత్ర పరిశ్రమ తెలిపింది. తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన దర్శకులు భరత్‌భూషణ్, నిర్మాత సి. కళ్యాణ్, చదలవాడ శ్రీనివాస్, ప్రతినిధులు వల్లభనేని అనిల్‌కుమార్, వీర శంకర్, ముత్యాల రామ ప్రసాద్, బాపిరాజు, ప్రసన్నకుమార్, రాంబాబు, అమ్మిరాజు మాట్లాడారు. పైరసీ చేసే వారి పట్ల పోలీసులు చాలా కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఇకపై పైరసీ అనే భూతాన్ని రాకుండా ఆపాలని కోరారు. తమ చిత్ర పరిశ్రమకు అండగా నిలిచిన పోలీసులతో పాటు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పైరసీని అరికడితేనే కొత్త నిర్మాతలు ధైర్యంగా ముందుకు వచ్చి సినిమాలు తీస్తారన్నారు. ప్రతి ప్రేక్షకుడు థియేటర్‌కు వచ్చి సినిమా చూడాలని కోరారు.

హాల్‌ఆఫ్ ఫేమ్‌కు రోజర్ ఫెదరర్ ఎంపిక

న్యూయార్క్: అంతర్జాతీయ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌కు దిగ్గజ ఆటగాడు, స్విట్జర్లాండ్ తరపున అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన రోజర్ ఫెదరర్ ఎంపికయ్యాడు. రోజర్ ఫెదరర్ తన తొలి టెన్నిస్ అరంగేట్రం మ్యాచ్‌తోనూ ఇందుకు ఎంపికయ్యాడని రోడ్ ఐలాండ్‌కు చెందిన హాల్ బుధవారం ప్రకటించింది. టెన్నిస్ జగత్తులో 20 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు సాధించిన తొలి ఆటగానికి ఫెదరర్ రికార్డుపుటల్లోకెక్కాడని, ఈ క్రమంలో యువ క్రికెటర్లు నొవాక్ జకోవిచ్(సెర్బియా), రఫెల్ నాదల్(స్పెయిన్)లతో ధీటుగా పోరాడి గ్రాండ్‌స్లామ్ సాధించాడని పేర్కొంది. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు 8 సాధించిన తొలి ఆటగాడు కూడా ఫెదరర్ మాత్రమే. గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు ఆస్ట్రేలియన్ ఓపెన్(6), యుఎస్ ఓపెన్(5), ఫ్రెంచ్ ఓపెన్(1) కైవసం చేసుకున్నాడు. తాజా ఓటింగ్‌లో ఫెదరర్‌కు ఎన్ని ఓటర్లు వచ్చాయో వెల్లడించలేదు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68